ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం 5 జనవరి 2018 16 పేజీలు



తెలుగులో సంతకం చేస్తున్న సబ్ కలెక్టర్ సత్పథి

# ఉన్నతంగా ఎదగడానికి ప్రతీ ఒక్కరికి అవకాశం

**విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తా**

**సబ్ కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టిన పమెలా సత్పథి**

**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచలం చాలా బాగుంది. ఇక్కడి వాతావరణం చూసి సంతోషంగా ఉన్నాను. తొలి పోస్టింగ్ పుణ్యక్షేత్రంలో చేపట్టి ప్రజలకు సేవచేసే భాగ్యం పొందానని నూతన సబ్ కలెక్టర్ పమెలా సత్పథి తెలిపారు. ఈమె గురువారం సబ్ కలెక్టర్ కార్యాలంలో బాధ్యతలు ఆర్డీవో శివనారాయణరెడ్డి నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే... భద్రాచలం కూడా మా ప్రాంతంలాగానే ఉంది. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రతీ ఒక్కరికి అవకాశం వస్తుంది. ప్రజాసేవ చేయడానికి నాకు వచ్చిన ఈ అవకాశాన్ని వంద శాతం సద్వినియోగం చేసుకుంటా. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తా. బాగా పని చేసే వారంతా నాకు స్ఫూర్తిగా నిలుస్తారు. మా అమ్మ నాకు స్ఫూర్తి. ఆమెతో పాటు చాలా గిరిజన గ్రామాలను ప్రత్యక్షంగా చూశాను. వారి సమస్యలపై అవగాహన ఉంది. వారు హక్కులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి.. గిరిజన ప్రాంతంలో పరిస్థితులపై అవగాహన ఉన్నందున ఇక్కడ చేరడం ఆనందంగా ఉంది. మాతా శిశు ఆరోగ్య పరిస్థితులపై శ్రద్ధ చూపిస్తా. భద్రాచలం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. క్షేత్ర పర్యటన తర్వాత ఇక్కడి పరిస్థితులను ఆకలింపు చేసుకుని రెవెన్యూ డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటా అన్నారు. అనంతరం రెవెన్యూ డివిజన్ గురించి అడిగి అధికారులను తెలుసుకున్నారు. గతంలో 8 మండలాలతో డివిజన్ ఉండగా తెలంగాణ విభజన సమయంలో మూడు మండలాలు పూర్తిగా ఒక మండలం పాక్షికంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపినట్లు అధికారులు ఆమెకు వివరించారు. భద్రాచలంలోని రెండు కాలనీలు కూడా ఏపీలో కలిశాయన్నారు. భద్రాచలం-దుమ్ముగూడెం మండలాల మధ్యలో కూడా సరిహద్దు సమస్య ఉన్నట్లు తెలిపారు. రేఖాచిత్రాన్ని చూపిస్తు వాజేడు, వెంకటాపురం మండలాలు భూపాలపల్లి జిల్లాలో విలీనమయ్యాయని తెలిపారు. భద్రాచలం, పినపాక ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ రెవెన్యూ డివిజన్

మిగతా 2లో



**బాస్కెట్‌బాల్ ఛాంపియన్ హైదరాబాద్**

వివరాలు 6లో

**గతేడాదితో పోలిస్తే తగ్గిన బొగ్గు ఉత్పత్తి**

**2017 చివరి నాటికి 88 శాతం ఉత్పత్తి**



# బొగ్గు.. లక్ష్యం తగ్గు

కొత్తగూడెం (సింగరేణి), న్యూస్‌టుడే

**ల**క్ష్యసాధన దిశగా సింగరేణి సంస్థ పరుగులు పెడుతోంది. అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉత్పత్తి సంవత్సరాంతానికి లక్ష్య సాధన పట్ల సందిగ్ధత నెలకొంది. గతేడాది సాధించిన ఉత్పత్తి కన్నా ఇప్పటి వరకు అధికోత్పత్తిని సాధించకపోవడం, గతంలో సాధించినంత మొత్తం కూడా ఇప్పటి వరకు సాధించకపోవడం ఈ సందిగ్ధతకు కారణంగా నిలుస్తోంది. గడిచిన ఉత్పత్తి సంవత్సరంలో (2016 సంవత్సరాంతానికి) 4,24,17,013 టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా ఈసారి(2017 సంవత్సరాంతానికి) 4,19,91,434 టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రం లభించింది. గడిచిన ఉత్పత్తి సంవత్సరం కన్నా ఆరు మిలియన్ టన్నుల అధిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ధారించుకొన్న సింగరేణి ఆ లక్ష్యాన్ని చేరుకొనేందుకే ఆపసోపాలు పడుతోంది. ఈ ఉత్పత్తి సంవత్సరం లక్ష్యమైన 66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించడంలో సింగరేణి సఫలీకృతం అవుతుందో లేదోనన్న సందిగ్ధత సర్వత్రా నెలకొంది.

## 100శాతం లక్ష్యంతో..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలుండగా అందులో మూడు ఏరియాలు మాత్రం నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాయి. రామగుండం-3 ఏరియా 120 శాతం లక్ష్యాన్ని సాధించి సింగరేణిలోని మిగిలిన ఏరియాల కన్నా మిన్నగా అగ్రస్థానంలో నిలుస్తోంది. బెల్లంపల్లి ఏరియా 104 శాతం లక్ష్యంతో ద్వితీయ, మణుగూరు ఏరియా 103శాతం లక్ష్యంతో మూడోస్థానంలో నిలుస్తోంది. కొత్తగూడెం ఏరియా 98 శాతం, రామగుండం-1 ఏరియా 95శాతం, భూపాలపల్లి ఏరియా 89 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 85 శాతం, రామగుండం-2 ఏరియా 83 శాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధించాయి. ఇల్లెందు ఏరియా 70 శాతం, మందమర్రి ఏరియా 54 శాతం, అడ్రియాల ప్రాజెక్టు 19శాతం లక్ష్యాలను మాత్రం సాధించాయి. దీంతో సింగరేణి వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 88 శాతం లక్ష్యాన్ని మాత్రం సాధించగలిగింది. లక్ష్యాన్ని చేరుకొనేందుకు ప్రస్తుతం ఉన్న 12శాతం లోటును పూడ్చుకోవాల్సి ఉంటుంది.

## మూడు నెలలే కీలకం

సింగరేణిలో ఉత్పత్తి సంవత్సరం మార్చితో పూర్తవుతుంది. అందువల్ల ప్రస్తుతం మిగిలిన మూడునెలలే బొగ్గు ఉత్పత్తిలో కీలకంగా నిలవనున్నాయి. ఈ మూడునెలల్లో బొగ్గు ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడకుండా ఏరియాలు నిర్దేశించిన లక్ష్యాల వైపు దూసుకుపోయేలా ఛైర్మన్ ఏరియావారీగా జీఎంలతో సమీక్షిస్తున్నారు. జీఎంలతో ముఖాముఖీలు నిర్వహించి ఏరియాలోని బొగ్గు ఉత్పత్తిని సమీక్షిస్తున్నారు. వెనుకంజకు

మిగతా 2లో

# అవినీతి ముద్ర

**● దళారుల చేతుల్లోకి స్మార్ట్‌కార్డులు ● ధ్రువీకరణ పత్రాల జారీలో మాయాజాలం**

**● ఖమ్మం ఆర్టీఏ కార్యాలయంలో ఇదీ పరిస్థితి**

ఖమ్మం గట్టయ్యసెంటర్, న్యూస్‌టుడే

**ఖ**మ్మం ఆర్టీఏ కార్యాలయం పరిధిలో వాహనదారులు తమ పనులు చక్కబెట్టుకోవాలంటే దళారుల్ని ఆశ్రయించక తప్పడంలేదు. ఈ క్రమంలో వారు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. వాహనదారులకు చేరాల్సిన ధ్రువీకరణ పత్రాలు దళారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. తపాలా కార్యాలయం నుంచి నేరుగా వాహనదారులకు చేరాల్సిన వాహనం, డ్రైవింగ్ ధ్రువీకరణలకు సంబంధించిన స్మార్ట్ కార్డులు ఇట్టే మాయం అవుతున్నాయి. చెప్పులరిగేలా ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరిగితేగానీ పత్రాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో అవి ఎవరివద్ద ఉన్నాయో వెతుక్కోవాల్సిన దుస్థితి. స్వయంగా కార్యాలయంలోని ఉద్యోగులే ఫలానా వారి వద్ద ధ్రువీకరణ పత్రాలు

మిగతా 2లో




మరమ్మతులకు గురైన ముద్రణ యంత్రం

# పూత.. ఎదురీత

**పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం ▌ఆవిరవుతున్న మామిడి రైతుల ఆశలు**

పెనుబల్లి, చంద్రుగొండ, న్యూస్‌టుడే

**మొ**న్న మిరప.. నిన్న పత్తి.. ప్రస్తుతం మామిడి.. రైతులు ఏ పంటను ఎంచుకొన్నా.. కష్టాలకు ఎదురీదక తప్పడంలేదు. మామిడి రైతుల ఆశలు ఈ ఏడాది పూత దశలోనే ఆవిరవుతున్నాయి. ఉభయ జిల్లాల్లో సుమారు 45వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా డిసెంబరులో తోటలు పూతతో కళకళలాడేవి. ప్రస్తుతం మామిడి చెట్లు వెలవెలబోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు రైతులకు శాపంగా మారాయి. ప్రకృతి కరుణించకపోవడం, వాతావరణ సమతుల్యం లోపించడం పంట దిగుబడులపై ప్రభావం పడేలా ఉంది. ఈపాటికి పూతతో కళకళలాడాల్సిన చెట్లు 5-10 శాతం పూత కనిపించకపోవడంతో

మిగతా 2లో



కల్లూరు మండలంలో పూత లేని మామిడి తోట

(మొదటి పేజీ తరువాయి) ఉన్నాయని, వారి చరవాణికి ఫోన్ చేసి తీసుకోండని చెబుతుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఫలితంగా వాహనదారులకు అన్ని అర్హతలున్నా అపరాధ రుసుములు చెల్లించుకోవాల్సి వస్తోంది. పరోక్షంగా దళారీ వ్యవస్థను ఆశ్రయించాలనే సంకేతాలు ఇప్పించడానికే కొందరు ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కార్డుల బట్వాడా ఇలా జరగాలి:** ఏదైనా వాహనాన్ని కొనుగోలు చేసిన సమయంలో దానిని రిజిస్ట్రేషన్ చేయించడం తప్పనిసరి. దీనికోసం వాహనదారులు వాహన షోరూం నుంచి వచ్చే తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాలతో మీసేవాలోగానీ ఆన్‌లైన్‌లోగానీ తొలుత బుకింగ్ చేయించుకుని పత్రాలు తీసుకొని నేరుగా ఆర్టీఏ కార్యాలయంలోని ఏదేని కౌంటర్‌లో సమర్పించాలి. ఆ పత్రాలను పరీక్షించిన వాహన తనిఖీ అధికారి వాటిని ధ్రువీకరించి రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆ

## తెరపై ఈనాడు

మహేశ్వరీ: హలో
పూర్ణ: హేయ్ పిల్లగాడ
విశ్వరూప: 2 కంట్రీస్
దుర్గా: ఎంసీఏ
పరమేశ్వరీ: ఒక్క క్షణం

**పాల్వంచలో**

వెంకటేశ్వర: ఎంసీఏ, **వేణుగోపాల్:** ఒక్క క్షణం, **శాంతి:** 2 కంట్రీస్

## చికెన్ ధరలు



వెన్‌కాబ్ (కిలో 1కి రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ ఫారం ధర | 86 |
| రిటైల్ ధర | 108 |
| చికెన్ విత్ స్కిన్ | 157 |
| చికెన్ స్కిన్‌లెస్ | 178 |

# అవినీతి 'ముద్ర'

తర్వాత వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం(ఆర్సీకార్డు) వాహనదారుని ఇంటికి నాలుగు రోజుల్లో చేరుతుంది. ఇదే విధంగా లైసెన్సు కోసం వచ్చిన వాహనదారులు సైతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేయించుకుని కార్యాలయానికి నేరుగా వస్తే పత్రాలను ధ్రువీకరించిన వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారికి లైసెన్సు జారీ చేస్తారు. ఈ లైసెన్సు వాహనదారుని ఇంటి చిరునామాకు పోస్టు ద్వారా వస్తుంది. రెన్యూవల్ కార్డులు సైతం ఇలాగే వాహనదారుని ఇంటికి నేరుగా పోస్టు ద్వారానే ఇంటికి చేరుతాయి. ఈ పత్రాలకు సంబంధించిన స్మార్ట్ కార్డులను వాహనదారుని ఇంటికి పంపేందుకు ప్రభుత్వం వారి వద్ద నుంచి రూ.30-40 దరఖాస్తు చేసుకునే సమయంలోనే వసూలు చేస్తుంది.

**వేలల్లో అచ్చు వేస్తున్నా.. :** ప్రతినెలా ఖమ్మం ఆర్టీఏ కార్యాలయంలో వాహనం, డ్రైవింగ్ ధ్రువీకరణలకు సంబంధించిన స్మార్ట్‌కార్డులు వేల సంఖ్యలో అచ్చు అవుతున్నా తపాలా కార్యాలయానికి మాత్రం వందల్లోనే చేరుతున్నాయి. మిగిలిన స్మార్ట్ కార్డులు ఎక్కువ శాతం అనధికారిక సహాయకులు, దళారుల చేతుల్లోనే ఉంటున్నాయి. కార్యాలయంలో పోస్టాఫీసుకు చెందిన రిజిస్టర్(బీఎన్‌పీఎల్)లో ధ్రువీకరణ పత్రాలు పోస్టు చేయకుండానే వాటిలో పోస్టు చేసినట్లు నమోదు చేస్తున్నారు. దీంతో ఎవరైనా వాహనదారులు ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయానికి వస్తే పోస్టుద్వారా పంపామని, అవి ఇంటికి చేరతాయని చెబుతున్నారు. దీంతో చేసేదిలేక కార్డు ఇంటికే వస్తుందేమోనని తిరుగుముఖం పడుతున్నారు. ధ్రువీకరణలకు సంబంధించిన కార్డుల బుకింగ్ కోసం ఆర్టీఏ కార్యాలయ సిబ్బందితోపాటు అనధికారిక సహాయకులు కూడా వస్తున్నారని తపాలా సిబ్బంది చెబుతుండటం గమనార్హం. పూర్తిస్థాయిలో పోస్టు చేయకున్నా వాహనదారులకు చేశామని సిబ్బంది చెబుతున్నారని, దీంతో వాటి విచారణ కోసం వాహనదారులు తపాలా కార్యాలయానికి వస్తున్నారని ఆశాఖ వారు తెలుపుతున్నారు.

**వాహనదారుల జేబులు గుల్ల:** అటు ఆర్టీఏ కార్యాలయంలో ఇటు తపాలా కార్యాలయంలో ఎక్కడ కూడా ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను బయటకు తీయలేని పరిస్థితి నెలకొంది. కొందరు అత్యవసరంగా వాహనాలను బయటకు తీస్తుంటే దారిలో ట్రాఫిక్ సిబ్బంది ఆపి జరిమానా విధించి చలానాలు రాస్తున్నారు. చేసేది లేక వాహనదారులు జరిమానా చెల్లించుకొని జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ధ్రువీకరణ కార్డులను ముద్రించే యంత్రం తరచూ మొరాయిస్తోంది. మూడు నెలలుగా తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీనికితోడు కార్డుల కొరత కూడా వేధిస్తుంది. దీంతో ఆర్సీ కార్డుల ముద్రణ ఆలస్యమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**కార్యాలయంలో నెలలో సగటున 3250–4000 వరకు అచ్చవుతుండగా తపాలా కార్యాలయానికి చేరుతున్న ధ్రువీకరణ పత్రాలు మాత్రం ఇలా ఉన్నాయి..**

| నెల | తపాలా కార్యాలయానికి చేరినవి |
|---|---|
| జనవరి | 416 |
| ఫిబ్రవరి | 00 |
| మార్చి | 534 |
| ఏప్రిల్ | 1572 |
| మే | 408 |
| జూన్ | 797 |
| జూలై | 410 |
| ఆగస్టు | 639 |
| సెప్టెంబరు | 805 |
| అక్టోబరు | 215 |

▮ వాహనం నవంబరులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. ధ్రువీకరణకు సంబంధించిన కార్డు కోసం కార్యాలయానికి వస్తే ఇంకా ముద్రణ కాలేదని చెప్పారు. అత్యవసరానికి వాహనాన్ని తీసుకొని బయటకు వస్తే ట్రాఫిక్ పోలీసులు ఆపారు. ధ్రువీకరణ పత్రం లేదని చలానా విధించారు. ఆర్టీఏ కార్యాలయంలో ఉన్నాయని చెప్పినా వినలేదు. దీంతో వాహనాన్ని బయటకు తీయలేని పరిస్థితి.

–రమేష్ (పేరు మార్చాం), ఖమ్మం

▮ నెల రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. అధికారులను గట్టిగా అడగడంతో వారు ఎవరిదో చరవాణి నంబరు ఇచ్చి వారి వద్ద నుంచి కార్డును తీసుకోమని చెప్పారు. సదరు వ్యక్తి వద్ద నుంచి కార్డును తీసుకున్నారు. కార్యాలయంలో ఉండాల్సిన ధ్రువీకరణ పత్రాలు వేరే వ్యక్తుల చేతుల్లోకి ఎందుకు వెళుతున్నాయి?

–కె.జగన్, ఖమ్మం

▮ నెలరోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రిజిస్ట్రేషన్ కార్డు ఇవ్వలేదు. గట్టిగా అడిగితే కార్డులు ముద్రించే యంత్రం మరమ్మతులకు గురయిందని తెలుపుతున్నారు. నగరంలో వాహన ధ్రువీకరణ పత్రాలు లేవని ట్రాఫిక్ సిబ్బంది ఆపుతున్నారు. వాహనాన్ని రోడ్డుపైకి తీసుకురావాలంటేనే భయంగా ఉంది. –అశోక్, ఖమ్మం

**విచారణ చేపడతాం:** శంకర్‌నాయక్, ఇన్‌ఛార్జి జిల్లా రవాణాధికారి

స్మార్ట్ కార్డులు తపాలా శాఖ ద్వారా ఎందుకు వెళ్లడం లేదో తెలుసుకుంటాం. నేను ఇటీవలే ఛార్జ్ తీసుకున్నాను. దీనిపై అవగాహన రావడానికి కొంత సమయం పడుతుంది. సమగ్రంగా విచారించిన తరువాత పూర్తి వివరాలు తెలుపుతాం.

## ఉన్నతంగా ఎదగడానికి ప్రతీ ఒక్కరికి అవకాశం

(మొదటి పేజీ తరువాయి) పని చేస్తుందన్నారు. ఐటీడీఏ ఏపీవో జనరల్ కె.భీమ్‌రావు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో రమాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, పలు సంస్థలు, సంఘాలు, అధికారులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

- **పేరు:** పమేలా సత్పథి
- **సొంత ప్రాంతం:** ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సునబేడా గ్రామం
- **విద్యార్హతలు:** బీటెక్ కంప్యూటర్ సైన్స్. ప్రాంగణ ఎంపికల్లో నెగ్గి ఓ సంస్థలో కొంత కాలం పని చేశారు. ఆ తర్వాత కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో ఫెలో సైంటిస్ట్‌గా పని చేశారు. సాహిత్యంపై అవగాహన ఉండటంతో పాటు పర్యాటకంపై మక్కువ ఉంది.
- **ఐఏఎస్ బ్యాచ్:** 2014లో పరీక్ష రాసి 51వ ర్యాంకు సాధించారు
- **శిక్షణ పొందిన ప్రాంతం:** ఐఏఎస్‌కు ఎంపికైన తర్వాత ముస్సోరిలో శిక్షణ పొందారు

**అసిస్టెంట్ కలెక్టర్‌గా..** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్ దగ్గర శిక్షణ పొందారు

- **తొలి పోస్టింగ్:** భద్రాచలంలో 04.01.2018న బాధ్యతల స్వీకరణ
- **తండ్రి పేరు:** ఆర్కే సత్పథి. ఆయన వృత్తి: డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధికారి
- **తల్లి పేరు:** ప్రభామయచార్య. ఈమె సొంత రాష్ట్రంలో వ్యవసాయ విభాగానికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రంలో పరిశోధకురాలు
- **భర్త:** ఎముకల వైద్య నిపుణులు
- తెలుగు భాషలో మాట్లాడగలరు. తన పేరును తెలుగులో చక్కగా రాయగలరు.

## బొగ్గు.. లక్ష్యం తగ్గు

(మొదటి పేజీ తరువాయి) కారణాలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఇప్పటికే పలు చర్యలు తీసుకొన్న దృష్ట్యా లక్ష్యాన్ని అందుకొనేందుకు ఏరియాల జీఎంలపై ఒత్తిడి తీసుకురానున్నారు. ఛైర్మన్ జీఎంలతో సమీక్ష జరిపిన అనంతరం ఏరియా జీఎంలు ఏరియాల్లోని ఇతర అధికారులతో సమీక్షలు నిర్వహించి బొగ్గు ఉత్పత్తి పెంపుదలకు చర్యలు చేపడుతున్నారు. చివరి మూడు నెలల్లో ఈ సమీక్షల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రతిరోజూ కనీసం రెండు లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేలా నిర్ణయం తీసుకొని రోజువారీ సమీక్షలను కూడా జరపనున్నారు ఇటీవలే కొన్ని ఏరియాలకు కావాల్సిన యంత్రాలను కూడా సమకూర్చిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాల్సిందిగా సూచిస్తున్నారు. కార్మికులకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించిన నేపథ్యంలో చివరి మూడునెలలు ఉత్పత్తి పెరగవచ్చని భావిస్తున్నప్పటికీ గతేడాది లభించినంత మొత్తంలోనే బొగ్గు ఉత్పత్తి లభిస్తున్న నేపథ్యంలో ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా సవరించే అవకాశాలు లేకపోలేదు. కానీ నిర్ధారించుకొన్న లక్ష్యాలను సాధించేందుకు మాత్రం యాజమాన్యం చివరి నెల వరకు ఒత్తిడిని కొనసాగించనుంది.







# పూత.. ఎదురీత

(మొదటి పేజీ తరువాయి) తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలు పంట కోసం ఎనిమిది నెలలు ఎదురుచూసే వీరి పరిస్థితి దయనీయంగా మారింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం మామిడితోటలకు ప్రసిద్ధి. సత్తుపల్లి పరిధిలోని అయిదు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాలలో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. పెనుబల్లి, కల్లూరు, వేంసూరు, సత్తుపల్లి, తల్లాడ మండలాల్లోని మామిడితోటల్లో ఇప్పటికే పూత రాక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు మండలాల్లోనే..:** సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి, వేంసూరు మండలాల్లోనే సుమారు 20 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి.

**నియోజకవర్గంలో మామిడితోటల వివరాలు..**

| మండలం | ఎకరాలలో |
|---|---|
| కల్లూరు | 4200 |
| పెనుబల్లి | 9585 |
| సత్తుపల్లి | 2117 |
| వేంసూరు | 9387 |
| తల్లాడ | 3075 |

▮ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో సుమారు ఏడు వేల ఎకరాలు, వైరా నియోజకవర్గంలో 5 వేల ఎకరాలు ఉండగా, ఖమ్మం నియోజకవర్గంలో సుమారు 4 వేలు ఎకరాల మేర మామిడితోటలు విస్తరించి ఉన్నాయి.

ఇక్కడ అధిక శాతం రైతులు మామిడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది రైతులకు నిరాశే మిగిలింది. మామిడి దిగుబడి భారీగా తగ్గనుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కంటే ఈసారి సుమారు 20-40 శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఆశించిన పూత రాకపోవడం అటుంచితే రాబోయే రోజుల్లో బలమైన గాలులు వీస్తే ఉన్న పూతను ఎలా కాపాడుకోవాలని తలలు పట్టుకొంటున్నారు. పిందె దశకు మారేంత వరకు ఉన్న పూత రాలకుండా ఉండాలంటే తోటలకు నీటి తడులు అందించడం అత్యవసరంగా మారింది.

**ప్రకృతిపైనే భారం..:** పూత మొదలు కాయలు కోసే వరకు పూర్తిగా అనుకూల వాతావరణం మీదనే మామిడి పంట ఆధారపడి ఉంటుంది. డిసెంబర్‌లో పూత ప్రారంభం కానుండగా ఇదే సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నా? ఎండలతో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనా? పూతపై ప్రభావం పడుతుంది. జనవరి నెలాఖరులో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చేర్పులు జరిగినా ఆశాభంగమే ఎదురవుతుంది. పిందె నుంచి కాయలుగా మారే సమయంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురువడం తదితర ప్రకృతి విపత్తులు సంభవిస్తే పంట చేతిరాకుండా పోతుంది. ఈ ఏడాది పూత దశలోనే ప్రతికూల వాతావరణం నమోదు కావడంతో సహజంగానే మామిడి దిగుబడులపై ప్రభావం చూపనుంది.

**సస్యరక్షణ చర్యలు శూన్యం:** అధికారుల సూచనలు పూర్తిగా కరవయ్యాయి. రైతులకు తోచిన విధంగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారే తప్ప ఉద్యానవనశాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పూర్తిగా వాతావరణంపై రైతులు ఆధారపడి ఉండటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రస్తుతం మామిడి పూత రాక పోవడంతో ఈ సారి పంట దిగుబడి తగ్గనుంది. మారిన పరిస్థితులకు అనుకూలంగా చర్యలు చేపడితే మంచి ఫలితం రావచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**జాడలేని గుత్తేదారులు..:** ప్రతిసారి డిసెంబరు, జనవరి నెలలో పూతను చూపి గుత్తేదారులు మామిడి తోటలను లీజుకు తీసుకునేవారు. ముందస్తుగానే రైతులతో ఒప్పందం చేసుకొని గుత్తేదారులు నగదు ఇచ్చి తోటలను కౌలుకు తీసుకునేవారు. అలాంటిది ప్రస్తుతం ఒక్క కౌలుదారులు కూడా రావడం లేదని రైతుల వాపోతున్నారు.

**ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**భారతి, ఉద్యానశాఖాధికారి, సత్తుపల్లి**

వాతారణంలో మార్పుల వల్ల పూత రాలేదు. ప్రసుత్త చలి ఎక్కువగా ఉన్న దృష్ట్యా మరో రెండు వారాల్లో పూత వచ్చే అవకాశం ఉంది. గతేడాది ఫిబ్రవరిలో వచ్చింది. ఈ సారి అంతకంటే ముందే వస్తుంది. ఈ చలి వల్ల తోటలపై తేనే మంచు పురుగు, ఫంగస్ వస్తుంది. అందువల్ల రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ఆయుష్.. ఆగమాగం

**వైద్యులు లేరు.. మందులేవు**

**మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఎక్కువ శాతం మంది సంప్రదాయ వైద్యాలైన ఆయుర్వేద, హోమియో, నేచురోపతిలపై మక్కువ చూపిస్తున్నారు. అల్లోపతికన్నా ఆయుర్వేద, హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు ఎంతో ఉపశమనం కలుగుతాయనే భావనలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వమూ ఈ వైద్యాన్ని సమర్థిస్తూ ఆయష్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కానీ కొంతకాలంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆయుష్ వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి. ఆయుష్‌లో 5 రకాల విభాగాలు ఉన్నాయి. ఆయుర్వేదం, హోమియో, యునాని, సిద్ధ, యోగా సేవలు. జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా వీటి సేవలను జిల్లాలో ప్రారంభించినా వీటిల్లో ఎక్కడా సక్రమంగా సేవలు అందడం లేదు. మందుల కొరత, వైద్యుల నియామకం లేక, డిప్యూటేషన్లు, నిర్వహణ లోపంతో ఏ వైద్యశాల చూసినా పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉంటున్నాయి.**

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయుష్ ఆసుపత్రులు 30 ఉన్నాయి. ఆయుర్వేద, హోమియో, యునాని విభాగాలు కొన్ని సొంత భవనాల్లో పనిచేస్తుండగా, కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, కొన్ని అద్దె గదుల్లో పనిచేస్తున్నాయి. వాటిల్లో మెడికల్ ఆఫీసర్, కంపౌండర్, నాలుగో తరగతి ఉద్యోగులు విధులు నిర్వహించాలి. చాలా ఆసుపత్రుల్లో వైద్యులు, కంపౌండర్లు లేక పేరుకే ఆసుపత్రులుగా ఉంటున్నాయి.


చుంచుపల్లి ఆయుర్వేద వైద్యశాల

అంతేకాకుండా గత మూడేళ్ల నుంచి మందులు సరఫరా లేదు. దీంతో ఆ ఆసుపత్రులు కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా దర్శనమిస్తున్నాయి. ఆయుర్వేద ఆసుప్రతుల్లో అత్యధిక మంది రోగులు అశ్వగంధం, త్రిపర చూర్ణం, సర్పగంధం తదితర మందులను వినియోగిస్తుంటారు. జలుబు, దీర్ఘకాలిక నొప్పులకు రోగులు హోమియో ఆసుపత్రులను ఆశ్రయిస్తుంటారు. వారికి మందులు పంపిణీ చేద్దామన్నా లేని దుస్థితి.. ఇక యునాని సేవలు ఉన్నాయని ప్రజలకు తెలియని పరిస్థితి.

### రోజూ సేవలందించాలి..

మందులు, వైద్యులు లేకున్నా ఆయుష్‌లోని వివిధ భాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం రోజు విధులకు రావాలి. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా వస్తున్నా వైద్యులు హాజరుకావడం లేదనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లను వేయడంతో కొన్ని ఆసుపత్రుల్లో సంవత్సరాల తరబడి మెడికల్ ఆఫీసర్లు లేకుండా కేవలం కంపౌండర్లు, నాలుగో తరగతి ఉద్యోగులతోనే ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. చుంచుపల్లి మండలం బాబుక్యాంప్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో వైద్యురాలు కొన్నేళ్లుగా ఆమెకు అనుకూలమైన


మందులు లేక ఖాళీగా ఉన్న డబ్బాలు

ప్రాంతాల్లో డిప్యూటేషన్లు వేయించుకోవడంతో ఆగస్టు వరకు కంపౌండర్‌తో వైద్య సేవలు కొనసాగాయి. అతను కూడా ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం నాలుగో తరగతి ఉద్యోగి విధులను నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి ఉన్నా రోగులు వచ్చి వైద్యసేవలు లేక వెనుదిరిగిపోతున్నారు. ఇలా జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో వైద్యుల కొరత, మందుల కొరతతో ఆయుష్ సేవలు అందని ద్రాక్షగా మారాయి.

### త్వరలోనే ఖాళీల భర్తీ: డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు, వరంగల్

పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్‌తో అనుమతి తీసుకున్నాం. మెరిట్ లిస్ట్ సిద్ధంగా ఉంది. డీఎంఅండ్‌హెచ్‌వో చర్చించి ఈ నెలలోనే పోస్టుల భర్తీని చేపడతాం. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల్లో జాప్యం జరుగుతుంది. దానివలన మందుల కొరత కొంత ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిధుల విడుదల చేసేందుకు బడ్జెట్ సిద్ధం చేశాం. త్వరలో నిధులు విడుదల కాగానే మందుల సరఫరా జరుగుతుంది.

## జిల్లాలో ఖాళీలు ఇలా..

జిల్లాలో ఆయుర్వేద, హోమియో, యునాని, నేచురోపతి కలిపి మొత్తం 30 వైద్యశాలలున్నాయి. అందులో పలుచోట్ల వైద్యులు, కంపౌండర్లు, కింది స్థాయి సిబ్బంది లేరు.

**ఆయుర్వేద వైద్యశాలలు.. ఖాళీలు**

1. అశ్వాపురం- మెడికల్ ఆఫీసర్
2. కరకగూడెం- మెడికల్ ఆఫీసర్, నాలుగో తరగతి ఉద్యోగి
3. ఆర్.కొత్తగూడెం- మెడికల్ ఆఫీసర్
4. చుంచుపల్లి- మెడికల్ ఆఫీసర్ డిప్యూటేషన్, కంపౌండర్
5. ఎంపి.బంజర్- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
6. పాల్వంచ- మెడికల్ ఆఫీసర్
7. జగన్నాథపురం- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
8. జూలూరుపాడు- మెడికల్ ఆఫీసర్
9. మణుగూరు- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్

**హోమియోపతి వైద్యశాలలు.. ఖాళీలు**

10. ఇల్లెందు- కంపౌండర్
11. అశ్వారావుపేట- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
12. పర్ణశాల- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
13. చంద్రుగొండ- మెడికల్ ఆఫీసర్
14. చర్ల- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
15. పినపాక- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్

**యునాని వైద్యశాలలు.. ఖాళీలు**

16. పాపకొల్లు- మెడికల్ ఆఫీసర్
17. భద్రాచలం- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
18. రేగళ్ల- మెడికల్ ఆఫీసర్
19. అశ్వారావుపేట- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
20. గుమ్మడిపల్లి- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్
21. జానంపేట- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్

**నేచురోపతి వైద్యశాల.. ఖాళీలు**

22. నర్సాపురం- మెడికల్ ఆఫీసర్, కంపౌండర్

# గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

**జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్**

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర వేడుకలకు అధికారులు పక్కా ప్రణాళికలతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఏ విధంగా చేపట్టాలో ఆయన గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేడుకలను రామాటాకీస్ రోడ్డులో ఉన్న ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు ఆయా శాఖల అధికారులు సిద్ధం కావాలన్నారు. మైదానాన్ని అందంగా తీర్చిదిద్ది, ఏర్పాట్లను పర్యవేక్షణ బాధ్యతలను కొత్తగూడెం తహసీల్దారు అశోక చక్రవర్తికి అప్పగించారు. అధికారులు ఉదయం 8.45 గంటల కల్లా ప్రగతి మైదానానికి చేరుకొని పతాకావిష్కరణలో పాల్గొనాలన్నారు. పోలీసులు కవాతు ఏర్పాట్లు చేయాలని, ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలందించే బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.కిరణ్‌కుమార్‌కి అప్పగించారు. జాతీయ సమైక్యతపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వికలాంగులు, లబ్ధిదారులు, రైతులకు ప్రత్యేక టెంట్లు వేయాలన్నారు. కొత్తగూడెం మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రగతి మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథి ప్రసంగం పాఠానికి అవసరమైన జిల్లా అభివృద్ధి నివేదికలను ఈ నెల 10వ తేదీలోగా జిల్లా పౌర సంబంధాల శాఖాధికారికి అప్పగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జగత్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ ఎస్.ఎం.అలీ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ

# రామయ్యకు కిట్టయ్య ఆతిథ్యం


కృష్ణాలయానికి వేంచేస్తున్న రామయ్య

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో గత నెల 29న ప్రారంభమైన రాపత్తు ఉత్సవాలు ఈనెల 7 వరకు సాగనున్నాయి. స్వామివారు ప్రతీరోజు రాత్రి వేళ్ల రోజుకో మండపానికి వెళ్లి సేవ అందుకుంటున్నారు. ఇందులో భాగంగా రాములవారికి గురువారం రాపత్తు సేవ కనుల పండువగా సాగింది. ఆలయం నుంచి వేంచేసిన రాములవారు కల్యాణ మండపం రోడ్డులోని శ్రీకృష్ణాలయానికి చేరుకున్నారు. రామయ్య తండ్రి కృష్ణ పరమాత్ముడి ఆలయానికి వెళ్లే దారిలో భక్తులు కోలాటాలు ఆడి భజనలు చేయడంతో ఆధ్యాత్మికత తాండవించింది. కృష్ణాలయంలోని గోకుల మండపంలో పూజలు జరిగాయి. నామార్చనలు చేసి తీర్థ ప్రసాదాలను అందించినట్లు ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో దర్శనాలు చేసుకున్నారు. నేడు కల్కి అవతార దర్శనం ఉంటుంది. విశ్రాంత మండపంలో దొంగల దోపు ఉత్సవం జరుగనుంది. 6న దసరా మండపానికి రాముడు వేంచేస్తాడు. ఈ మండపంలో జరిగే పూజల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండడంతో ఈవో ప్రభాకర శ్రీనివాస్ ఆదేశాలతో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఏర్పాట్లు చేపట్టారు. 7న చిత్రకూట మండపంలో రాపత్తు సేవ ఉంటుంది.

### రామయ్యకు ఘనంగా పట్టాభిషేక మహోత్సవం

భద్రాచలం రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు ప్రధాన కోవెలలో మూల విరాట్‌కు సుప్రభాతం పలికి ఆరాధించి అర్చనలు చేశారు. క్షేత్ర విశిష్టత తన్మయులను చేయగా వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ చేసి పుణ్యాహ వాచనం జరిపి కంకణ ధారణ నిర్వహించారు. కన్యాదానం చేసి ప్రవరను పఠించి సీతమ్మకు యోక్త్రాన్ని రామయ్యకు యజ్ఞోపవీతాన్ని ధరింపజేసి నిత్య కల్యాణ క్రతును కమనీయంగా జరిపారు. తలంబ్రాల వేడుక మంత్రముగ్ధులను చేయగా మాంగళ్య ధారణ ఆధ్యాత్మికతను రెట్టింపు చేసింది. దర్బారు సేవ పరమానందం కలిగించింది. ఉప ప్రధానార్చకులు రామస్వరూప్ పర్యవేక్షణలో పుష్యమిని పురస్కరించుకుని రాములవారికి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. రాజాధిరాజు రామరాజును కీర్తిస్తు ఛత్ర చామరాతో సేవలు చేశారు. పట్టాభిషేకం గురించి సాగిన ప్రవచనం అలరించింది.


ఆలయాన్ని దర్శించుకున్న సబ్ కలెక్టర్ పమెలా సత్పథి

### రామాలయాన్ని దర్శించుకున్న పమెలా సత్పథి

భద్రాచలం రామాలయాన్ని పమెలా సత్పథి గురువారం దర్శించుకున్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందిన ఈమె మర్యాదపూర్వకంగా కొత్తగూడెంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీని కలిసి అక్కడి నుంచి వచ్చి విధుల్లో చేరడానికి ముందు రామాలయాన్ని దర్శించుకున్నారు. మెట్లకు మొక్కుకుని రాజగోపురం వద్దకు చేరుకోవడంతో ఏఈవో శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్ కనకదుర్గ ఘనంగా ఆహ్వానించారు. ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సీతా రామానుజాచార్యులు నేతృత్వంలో వేద పండితులు హనమత్‌శాస్త్రి, ప్రసాద అవధాని, కామేశ్వర శర్మ, పురోహితులు వెంకటేశ్వర అవధాని, ఉప ప్రధాన అర్చకులు విజయ రాఘవన్ ఆశీర్వచనం అందించారు. ప్రధాన కోవెలలో మూల విరాట్‌ను దర్శించుకుని కానుకలను సమర్పించారు. అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామివారిని లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం తరుపున తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ చరిత్రను వైదిక పెద్దలు వివరించారు. ఇక్కడ జరిగే ఉత్సవాల విశేషాలను ఆమెకు తెలిపారు. కోవెలలో ఉన్నంత సేపు సబ్‌కలెక్టర్ ఆధ్యాత్మిక భావంతో గడిపారు. ఈమె వెంట ఆర్డీవో శివనారాయణ రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

# సుజాతనగర్ పీహెచ్‌సీని సందర్శించిన కాయకల్ప బృందం

సుజాతనగర్(కొత్తగూడెం గ్రామీణం), న్యూస్‌టుడే: సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప నిపుణుల బృందం గురువారం సందర్శించారు. కాయకల్ప నిపుణులు, భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి, జిల్లా క్వాలిటీ మేనేజర్ శృతి ఆధ్వర్యంలో ఆసుపత్రిని పరిశీలించారు. వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను చూశారు. పరీక్ష కేంద్రాన్ని, మందుల నిల్వలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, తాగునీటి వసతి, మరుగుడొడ్లు ఇతర సౌకర్యాలను ప్రత్యేక్షంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కాన్పులు, శిశువులకు అందిస్తున్న వ్యాక్సిన్ల జాబితాను పరిశీలించారు. అనంతరం కాయకల్ప నిపుణులు కోటిరెడ్డి మాట్లాడుతూ చంద్రుగొండ, దుమ్ముగూడెం, సుజాతనగర్ పీహెచ్‌సీల పరిశీలన బాధ్యతలను తనకు అప్పగించారన్నారు. దానిలో భాగంగా సుజాతనగర్ పీహెచ్‌సీ పరిశీలన చేపట్టానన్నారు. ప్రభుత్వం అందించే వైద్యపరికరాల వినియోగం, శానిటేషన్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సపోర్టివ్ సర్వీసెస్, హైజిన్ ప్రమోషన్ అనే అంశాలను పరిగణలో తీసుకొని పరిశీలన చేస్తామన్నారు. ఇక్కడి వైద్యశాల స్థితిగతులు, సేవలు, సౌకర్యాలు, వైద్యసిబ్బంది ప్రవర్తన, రోగులతో సిబ్బంది వ్యవహరించే తీరు అన్నింటిని బేరీజు


వైద్య సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకొంటున్న బృందం సభ్యులు

వేసి మార్కులను వేస్తామన్నారు. జిల్లా వైద్యాధికారి దయానందస్వామి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి భాస్కర్‌నాయక్, పీహెచ్‌సీ డీడీవో వినోద్, వైద్యులు రాజేశ్ ఉన్నారు.

# భద్రాచలం



## కూరగాయల ధరలు(కిలో రూ.ల్లో)

**భద్రాచలం:** ఉల్లిపాయలు 50, టమాట 10, అల్లం 60, బెండకాయలు 40, దొండకాయలు 30, పచ్చి మిరప 40, బంగాళదుంపలు 20, వంకాయలు 30, క్యారెట్ 60, క్యాబేజీ 40, మునగకాయ మూడు 20, చింతపండు 200, చేమదుంపలు 40, ఆనప 10.

## సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** న్యాయవాది పీఎల్‌వీఎస్ మూర్తి మృతికి బార్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులు బహిష్కరించి సంతాపం తెలియజేసినట్లు అధ్యక్షుడు టి.వసంతరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సంతాప సభలో జడ్జి కేకేవీ బులికృష్ణ మాట్లాడారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. సభలో కార్యదర్శి శ్రీనివాస ప్రసాద్, కొడాలి శ్రీనివాస్, చైతన్య, రామ్మోహన్, కృష్ణమాచారి, శ్రీనివాసరావు, రవి వర్మ, ప్రకాశ్, అంబేడ్కర్, కిషోర్ పాల్గొన్నారు.

## నేత్రాల రక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** స్థానిక గౌతమ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కంటి చూపుపై రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు రమేశ్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించి విద్యార్థులు ఎదుర్కొనే కండరాల సమస్యపై ప్రాథమిక చికిత్స సలహాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దోసపాటి కార్తీక్, ఇందుమతి, ప్రిన్సిపల్ జగదీశ్వర్ రెడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ట్రైకార్ ఛైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు సన్మానం చేస్తున్న దృశ్యం

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** భద్రాచలం జూనియర్ కళాశాల సెంటరు వద్ద గల బాబా ఆలయంలో నూతన సంవత్సరం మొదటి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాను వివిధ రంగుల బంతి పూలతో అలంకరించారు. ప్రత్యేక హారతులు పాడి, అభిషేకం నిర్వహించినట్లు అధ్యక్షుడు మాగంటి సూర్యం తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే, ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఆయనను ఘనంగా ఆహ్వానించి శాలువతో సత్కరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ విద్యా సదస్సులు

**అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా త్వరలో గ్రామీణ విద్యా సదస్సులు నిర్వహిస్తామని ఉపాధ్యాయ సంఘం టీఎస్‌యూటీఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి వెల్లడించారు. గురువారం భద్రాచలంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బీఏ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను పట్టించుకోకుండా కేజీ నుంచి పీజీ పేరుతో గురుకులాలు పెట్టి ప్రభుత్వం చేస్తోంది ప్రచార ఆర్భాటమేనని ప్రజలకు వివరిస్తామని అన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థికి ఇచ్చే ఖర్చులో సగ భాగం కూడా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఇవ్వడం లేదన్నారు. అనంతరం భద్రాచలం శాసన సభ్యులు సున్నం రాజయ్యతో కాలమానిని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాందాస్, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, స్వర్గజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కాలమానినిని ఆవిష్కరిస్తున్న సున్నం రాజయ్య, ఉపాధ్యాయులు

# లాఠీ పట్టిన చేయి.. కవితలు రాస్తోంది

> ప్రతీ వ్యక్తికి చిన్ననాటి నుంచి ఏదో ఒక అంశంపై ఆసక్తి ఉంటుంది. వారి కళలో నైపుణ్యంతో భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిగమించేందుకు పట్టుదలతో కృషి చేస్తుంటారు. ఒకవైపు వృత్తి చేస్తూ బహుముఖ ప్రజ్ఞ చూపేవారు కొందరే. అటువంటి కోవకే చెందుతారు భద్రాచలానికి చెందిన కేశబోయిన ప్రసాద్. కష్టపడి చదివి పట్టుదలతో సర్కారు కొలువు సాధించారు. ఒక వైపు పోలీస్ కానిస్టేబుల్‌గా ప్రజలకు రక్షణ కల్పిస్తూ మరో వైపు తనకున్న అభిరుచి మేరకు కళా రంగంలో ప్రతిభ చూపుతూ పలువురి చేత ప్రశంసలు అందుకుంటున్నారు.
>
> భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

**బహుముఖ ప్రజ్ఞ చూపుతున్న కానిస్టేబుల్**

**రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం**

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే



స్ఫూర్తి

భద్రాచలంలోని అశోక్‌నగర్‌కాలనీకి చెందిన కేశబోయిన ప్రసాద్ పట్టుదలతో పోలీస్ కానిస్టేబుల్ కొలువు సాధించారు. చదువుతో పాటు తనకున్న ప్రత్యేక కళలకు నాటి నుంచి పదును పెడుతూ వచ్చారు. చదువుతో పాటు కరాటే, మిమిక్రీ, పాటలు, ఆటలు, సమాజ సేవ, రచనా వ్యాసంగం ఇలా అనేక కళలలో ప్రతిభ చూపుతూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రథమ స్థానం సాధించే వారు. చదువుతో పాటు ఆటలలో కబడ్డీలో పట్టు సాధించి రాష్ట్ర స్థాయి క్రీడల్లో బహుమతులు అందుకున్నారు. పాటలలో ప్రావీణ్యం సంపాదించి పట్టణంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో తెలంగాణ సంస్కృతిపై పాటలను పాడుతూ పలువురి చేత అభినందనలు అందుకుంటున్నారు. కరాటేలో ప్రతిభ చూపించి బ్లాక్ బెల్టు సాధించి సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. వీటితో పాటు మిమిక్రీ చేసి పలువురి వినోదం పంచుతూ వస్తున్నారు. మిమిక్రీలో తనకు పట్టున్న సినీ హీరోలు, రాజకీయ నాయకుల గొంతును అనుకరించడంతోపాటు సహజసిద్ధమైన గొంతుతో వివిధ వ్యాయిద్య పరికరాల శబ్ధాలు చేస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. చాలాసార్లు మిమిక్రీ ప్రదర్శనలు ఇచ్చి వీక్షకులతో ఆహా అనిపించారు. ప్రముఖుల చేతుల మీదుగా సన్మానాలు అందుకున్నారు. దీంతో పాటు నటనలో ఏకాపాత్రాభినయంలో ప్రదర్శనలు ఇచ్చారు.




ప్రపంచ తెలుగు మహాసభల్లో సన్మానం పొందుతూ..

సమాజ సేవ: తమకున్న ప్రత్యేకతలలో సమాజ సేవ ఒకటి. చిన్ననాటి నుంచి తన తండ్రి కనకయ్య స్వగ్రామంలో ప్రజలకు చేస్తున్న సేవలను చూసి తానూ అలవర్చుకున్నారు. తనకు ఉన్నంతలో పలువురికి సేవలు అందించాలని లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. దీంతో అనాథ ఆశ్రమాలు, ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి తను కొలువులో చేరిన నాటి నుంచి 76 పాఠశాలలో గోడ గడియారాలను అందించారు. తాను చదివిన పాఠశాలలో ఏటా పదో తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు అందిస్తూ రూ.వెయ్యి పారితోషికం అందిస్తున్నారు. దీంతో పాటు ఆటలను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు టోర్నమెంట్‌లు నిర్వహించి వారికి కావాల్సిన క్రీడల దుస్తులు, ఆటల కిట్లను అందిస్తున్నారు. 2017లో హరితహారంలో భాగంగా అటవీశాఖ అధికారుల సాయంతో తానే సొంతంగా ఒకేరోజులో 3 వేల మొక్కలను నాటించారు. సంవత్సరం మొత్తం 5 వేల మొక్కలను నాటించారు.

**శతక రచనలు:** సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై శతకాలు రాస్తూ వాటిని చిన్న పుస్తకాలుగా ప్రచురించారు ప్రసాద్. తెలంగాణ క్రీడాంజలి, ఏసు చరిత, మహర్షుల చరిత, తెలంగాణ క్రీడా జ్ఞాపకాంజలి, వృక్ష శతకాలు రాశారు. క్రీడాంజలి శతకానికి ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రభుత్వం పారితోషికం అందించింది.

**200లకు పైగా జ్ఞాపికలు:** 2008లో రచించిన భరతమాత నా నేస్తం అనే సంపుటికి ఏపీఎస్‌పీలో పోలీస్ శాఖ నుంచి జీఎస్‌ఈతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ★ 2009లో మృత్యుజీవి(ఆత్మకథ)కు ఏపీఎస్‌పీలో పోలీస్ శాఖ వారిచే జీఎస్పీ అందుకున్నారు. ★ 2015లో ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. ★ 2017లో రాసిన జానపద గేయాలను గుర్తించి పాల్వంచలో సాహితీ సమ్మేళనంలో సన్మానం చేశారు. ★ 2017లో కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ జాగృతిలో రైతు ఆత్మహత్యలపై రాసిన కవితా సంపుటికి ప్రశంసా పత్రం అందుకున్నారు. పలు కార్యక్రమాల్లో చేసిన ప్రదర్శనలలో ఇప్పటి వరకు 200లకు పైగా జ్ఞాపికలను అందుకున్నారు.

**తెలుగు కళలపై ఆసక్తి: కేశబోయిన ప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్**



నాకు చిన్ననాటి నుంచి చదువంటే ఇష్టం. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించా. దీంతో పాటు పాటలు పాడటం, మిమిక్రీ, శతకాలు రాయడం చేస్తుంటాను. నేను ఈ స్థాయిలో ఉండటానికి నా కుటుంబ సభ్యులు, గురువులు ప్రోత్సహించారు. ఇంకా పోటీ పరీక్షలు రాస్తున్నా ఉన్న స్థాయి ఉద్యోగం కోసం కృషి చేస్తున్నా. నాకు తోచినంత సమాజ సేవ చేస్తున్నా.

## మారాయిగూడెంలో సమ్మక్క-సారలమ్మ జాతర

**దుమ్ముగూడెం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మారాయిగూడెంలో గిరిజన ఇలవేల్పు సమ్మక్క-సాలరమ్మ జాతర మహోత్సవం ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మ గురువారం విలేకర్లకు తెలిపారు. ఫిబ్రవరి 6న ప్రారంభమై 7న ఒక్క పొద్దు రాత్రి 10 గంటలకు దేవతా నిశానులు, సారలమ్మ ఆలయానికి రావడం, 8వ తేదీ నిండు జాతర, మధ్యాహ్నం 12 గంటలకు వనదేవత గుడికి రావడం, సాయంత్రం 4 గంటలకు తల్లి దేవత గుట్ట నుంచి గుడికి రావడం ఉంటుందన్నారు. 9న శుంకు పండుగ, దేవుని దర్శనం, 10న తల్లి దేవత తిరిగి గుట్టకు వెళ్లడం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జాతర సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



సమ్మక్క-సారలమ్మల గద్దెలు

## వాలీబాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు

**అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే:** జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మూడు రోజులపాటు భద్రాచలంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు వాలీబాల్ నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఈనెల 8 నుంచి 12 వరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ కార్యనిర్వహణాధికారి ఇ.గమాన్యేల్ ఐటీసీ, గుత్తేదారు పాకాల దుర్గాప్రసాద్, ప్రముఖ పిల్లల వైద్యులు రవికుమార్ సందర్శించారు. క్రీడాకారులను అభినందించి, క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జట్టుకు శిక్షణ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పామర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిక్షణలో భాగంగా వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

## ఎమ్మార్పీఎస్ నాయకుల నిరాహార దీక్ష

**చర్ల, న్యూస్‌టుడే:** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు జరిగాయి. జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ఈ దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు మాదిగల ఉద్యమాలను అణిచివేసే కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని దిల్లీకు పంపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను విడుదల చేయాలని అన్నారు. జీఎస్పీ మండల అధ్యక్షుడు గొంది ముయ్యన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అలవాల సతీశ్, మచ్చా వెంకటేశ్వర్లు, పూసం సోమరాజు, చెన్నం సునీల్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

## నేడు భద్రాచలంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** నేడు భద్రాచలంలోని కూనవరం రోడ్డులోని మారుతీ నర్సింగ్ కళాశాల వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం, కంటి చూపు తక్కువగా ఉన్నవారికి పరీక్షించి అవసరమైన వారికి ఖమ్మంలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని కళాశాల డైరెక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం భద్రాచలం డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు.



# శ్రమదానం.. రహదారి నిర్మాణం

**వాహనాల రాకపోకలకు అవకాశం**

**వాజేడు, న్యూస్‌టుడే:**

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఆశపడినా ప్రయోజనం లేదని ఆదివాసీలు భావించారు.. శ్రమదానంతో గ్రామానికి రహదారిని ఏర్పాటు చేసుకుని అధికారులకు కళ్లు తెరిపించారు. రాళ్లు, పొదలతో, గుంతలతో నడిచేందుకు వీలుగా లేని కాలిబాటను వాహనాలు వెళ్లేందుకు వీలుగా రహదారిగా మార్చుకున్నారు. పెనుగోలు గ్రామానికి వాహనాలు నడిచేందుకు వీలుగా కాలిబాటలో రాళ్లను తొలగిస్తూ వాహనాలు వెళ్లేందుకు అనువుగా దారికి అడ్డంగా మారిన బండలను గుంతలను తొలగించారు. కొండలపైనున్న పెనుగోలు గ్రామానికి వాహనాలు నడిచేందుకు గిరిజనులు రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ గ్రామానికి వాహనాల రాకతో గ్రామస్థులలో ఆనందం వెల్లివిరిస్తోంది. మండల కేంద్రానికి దూరంగా ఎత్తైన కొండలపై ఉన్న పెనుగోలు గ్రామానికి ఎవరైనా వెళ్లాలంటే కాలినడకే ఆధారం. గ్రామస్థులు అత్యవసరంగా మండల కేంద్రానికి రావాలంటే నరక యాతన అనుభవించాల్సిందే. అత్యవసర వైద్యం పొందాలంటే జెడ్డీలో రోగిని మోసుకురావాల్సిందే. గ్రామానికి వాహనాల రాకపోకలు జరిగేందుకు స్థానికులు, ఆదివాసీ యువకులు నడుం బిగించారు. ఊరికి రహదారిని నిర్మించి అధికారులకు కనువిప్పు కలిగించారు. ట్రాక్టరు వెళ్లేందుకు దారిని సిద్ధం చేశారు. ట్రాక్టరు, ద్విచక్ర వాహనాల రాకతో ఆదివాసులలో ఆనందం ఉప్పొంగింది. వాహనాలు వెళ్లేందుకు అనువుగా మారిన రహదారిలో అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రాథమికంగా తయారు చేసిన మార్గంలో శాశ్వత రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని పెనుగోలు గిరిజనులు కోరుతున్నారు.



వాహనాల రాకపోకలను ఆసక్తితో తిలకిస్తున్న గ్రామస్థులు



గ్రామానికి చేరుకున్న వాహనం వద్ద ఆనందం



పెనుగోలు గ్రామానికి వెళ్తున్న ట్రాక్టర్

### రెండేళ్ల శ్రమతో సాధించారు..

గ్రామానికి రహదారిని ఏర్పాటు చేసేందుకు గిరిజనులు విడతలవారీగా రెండేళ్లపాటు శ్రమించారు. గిరిజనులు మండల కేంద్రానికి వెళ్లేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పెనుగోలుకు రహదారిని నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. అధికారులు సహకరించడంలేదని గుర్తించిన స్థానికులు రహదారిని ఏర్పాటు చేసుకోవాలని సంకల్పించారు. వాహనాలకు ఇబ్బందికరంగా మారిన ప్రదేశాలలో రాళ్లను తొలగించి దారిని ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన పొదలను తొలగించారు.

### వాహనాల రాకతో స్థానికుల్లో ఆనందం

మండల కేంద్రానికి వెళ్తేగాని వాహనాలను చూడలేని ఆదివాసుల మోములో ఆనందం వెల్లివిరిసింది. పెనుగోలు గ్రామానికి ట్రాక్టరు, ద్విచక్ర వాహనాలు రావడంతో భవిష్యత్తులో వాహనాలు వస్తాయనే ఆశలు ఆదివాసులలో కలిగాయి.

## పరివర్తనతో ఆర్థిక పురోగతి సాధించాలి

**వెంకటాపురం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గుడుంబా పునరావాస బాధితులు పరివర్తనతో ఆర్థికంగా పురోగతి సాధించాలని ఎంపీపీ ఎట్టి ఝాన్సీలక్ష్మీబాయి, ఆబ్కారీ సీఐ ఫకీర అన్నారు. మండలానికి చెందిన ఆరుగురికి గుడుంబా పునరావాస బాధితుల ఆర్థిక సాయం కింద గురువారం యూనిట్లను అందజేశారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఒక్కో లబ్ధిదారుకు రూ.2 లక్షల విలువగల ఆర్థిక చేయూతతో ఆటోలు, మేకలను పంపిణీ చేశారు. వెనుకబడిన వర్గాలకు చెందిన వెంకటాపురం, మరికాల పంచాయతీ పరిధికి చెందిన ఈ ఆరుగురు ఇకపై గుడుంబాను తయారీపై దృష్టి సారించవద్దని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాలను పోషించుకోవాలని పేర్కొన్నారు. పల్లెల్లో గుడుంబా తయారీ విక్రయాలను చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.ఫణిచంద్ర, ఆబ్కారీ ఎస్సై రాజన్న పాల్గొన్నారు.

## పేరూరులో క్రికెట్ టోర్నీ ప్రారంభం

**వాజేడు, న్యూస్‌టుడే:** సంక్రాంతి పండుగ సందర్భంగా పేరూరు స్నేహ యూత్, పేరూరు పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను పేరూరు ఎస్సై శివప్రసాద్ ప్రారంభించారు. వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం మండలాల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో క్రీడాకారులంతా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎస్సై శివప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో పేరూరు సర్పంచి యాలం సరస్వతి, జిప్రాని సభ్యురాలు సోమిడి ధనలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న పేరూరు ఎస్సై శివప్రసాద్

# లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** ఈనెల 8న మండల రెవెన్యూ కార్యాలయం ముట్టడి, ధర్నాలో ఆదివాసీ యువకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ పట్టణ కన్వీనర్ పూనెం కృష్ణ దొర పిలుపునిచ్చారు. గురువారం భద్రాచలంలోని గిరిజన అభ్యుదయ సంఘం భవనంలో కోకన్వీనర్ చినబాబు దొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లంబాడీ వలస గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు మన పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఊకే శ్రీరాములు, జగ్గ పుల్లయ్య, సోందె రవికుమార్, సుధారాణి, వెంకట్, కుమారి, కమల, రామలక్ష్మి, రత్తమ్మ, అవినాశ్ పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం, న్యూస్‌టుడే:** లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే ప్రధాన డిమాండుతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు తుడుంబెబ్బ, ఏటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ... లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో లంబాడీలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు, ఏజెన్సీ ఏరియా పత్రాలు జారీ చేయకూడదని ఏజెన్సీ ప్రాంతం నుంచి లంబాడీ ఉద్యోగులను తక్షణమే బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఏజెన్సీలో ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు కొమరం వెంకటేశ్వర్లు, పూనెం ఆదినారాయణ, నాయకులు సప్కా నాగరాజు, కారం వెంకటేశ్వర్లు, దశరథం, జయబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**చర్ల, న్యూస్‌టుడే:** లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ తుడుందెబ్బ, ఏఎస్ఎఫ్, ఏటీఎఫ్‌ల ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. గాంధీనగర్ సెంటర్ నుంచి జరిగిన ఈ ప్రదర్శనలో దొడ్డిదారిని ఎస్టీలుగా చెలామని అవుతున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో తుడుందెబ్బ ప్రాంతీయ అధ్యక్షుడు తాటి రామకృష్ణ, మండల అధ్యక్షుడు కణితి తిరపతిరావులు మాట్లాడారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఏటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బోదెబోయిన జయబాబు, మండల అధ్యక్షుడు పర్శిక నాగేశ్వరరావు, కల్లూరి హరికృష్ణ, ఆలం సతీశ్, పోలం సాగర్ , రాము, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

**వాజేడు, న్యూస్‌టుడే:** గిరిజన జాబితా నుంచి లంబాడీలను తొలగించాలంటూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. మండల కేంద్రంలో ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ కార్యాయాన్ని ముట్టడించి నినాదాలు చేశారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా, రాష్ట్రపతి ఆమోదముద్ర లేకుండా గిరిజన జాబితాలో చేర్చిన లంబాడీల గిరిజన హోదాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో జయేందర్‌రావు, జనార్దన్‌రావు, రాంబాబు, జానకిరావు, సాగర్, శ్రీనివాస్, కామేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

**వెంకటాపురం, న్యూస్‌టుడే:** ఆదివాసీల మనుగడకు ముప్పుగా మారిన లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తేనే అడవిని నమ్ముకుని బతుకుతున్న గిరిజనులకు న్యాయం జరుగుతుందని ఏటీఎఫ్ జిల్లా ప్రచార కార్యదర్శి కోరం సంతోశ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం వెంకటాపురంలో ఏటీఎఫ్, తుడుందెబ్బ, ఏఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. డీనోటిఫైడ్‌గా గుర్తించిన లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు పాలకులు ఎందుకు సంకోచిస్తున్నారని ప్రశ్నించారు. లంబాడీలను జారీ చేసిన ఏజెన్సీ ధ్రువపత్రాలను రద్దు చేయాలని డిమాండు చేశారు. అంతకుముందు ఆయా సంఘాల నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. వినతి పత్రాన్ని ఉపతహసీల్దారు రాముకు అందజేశారు. కార్యక్రమంలో సోర్ల కేశవరావు, పాయం వెంకటేశ్వర్లు, పర్శిక సుధాకర్, కుర్సం సమ్మయ్య, గట్టుపల్లి అశోక్, యాలం సాయి, సత్యనారాయణ, జయరాం, కృష్ణబాబు, పుల్లారావు పాల్గొన్నారు.

**వెంకటాపురం, న్యూస్‌టుడే:** ఆదివాసీలు చేపట్టిన న్యాయమైన ఆందోళనకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివాసీ ఐకాస నాయకులు ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణను విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఐకాస నాయకులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో అప్పటి కాంగ్రెస్ పాలకులు చేర్చడంతోనే ప్రస్తుతం ఆదివాసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. లంబాడీలకు ఏజెన్సీ ధ్రువపత్రాలతో పాటు ఎస్టీ కుల పత్రాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాసం రాజు, పూనెం సాయి, చింత సమ్మయ్య, పూనెం రామచందర్‌రావు, ఉయిక శంకర్, సిద్దిబోయిన సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బాస్కెట్‌బాల్ ఛాంపియన్ హైదరాబాద్




మహిళా విభాగంలో విజేత హైదరాబాద్ జట్టుకు, పురుషుల విభాగంలో విజేత హైదరాబాద్ జట్టుకు ట్రోఫీలను అందిస్తున్న ఎమ్మెల్యే అజయ్‌కుమార్

## ● ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

**ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే:** సీనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్లుగా హైదరాబాద్ పురుషులు, మహిళల జట్లు నిలిచాయి. గురువారం ఖమ్మం పెవిలియన్ మైదానంలో ఈపోటీలు ముగిశాయి. పురుషులు, మహిళల రెండు విభాగాల్లో హైదరాబాద్ జట్లు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. మహిళల విభాగంలో హైదరాబాద్ ప్రథమ, మెదక్ ద్వితీయ, రంగారెడ్డి జట్టు తృతీయ స్థానాల్లో ఉన్నాయి. అంతకు ముందు జరిగిన మహిళల సెమీస్ పోటీలో ఖమ్మం జట్టుపై 4-58 స్కోర్‌తో ఏక పక్షంగా మ్యాచ్ గెల్చుకొని హైదరాబాద్ జట్టు ఫైనల్స్‌కు చేరింది. మరో సెమీస్ పోటీలో రంగారెడ్డి జట్టుపై 64-74 స్కోర్‌తో గెలుపొంది మెదక్ టైటిల్ పోరులో నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం జట్టుపై రంగారెడ్డి గెలుపొందింది. పురుషుల విభాగంలో జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టుపై హైదరాబాద్ జట్టు 38-80 స్కోర్‌తో రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టుపై రంగారెడ్డి జట్టు 77-96 స్కోర్‌తో గెలుపొంది టైటిల్ పోరులో తలపడ్డాయి. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టుపై వరంగల్ జట్టు గెలుపొందింది.

### జాతీయ పోటీలకు సిద్ధం కండి.. ఇండోర్ కోర్టు నిర్మిస్తాం: ఎమ్మెల్యే

ఖమ్మం నగరంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్టే క్రీడారంగంలోనూ గణనీయమైన ప్రగతి, ఫలితాలు సాధిస్తోందని, అందుకు తగిన సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్యతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే క్రీడావసతుల కల్పనలో జరుగుతున్న ప్రయత్నాలు, ప్రారంభమైన నిర్మాణాలు, నిధుల వివరాలను వివరించారు. ఈసందర్భంలో ఖమ్మంలో బాస్కెట్‌బాల్ ఇండోర్ కోర్టు ఆవశ్యకతను గుర్తించామని దీన్ని నిర్మించి ఇస్తామన్నారు. ఇండోర్ కోర్టు వస్తుంది. జాతీయ పోటీలకు సిద్ధం కావాలని చెప్పారు. అంతకు ముందు మాట్లాడిన క్రీడల రాష్ట్ర కార్యదర్శి నార్మన్‌ఐజాక్ ఖమ్మంలో ఇండోర్ కోర్టు అందుబాటులో ఉంటే జాతీయ పోటీలు నిర్వహించే స్థాయి కార్య దక్షత ఖమ్మానికి ఉన్నాయన్నాని చెప్పారు. ఇందుకు స్పందనగా ఎమ్మెల్యే ఇండోర్ నిర్మాణం చేపడతామన్నారు. నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఎం.పద్మా నిర్వహణలో పాల్గొన్నవారికి జ్ఞాపికలను అందజేశారు. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయసారథి, రమణయాదవ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌బాబు, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, కార్పొరేటర్లు దీపక్‌చౌదరి, బత్తుల మురళీ ప్రసాద్, కమర్తపు మురళి, పగడాల నాగరాజు, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం సభ్యులు పి.వి.రమణ, శ్రీనివాస్‌రావు, ఆదినారాయణ, చంద్రకుమార్, హాకీ అక్తర్, ఇతర సీనియర్, జూనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలు విజయవంతం అయిన సందర్భంగా బాణాసంచా కాల్చారు.



రంగారెడ్డితో తలపడుతున్న ఖమ్మం మహిళా జట్టు



పురుషుల విభాగంలో ఫైనల్లో తలపడుతున్న రంగారెడ్డి, హైదరాబాద్ జట్లు

# ఇల్లెందు పట్టణ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయండి: కలెక్టర్

**కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఇల్లెందు పట్టణ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ అధికారులను ఆదేశించారు. ఇల్లెందు మున్సిపాలిటీ అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఇల్లెందు మున్సిపాలిటీలోని ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరిచేందుకు ప్రభుత్వం 171 జీవోను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను అమలు చేసే బాధ్యతలను కొత్తగూడెం ఆర్డీవో ఎం.వి.రవీంద్రనాథ్‌కి అప్పగించారు. ఇల్లెందులోని సర్వే నెంబరు 537, 609 పరిధిలోని ఇళ్ల స్థలాలవారు క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో అర్హులైనవారు క్రమబద్ధీకరణ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఇల్లెందు తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి దరఖాస్తులను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రజలు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో మార్గదర్శకాలను అధికారులకు తెలియజేశారు. పూర్తి వివరాలతోపాటు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, ఓటరు గుర్తింపు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్టర్ సేల్ డాక్యుమెంట్స్, ప్రాపర్టీ టాక్స్ రసీదు, విద్యుత్, నీటి బిల్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఉండేలా చూడాలన్నారు. ఏ తేదీన ఏఏ వార్డుల వారు దరఖాస్తు చేసుకోవాలో ఆయన వివరించారు. 16వ తేదీన 1వ వార్డు, 17వ తేదీన 2, 3 వార్డులు, 18వ తేదీన 4 నుంచి 7 వార్డులు, 19వ తేదీన 5 వార్డు, 20వ తేదీన 6 వార్డు నుంచి 10 వార్డులు, 22వ తేదీన 8వ వార్డు 23న 9 వార్డు నుంచి 12వ వార్డు వరకు, 24వ తేదీన 13 నుంచి 15వ వార్డు వరకు, 25వ తేదీన 16వ వార్డు, 27వ తేదీన 17వ వార్డు, 29వ తేదీ 18వ వార్డు, 30వ తేదీన 19వ వార్డు 31వ తేదీన 20 నుంచి 24 వార్డులు, ఫిబ్రవరి 1న 21వ వార్డు, 2వ తేదీన 22వ వార్డు, 3న 23వ వార్డు ప్రజలు దరఖాస్తులు అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ

## ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న

### ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి 3 విజేతలు

1. కె. శారద, హైదరాబాద్; 2. పరిణిత సాయి, ఖమ్మం; 3. తాళ్ల నర్మద, మంచిర్యాల; 4. ఎల్. మీనా, బిచ్కుంద; 5. డి. మల్లీశ్వరి, కొత్తగూడెం; 6. బి. లావణ్య, హైదరాబాద్; 7. ఈ. వాణి, మంచిర్యాల; 8. ఎన్. శారద, జన్నారం; 9. ఎ. హరిత, హైదరాబాద్; 10. అలేఖ్య, బెల్లంపల్లి, మంచిర్యాల. విజేతల వివరాలు ఈనాడు డాట్‌నెట్ చూడవచ్చు.



పడమర మెట్ల వైపున క్యూ లైన్ పొడవునా ఇలా అపరిశుభ్రత

# అంతా అపరిశుభ్రతే..

**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచలం రామాలయంలో గత నెల 29న ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా భక్తుల తాకిడి పెరగడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి ఉచితంగా మంచినీటి పొట్లాలను సరఫరా చేశారు. ఈ మంచినీళ్లను తాగిన భక్తులు ఖాళీ పొట్లాలను అక్కడ పడేశారు. ప్లాస్టిక్ పొట్లాలలో నీళ్లు లేకపోవడంతో ఇవి గాలికి చెల్లాచెదురుగా పడి అపరిశుభ్రంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

# వెంటాడిన మృత్యువు

- మోటారు మరమ్మతుల్లో విద్యుదాఘాతం
- హిమాంనగర్‌లో యువరైతు మృతి, ఇద్దరికి గాయాలు
- దసరాకు ముందు అదే కుటుంబంలో పెను విషాదం


సంతోష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

**ఏన్కూరు, న్యూస్‌టుడే:** గత దసరా పండగకు ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇప్పుడు సంక్రాంతికి ముందు అదే కుటుంబానికి చెందిన మరో యువకుడు విద్యుదాఘాతంతో మృత్యులోగిలికి చేరాడు. విధి పెట్టిన విషమ పరీక్షలో విలవిల్లాడిన ఓ కుటుంబం విషాద గాథ ఇది. ఏన్కూరు మండలం హిమాంనగర్‌కు చెందిన లకావత్ రాంలాల్, అచ్చుమ్మలకు విజయ్, సంతోష్ ఇద్దరు కుమారులు. విజయ్ దివ్యాంగుడు కాగా వారికున్న భూమిని సాగు చేయిస్తున్నాడు. ఐటీఐ వరకు చదివి అతని తమ్ముడు సంతోష్ గత ఏడాది నుంచి అన్నకు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. గ్రామం సమీపంలోని తమ పొలంలోనున్న ఓ వ్యవసాయ మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో గురువారం ఉదయం రేపల్లెవాడకు చెందిన మెకానిక్ నవీన్, మామ సర్దార్, బావ ఉపేందర్, మరో ఇద్దరు స్థానికులను మరమ్మతుల కోసమని సంతోష్ వెంటబెట్టుకెళ్లాడు. మోటర్‌ను బాగుచేసిన అనంతరం పైపులను బోరు లోపలకు దించుతుండగా.. పొడవాటి ఇనుప పైపు అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక తీగలపై పడింది. దీంతో ఆ పైపునకు విద్యుత్తు సరఫరా కావడంతో సంతోష్, నవీన్, ఉపేందర్ విద్యుదాఘాతానికి గురయ్యారు. మిగిలిన వారంతా వెంటనే అప్రమత్తమయ్యారు. స్థానికులతో కలిసి బాధితులను హుటాహుటిన ఏన్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంతోష్, నవీన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. వీరిలో సంతోష్ అప్పటికే మృతి


సంతోష్ (పాతచిత్రం)

చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. నవీన్ శరీరంపై కాలిన గాయాలు కాగా, మరో యువకుడు ఉపేందర్ చేతులకు గాయాలయ్యాయి. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పొలానికి వెళ్లిన కొడుకు తిరిగి విగతజీవిగా రావడంతో తల్లి అచ్చుమ్మ గుండె పగిలింది. కొడుకు మృతదేహాన్ని చూసి సొమ్మసిల్లింది. తమకు అండగా ఉంటాడని ఆశలు పెంచుకున్న తనయుణ్ని మృత్యువు కబళించడంతో ఆ తల్లి తల్లడిల్లింది. దసరా పండగకు ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్ కుటుంబానికే చెందిన ఇద్దరు మృత్యువాతపడడాన్ని గుర్తుచేసుకుని బాధిత కుటుంబీకులు రోదించిన తీరు చూపరులను కలచివేసింది.

### అప్పుడు త్రుటిలో తప్పించుకున్నా..

గత ఏడాది సెప్టెంబర్ 23న సంతోష్ తాత అల్సారాం, నాయనమ్మ లాలమ్మతో పాటు బాబాయిలు, పిన్నమ్మలు, మేనత్తలు భద్రాచలం దైవదర్శనానికి బయల్దేరి వెళ్లారు. వారు వెళ్లే ట్రాక్టరు ఊరికి సమీపంలోనే పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాయనమ్మ, పిన్నమ్మ శాంతి మృతిచెందారు. మేనత్త రాంబాయికి కాలు తొలగించారు. బాబాయిలు, సోదరులకూ గాయాలయ్యాయి. ఆ ప్రమాదంలో సంతోష్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో మృత్యుకోరల్లోంచి బయటపడిన ఆ యువకుడు... నాలుగు నెలల్లోపే విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ఐటీఐ వరకు చదివిన తాను ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడాలన్న ఆశలు ఆవిరయ్యాయి.


ప్రమాదం జరిగిన ప్రాంతం

ఇదంతా తలుచుకుంటూ తండ్రి రాంలాల్, తల్లి అచ్చుమ్మ, కుటుంబసభ్యులు రోదించే తీరు గ్రామస్థులను కంట తడిపెట్టించింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి దర్యాప్తు చేపట్టారు.

## లారీ ఢీకొని యువకుని మృతి

**కామేపల్లి, న్యూస్‌టుడే:** లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం గోవింద్రాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హట్కర్ ప్రేమ్‌కుమార్(21) పంట చేను వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. కొత్తలింగాల-డోర్నకల్ రహదారిపై ఖమ్మం వస్తున్న లారీ వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో బాధితుడు అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపారు.


సంఘటనా స్థలంలో హట్కర్ ప్రేమ్‌కుమార్ మృతదేహం

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

❖ భార్య, కూతురికి గాయాలు

**పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనం, డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా అతని భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన మాడుగుల చిన్న పిచ్చయ్య(28), తన భార్య రేణుక, బిడ్డ నందినిని తీసుకొని మొండికట్ట గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మొండికట్ట మూలమలుపు సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో చిన్న పిచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆయన భార్య కుడి కాలు విరిగింది. నాలుగేళ్ల నందిని కూడా గాయపడింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రవి కిషోర్(ఈఎంటీ), జానకిరామ్(పైలెట్) క్షతగాత్రుల్ని పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం తరలించారు.


మృతుడు చిన్న భద్రయ్య

## అత్తను హతమార్చిన కోడలు

### ముఖంపై దిండుతో అదిమి హత్య

**పాల్వంచ, న్యూస్‌టుడే:** అత్తా, కోడళ్ల మధ్య జరుగుతున్న కలహాలకు అత్త బలి అయ్యింది. ఇద్దరి మధ్యా తరచూ గొడవల నేపథ్యంలో అత్తను కోడలు హతమార్చింది. పాల్వంచ పట్టణ పరిధిలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీకు చెందిన బూర్గుల దుర్గమ్మ(55)ను ఆమె కోడలు భాగ్యరాణి హతమార్చింది. నిద్రిస్తున్న అత్త ముఖంపై దిండుతో అదిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. పోలీసుల కథనం ప్రకారం. . దుర్గమ్మ కేటీపీఎస్ ఉద్యోగి. ఆమెకు


దుర్గమ్మ మృతదేహం

ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు ఖమ్మంలో ఉంటున్నాడు. పెద్ద కొడుకు రాజేష్ కేటీపీఎస్‌లో తాత్కాలిక అంబులెన్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దుర్గమ్మ పెద్ద కొడుకు వద్దనే ఉంటోంది. రాజేష్ భార్య భాగ్యరాణికి, అత్త దుర్గమ్మకు చాలా కాలంగా గొడవలు జరుగుతున్నాయి. పది రోజులు క్రితం పట్టణ పోలీసు స్టేషన్‌లో వీరి గొడవకు సంబంధించి కేసు కూడా నమోదు అయింది. ఈ నేపథ్యంలో రాజేష్ బుధవారం రాత్రి విధులకు వెళ్లాడు. ఆయన వెళ్లిన తరువాత అత్తా కోడళ్ల మధ్య మళ్లీ గొడవ జరిగింది. అర్ధ రాత్రి నిద్రిస్తున్న అత్త ముఖంపై కోడలు దిండుతో అదిమి హత్య చేసింది. పాల్వంచ సీఐ రాఘవేంద్రరావు, పట్టణ రెండో ఎస్ఐ రవిలు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై సీఐ రాఘవేంద్రరావు మాట్లాడుతూ గొడవలు కారణంగా అత్తను కోడలు హత్య చేసిందని తెలిపారు. విచారణలో పూర్తి వాస్తవాలు తెలుస్తాయని పేర్కొన్నారు.


నిందితురాలు భాగ్యరాణి

## బాలికపై యువకుని అత్యాచారం

**అశ్వారావుపేట, న్యూస్‌టుడే:** ఓ యువకుడు 15 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అశ్వారావుపేట ఠాణా ఏఎస్సై శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఈ నెల 2న తమ ఇంట్లో ఉండగా మధ్యాహ్న సమయంలో దమ్మపేటకు చెందిన యువకుడు పిక్కిలి వెంకటేశ్వరరావు ఆ ఇంటికి వచ్చి మంచినీరు కావాలని అడిగాడు. దీంతో వారు మంచినీరు ఇచ్చే లోపు ఇంటిలోకి ప్రవేశించి చెల్లిపై దాడి చేసి బయటకు పంపి అక్కపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకరరావు తెలిపారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించినట్లు చెప్పారు.

## జిల్లా పోలీసు సిబ్బందికి శిక్షణ తరగతులు


హైదరాబాద్ మోడల్ పీఎస్ జూబ్లీహిల్స్‌లో భద్రాద్రి జిల్లా పోలీసులు

**కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే:** పోలీసు వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా సిబ్బందికి అన్ని విభాగాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఎస్పీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు విడతల వారీగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే మోడల్ పోలీసు స్టేషన్‌గా ఉన్న జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇల్లెందు, కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు శిక్షణ ఇచ్చారు. రిసెప్షన్ ప్రాధాన్యం, టీఎస్‌సీఓపీ యాప్ విశిష్టత, సాంకేతికపరమైన నేర విచారణకు సంబంధించిన వివరాలు, వేలిముద్రల సేకరణ, క్లూస్ టీమ్ విధివిధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ బృందానికి బాధ్యులుగా ఇల్లెందు సీఐ ఎస్.ఎస్.పాణి వ్యవహరించారు. శిక్షణకు వెళ్లిన బృందంలో ఎస్సై నరేష్‌కుమార్, సిబ్బంది వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఐటీ కోర్స్ బృందం సభ్యులు సంతోష్, బి.విజయ్, మహిళా కానిస్టేబుల్స్ రాణి, శిరోమణి, మల్లికాంబ తదితరులున్నారు.

## ఏసీబీ వలలో కార్మికశాఖ అధికారి


ఏసుపాదం

**ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే:** లంచం తీసుకుంటూ కార్మిక శాఖ సహాయ కార్మిక అధికారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు గురువారం అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ సత్యనారాయణ తెలిపిక వివరాల ప్రకారం.. ఖమ్మం కార్మిక శాఖ కార్యాలయంలో అంబటి ఏసుపాదం అసిస్టెంటు లేబర్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. నగరానికి చెందిన శ్రీనివాస ట్రావెల్స్ యజమాని బాణోతు శ్రీనివాసరావు తన వాహనానికి రిజిస్ట్రేషన్ అనుమతుల కోసం కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అనుమతులు ఇచ్చే క్రమంలో ఏసుపాదం లంచం ఇవ్వాలంటూ ఒత్తిడి చేశాడు. పనిపూర్తి చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ శ్రీనివాస్‌ను ఇబ్బంది పెడుతున్నాడు. ఈనేపథ్యంలో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. దీంతో పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఏసుపాదం అవినీతి బయటపెట్టేందుకు ప్రణాళిక రచించారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో శ్రీనివాస్ నుంచి రూ.2వేలు లంచం తీసుకుంటుండగా ఏసుపాదంను ప్రత్యక్షంగా పట్టుకున్నారు. నిందితుడిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రమణమూర్తి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

**బూర్గంపాడు, న్యూస్‌టుడే:** కుటుంబ సమస్యలతో బూర్గంపాడు మండలకేంద్రానికి చెందిన చిన్నబత్తిని బాలరాజు(42) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... కూలి పనులు చేసుకుంటూ జీవించే బాలరాజును పదమూడేళ్ల క్రితం అతని భార్య వదిలేసి ఎటో వెళ్లిపోయింది. అప్పటికే వారికి ఓ కుమారుడు ఉన్నాడు. పదేళ్ల క్రితం బాలరాజు కళావతి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆరునెలల క్రితం తీవ్రమైన కడుపునొప్పితో కుమారుడు అనారోగ్యం పాలై మరణించడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. మద్యానికి బానిసై రెండో భార్య కళావతితో గొడవలు పడుతున్నాడు. ఈ పరిస్థితుల్లోనే బుధవారం రాత్రి కూడా గొడవ జరిగింది. బాలరాజు మనోవేదనతో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలపాలైన అతణ్ని భద్రాచలం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు గురువారం బూర్గంపాడు ఎస్సై పి.సంతోష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


పరుగు పందెం సాధన చేస్తున్న క్రీడాకారిణులు

# ఆట సైరా..

- ఆటల్లో రాణిస్తున్న గిరిజన విద్యార్థినులు
- 31 జిల్లాల క్రీడాకారులకు గురుకులంలో తర్ఫీదు
- 9 నుంచి ఇంటర్ సొసైటీ పోటీలు

భద్రాచలం, న్యూస్‌టుడే

క్రీడల్లో అత్యుత్తమ స్థాయికి చేరుకోవాలనే పట్టుదల గిరిజన విద్యార్థులను ముందుకు నడిపిస్తోంది. గురుకులాల నిర్వాహకులు ఇలాంటి వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గురుకుల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో ఆర్వీఓ షేక్ బురాన్ సహకారంతో భద్రాచలం గిరిజన బాలికల గురుకులంలో ప్రత్యేక క్రీడా శిబిరం కొనసాగుతోంది. గత నెల 21న ఆరంభమైన శిక్షణలు ఈనెల 8న ముగియనున్నాయి. వీరు ఈనెల 9 నుంచి 12 వరకు హైదరాబాద్‌లో జరిగే ఇంటర్ సొసైటీ లీగ్ స్పోర్ట్స్ మీట్‌లో తలపడనున్నారు. ఎన్నో వడపోతల తర్వాత వీరు ఇక్కడ ఇచ్చే శిక్షణకు ఎంపికయ్యారు. రాష్ట్రంలో పలుచోట్ల క్రీడా మెళకువలను బోధిస్తున్నారు. భద్రాచలంలో అథ్లెటిక్స్ అంశానికి సంబంధించిన శిక్షణలు ఇస్తున్నారు. ఇటీవల అంకంపాలెంలో 1200 మంది క్రీడాకారులు తలపడగా వీరిలో సుమారు 250 మంది అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఇందులో అథ్లెటిక్స్ అంశంలో 75 మంది బాలికలకు ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. పాఠశాల, కళాశాల చదివే వారు ఇలా మెలకువలు నేర్చుకుంటున్నారు. వాలీబాల్‌లో రాణించేందుకు కూడా నిపుణులు బోధన సాగిస్తున్నారు.

### మన్యెం దమ్ము చూపిస్తాం
**ఇర్పా శ్రీలత, ములకలపల్లి**



అంకంపాలెంలో సీఈసీ చదువుతున్నాను. అథ్లెటిక్స్‌లో రాణించాలనేది నా కల. దీన్ని సాధించేందుకు శ్రమిస్తున్నాను. హరియాణా, గుజరాత్, మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించాను. 400, 800 మీటర్ల పరుగు పందెంలో విజయం సాధించి మిగతా వారిలో స్ఫూర్తి నింపాలని ఉంది. చదువులో వెనకబడకుండా ఉండేలా ఈ శిబిరం నిర్వహిస్తున్నారు.

### ఒలింపిక్‌లో ఆడాలని ఉంది: భూక్యా శైలజ, భద్రాచలం గురుకులం



ఒలింపిక్ పోటీలకు ఎంపిక అవ్వాలని ఇటీవల మహారాష్ట్రలో జరిగిన పోటీలకు వెళ్లాను. ప్రతిభ చాటినప్పటికీ కొన్ని కారణాలతో ఎంపిక కాలేదు. నా చిరకాల కోరిక ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనడమే. ఇందుకు తగిన శ్రమ చేస్తున్నాను. 800, 1500 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులు సాధించాను. హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీల్లో గుజరాత్, కేరళలో పాల్గొన్నాను. రంగారెడ్డి జిల్లాలో 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి పొందాను.

### నిపుణుల బోధనలు ఉన్నతికి దోహదం - సిహెచ్ అశ్విని, ఏటూరునాగారం



మాది వ్యవసాయ కుటుంబం. బైపీసీ చదువుతున్నాను. వాలీబాల్ క్రీడపై ఉన్న మక్కువతో అందులో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నా. పంజాబ్, గుంటూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాను. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేలా శిక్షణలు అందిస్తున్నారు. నిపుణులు చెబుతున్న మెలకువలు పాటించి ఉన్నత స్థాయికి చేరుకుంటాం.

### ప్రోత్సహించడంతో మరింత ఉత్సాహం
**చాపా వాణి, దమ్మపేట**



కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు, అధికారుల ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నాం. దేశం గర్వించే స్థాయిలో రాణించాలని పట్టుదలతో కృషి చేస్తున్నా. జావెలిన్ త్రో పోటీలు హర్యానాలో జరగగా నేను చూపించిన ప్రతిభకు అక్కడి వారు ప్రత్యేకంగా అభినందించారు. మెదక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాను.

### ఉత్తమ అథ్లెటిక్‌గా రాణించాలని:
**పాయం. దివ్య మాధవి**



మహారాష్ట్ర, హరియానా, కేరళలో జరిగిన జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందాను. చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఉంది. ఇందుకు అందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. ఒలింపిక్ స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను.


వాలీబాల్ ఆడుతున్న గిరిజన క్రీడాకారిణులు

### ఉదయం.. సాయంత్రం శిక్షణలు
**కె.అశ్విని, ఆసిఫాబాద్**



మాది వ్యవసాయ కుటుంబం. మా జిల్లాలో 9వ తరగతి చదువుతున్నాను. కర్ణాటకలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటాం. ఉదయం 5 గంటల నుంచి 9 వరకు సాయంత్రం 4 నుంచి 6.30 వరకు తర్ఫీదునిస్తున్నారు. గురుకులం నుంచి అందిస్తున్న మెనూ బాగుంది. ఇక్కడి వాతావరణం అనుకూలంగా ఉండటం వల్ల రానున్న పోటీలో మా సత్తా చాటుతాం.

### ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నాం
**దేవదాస్, శిబిర నిర్వాహకులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్**



రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి ఎంపికైన 75 మంది క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. 12 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వాలీబాల్, అథ్లెటిక్ అంశాలలో మెలకువలు నేర్చుకుంటున్నారు. రోజుకు రూ.50 కేటాయించినందున వారికి ప్రత్యేక మెనూ అందిస్తున్నాం. రోజు విడిచి రోజు కోడి కూర ఉంటుంది. గుడ్డు, పండ్లు, మిఠాయిలు అందిస్తున్నాం. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తున్నాం. వేర్వేరు చోట్ల నుంచి వచ్చిన అండర్-14, అండర్-16, అండర్-19 విభాగాల విద్యార్థినులకు క్రీడా శిక్షణతో పాటు చదువులకు ఇబ్బంది లేకుండా బోధన సాగిస్తున్నాం.

### అన్ని రకాల గురుకులాలు తలపడతాయి
**- పద్మం ప్రసాద్, వ్యాయామ నిపుణులు**



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు పూర్తయ్యాయి. అక్కడ సత్తా చాటిన వారు గచ్చిబౌలిలో 9 నుంచి జరిగే ఇంటర్ సొసైటీ లీగ్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారు. ఇప్పటి వరకు గిరిజన గురుకులాల రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించాయి. దమ్మపేట మండలం అంకంపాలెంలో నవంబరు 1 నుంచి 4 వరకు బాలికలకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు హైదరాబాద్‌లో జరిగే పోటీలకు వెళ్లడానికి ఇప్పుడు శిక్షణలో ఉన్నారు. అన్ని రకాల గురుకులాల విద్యార్థులు తలపడే పోటీ కచ్చితంగా రసవత్తరంగా ఉంటుంది.

# చూడ ముచ్చట.. ఆకృతులు ఇచ్చట

- స్వయం ఉపాధికి బాటలు
- కుట్లు, అల్లికల్లో ఉచిత శిక్షణ

తరుణి

మన్యం మహిళలు ఉచిత శిక్షణతో రాటుదేలుతున్నారు. చూడగానే ఆకట్టుకునే ఆకృతులు తయారు చేసి ఔరా అనిపించుకుంటున్నారు. మహిళలు, యువతులు తమ నైపుణ్యానికి పదునుపెడుతూ ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో పుష్పవతి క్రాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేసి కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీలో వీరికి ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో మహిళలు ఇక్కడ శిక్షణ పొంది ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు.

చర్ల, న్యూస్‌టుడే

ఓ పక్క కుట్టుమిషన్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు అందాల ఆకృతులు, గృహోపకరణాల సామగ్రి తయారీలో తర్ఫీదు పొందుతున్నారు. అల్లికల్లో శిక్షణ ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే అందమైన ఆకృతులు తయారీ చేస్తూ చర్ల మహిళలు, యువత తమ కళా నైపుణ్యానికి మరింత పదును పెడుతూ ముందుకు సాగుతున్నారు.


ముత్యాలతో తయారు చేసిన చేతి సంచి

చర్లకు చెందిన గుమ్మడి నవ భారతిది అల్లికలు, ఆకృతుల తయారీలో అందె వేసిన చేయి. ఇది తెలుసుకున్న ప్రముఖ స్త్రీవైద్య నిపుణురాలు ప్రతిభ తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ సెంటర్‌లో మహిళలకు శిక్షణ ఇవ్వాల్సిందిగా కోరారు. దీంతో అందమైన ఆకృతుల తయారీపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అందుబాటులో ఉన్న వస్తువులతో ఆకృతులను తయారు చేయిస్తూ మహిళల్లో నవ భారతి ఆసక్తి పెంచుతున్నారు. మార్కెట్లో డిమాండ్‌ను బట్టి మహిళలు వినియోగించే చేతి సంచులు, డబ్బు సంచులు తయారు చేస్తున్నారు. కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తున్న ఎస్కే అమీర్జా సైతం ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ముత్యాల పూసలతో అందమైన బ్యాగుల అల్లికల్లో యువతులు శిక్షణ పొందుతున్నారు. మహిళలు వినియోగించే గాజులు, చెవి దుద్దులు, కీ చైన్లు, గృహాల్లో అలంకరణ కోసం వాడే వస్తువుల తయారీలో శిక్షణ పొందుతున్నారు. ఇళ్లల్లో ఉపయోగించే కందిపప్పు, ఆవాలు, ధాన్యం గింజలు వంటి సామగ్రితో అందమైన గ్రీటింగ్ కార్డులు తయారు చేస్తున్నారు. ఊలుతో గృహాల్లో ఉపయుక్తంగా ఉండే అలంకరణలను తయారు చేస్తున్నారు.




కేంద్రంలో ఆకృతుల తయారీలో శిక్షణ

### యువతుల్లో కొత్త ఆలోచనలకు నాంది
**గుమ్మడి భారతి, ఆకృతుల తయారీలో శిక్షకురాలు**



మన్యం మహిళలకు ఉపాధి బాటలు వేయాలనే మంచి దృక్పథంతో డాక్టర్ ప్రతిభ ఈ క్రాఫ్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వందల సంఖ్యలో మహిళలు కుట్టు యంత్రం, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందారు. ఉపాధికి బాటలు వేసుకున్నారు. మహిళలు ఖాళీ సమయాన్ని వృథా చేసుకోకుండా ఈ కేంద్రానికి వచ్చి కుట్టు మిషన్‌పై శిక్షణ పొందుతున్నారు. వారిలో కొత్త ఆలోచనలు రావాలనే ఉద్దేశంతో నేను నేర్చుకున్న అల్లికలపై ఇక్కడ యువతులకు శిక్షణ ఇస్తున్నాను.

### ఆకృతుల తయారీతో ఆలోచనకు పదును
**స్వరూప, నవీన పావని, సునీత, మహాలక్ష్మీ**



ఆకృతుల తయారీపై తర్ఫీదు పొందుతున్నాం. ఈ ఆకృతుల తయారీ ద్వారా ఎన్నో కొత్త ఆలోచనలు వస్తున్నాయి. ముత్యాలతో సంచుల తయారీ వంటి అందమైన వస్తువుల తయారీలో తర్ఫీదు పొందుతున్నాం. ప్రస్తుతం మార్కెట్లో లభించే కొత్తకొత్త వస్తువులకు ధీటుగా తాము స్వతహాగా అలంకరణ వస్తువులు, ఆకృతులు తయారు చేయాలనే ఆసక్తితో ముందుకు సాగుతున్నాం.


కాచనపల్లిలో తనందించిన పుస్తకాలతో సాధిక్.. చిత్రంలో హెచ్‌ఎం నాగమణి

- పాఠశాలలకు పుస్తక వితరణ
- గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి
- ఆదర్శం.. సాధిక్ దంపతుల ఆశయం

# అలుపెరుగని అక్షర యజ్ఞం

గుండాల, న్యూస్‌టుడే

**నాలుగు దశాబ్దాల క్రితం.. ఓ పేదింటి కుర్రాడికి చదువంటే ఎనలేని ఆసక్తి ఉండేది. కానీ నచ్చిన పుస్తకాన్ని కొనుక్కునే స్థోమత ఉండేది కాదు. పోనీ గ్రంథాలయాన్ని ఆశ్రయిద్దామంటే అవీ అందుబాటులో ఉండేవి కావు. అయినా గురువుల బోధనలే అన్నీ అయ్యాయి. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ పట్టా పొందారు. అక్కడా స్నేహితుల గాథల్లో పుస్తకాల కొరత చర్చకు వచ్చేది. ఆ తర్వాత వృత్తి జీవితంలో పాత్రికేయునిగా దశాబ్దాల పాటు సమాజానికి సేవలందించారు. కానీ, ఆయన మదిని ఎప్పటికీ ఓ ఆలోచన తడుతూ ఉండేది. ఎలాగైనా పేద విద్యార్థులకు 'విజ్ఞాన భాండాగారాలను చేరువ చేయాలని' తపన పడేవారు. ఆ తపనలోంచి పుట్టుకొచ్చిందే 'అడవి తల్లికి అక్షర తోరణం'. గత మూడేళ్లలో తన సతీమణి సహకారంతో లక్షల పుస్తకాలను పేద పిల్లలు చదివే పాఠశాలలకు చేర్చిన ఆ వ్యక్తే.. సాధిక్. ఆయనో నడిచే 'విజ్ఞాన గని.' విశిష్ట వ్యక్తిత్వం ఆయన సొంతం.**

స్ఫూర్తి

సాధిక్ (53) స్వగ్రామం పూర్వ వరంగల్ జిల్లా వర్ధన్నపేట. తల్లిది ఖమ్మం జిల్లా కల్లూరు. చదువు, ఇతర అవసరాల కోసం సాధిక్ కుటుంబం కల్లూరుకు మకాం మార్చింది. 1వ తరగతి నుంచి 10 వరకు ఖమ్మంలో, ఇంటర్ కల్లూరులో, డిగ్రీ ఖమ్మంలో.. ఆపై పీజీ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో చదివారు. పీజీ చదివే సమయంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వారు స్నేహితులయ్యారు. చిన్నప్పుడు తాము చదువుకునే సమయంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా పుస్తకాలు కొనుక్కోలేక పడ్డ ఇబ్బందులను సాధిక్‌తో తరచూ చెప్పేవారు. ఇవే ఇబ్బందులనూ ఆయనా అనుభవించారు. అప్పుడు ఆయన మదిలో మెదిలిన ఆలోచనే.. 'అడవి తల్లికి అక్షర తోరణం'. మన్యం ప్రాంతాల్లో చదువుకునే పేద పిల్లలకు అవసరమైన పుస్తకాలను ఓ తోపుడు బండిపై అందజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. పీజీ పూర్తి చేసిన తర్వాత సాధిక్ 1986 నుంచి 2005 సంవత్సరం వరకు హైదరాబాద్‌లోని పలు దినపత్రికలు, ఛానళ్లలో పాత్రికేయునిగా పనిచేశారు. ఆ తర్వాత కల్లూరులోనే స్థిరపడ్డారు. తాను ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో కల్లూరుకే చెందిన ఉషా దయాళ్‌ను ప్రేమించిన సాధిక్.. ఆమెనే తన జీవిత భాగస్వామిని చేసుకున్నారు. ఇద్దరికీ సాహిత్య పుస్తకాలంటే అంటే ఎంతో ఇష్టం. ఇద్దరూ కలిసి గ్రంథాలయానికి వెళ్లి పఠనం చేసేవారు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిన ఉషా.. 1991లో ఖమ్మంలో వ్యవసాయ శాఖలో అధికారిణిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో జేడీగా పనిచేస్తున్నారు. సాధిక్ దంపతులకు సంతానం లేకపోవడంతో పేదపిల్లలే తమ పిల్లలుగా భావిస్తుంటారు. తాము సంపాదించిన డబ్బును గ్రంథాలయాల వ్యాప్తికి, పుస్తకాల వితరణకు వెచ్చించడం ప్రారంభించారు. గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలనీ చూస్తున్నారు.


ఓ పాఠశాల చిన్నారులతో సాధిక్, ఉషా దంపతులు

### తోపుడు బండితో ప్రయాణం..

2015, ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ నుంచి 'అడవి తల్లికి అక్షర తోరణం' అనే సంచార గ్రంథాలయం తోపుడు బండిపై ప్రారంభమైంది. రెండు నెలల్లో 350 కి.మీ. ప్రయాణం చేసిన సాధిక్.. తాను సొంతంగా కొనుగోలు చేసిన పుస్తకాలను మార్గంలోని పాఠశాల, గ్రామ గ్రంథాలయాలకు వితరణగా అందిస్తూ వచ్చారు. ఆ తర్వాత రెండో దఫా కుగ్రామాలకు వెళ్లాలనే లక్ష్యంతో పూర్వ హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, వరంగల్ జిల్లాలో ప్రధాన రహదారులనేవి ఎక్కకుండా 100 రోజుల్లో 1000 కి.మీ. ప్రయాణం చేశారు. మారుమూల ప్రాంతాల్లోని వేల పాఠశాలలను సందర్శించి.. లక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం బస్తీలో 'పుస్తకాల పండగ' పేరుతో వరంగల్ పట్టణంలోని 26 మురికి వాడల్లో పర్యటించారు. ముఖ్యంగా గిరిజన పల్లెలు, కుగ్రామాలకు వెళ్లాలనే సంకల్పంతో 'అడవి తల్లికి అక్షర తోరణం' అనే పేరుతో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో తోపుడు బండిపై పుస్తకాలతో కలియదిరుగుతున్నారు. ఇది తెలిసిన గుండాల మండలం కాచనపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ధనసరి నాగమణి విజ్ఞప్తి మేరకు సాధిక్ స్పందించారు. ఆమె అభ్యర్థన మేరకు 28న జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో లక్ష పుస్తకాలను పాఠశాలకు వితరణగా ఇచ్చారు. ప్రస్తుతం ఆయన ఇదే మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శిస్తున్నారు.

### 50 గ్రంథాలయాల ఏర్పాటే లక్ష్యం: సాధిక్

చదువుపై ఆసక్తి గల పేద పిల్లలున్న ప్రాంతాల్లో విజ్ఞాన భాండాగారాలను నెలకొల్పడం మా లక్ష్యం. కాచనపల్లి సందర్శన సందర్భంగా జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ దిండిగాల రాజేందర్‌తో ఈ విషయమై చర్చించాం. జిల్లాల్లో మేం స్వయంగా 50 గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తానని ఆయనకు హామీ ఇచ్చాం. కాచనపల్లి పాఠశాలలో పది ఫలితాల్లో నూరు శాతం మార్కులను సాధించే ఒక్కో విద్యార్థికి రూ.25,000, కృషిచేసే ఉపాధ్యాయ సిబ్బందికి రూ.లక్ష ప్రోత్సాహకంగా ఇస్తానని ప్రకటించా. మేం అందజేసే పుస్తకాల్లో ఇతిహాసాలు, నీతి కథలు, పాఠ్యాంశాలు, ఆంగ్ల వర్ణమాల, చేతి రాతను మెరుగుపర్చుకునే పుస్తకాలు, పెద్ద బాలశిక్షలు, ప్రముఖుల రచనలు, సామాజిక పరిజ్ఞానం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించినవి ఉంటాయి. హైదరాబాద్, ముఖ్య నగరాల్లో అందుబాటులో ఉన్న చోటల్లా పుస్తక సేకరణ జరుపుతుంటాను. పేద పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా, నా సతీమణి ఉషా సహకారంతో కొన్నేళ్లుగా 'అక్షర యజ్ఞం' చేపట్టా.

# ఈ నగరానికి ఏమైంది...

**పీల్చేదంతా విషపూరిత గాలే**

మధిర పట్టణం, న్యూస్‌టుడే

ఈ నగరానికి ఏమైంది.. ఎవరూ నోరు మెదపరేం.. స్వచ్ఛమైన గాలిని దూరం చేస్తున్న నాగరిక జీవితం.. ఫలితంగా పీల్చే గాలిని సైతం విష పూరితం చేస్తున్న సూక్ష్మ ధూళి పట్టణాలు, నగరాలకు సవాల్ విసురుతోంది. ఈ ప్రమాదకర తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతూ నగర వాసులను ఆందోళనకు గురి చేస్తున్న పరిస్థితి. రాజధాని నగరంలోనే ఈ పరిస్థితి ఉందనుకుంటే పొరపాటే.. మన జిల్లాలోనూ ముఖ్య ప్రధాన పట్టణాల్లో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారుతోంది.

**స్వచ్ఛమైన గాలిని దూరం చేస్తున్న సూక్ష్మధూళి**

మనం నిత్యం పీల్చుకునే గాలి మనకు ప్రాణ వాయువు అందించే దాని కన్నా సగ భాగం రోగాలకు కారణమవుతున్న పరిస్థితి. గాల్లోకి నిత్యం 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతుండగా వీటిలో అతిసూక్ష్మ ధూళి కణాలు(పీఎం 2.5), సూక్ష్మ ధూళి కణాలు(పీఎం 10), నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విష పదార్థాలు ఉంటున్నాయి. ఈ గాలి పీలిస్తే ప్రధానంగా నేత్ర, శ్వాసకోశ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు దారి తీసే అవకాశం మెండుగా ఉంటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### ఉభయ జిల్లాల్లోని ఈ ప్రాంతాల్లో...

జిల్లా కేంద్రమైన ఖమ్మంలో బైపాస్‌రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్ ఏరియా, మార్కెట్ ఏరియాలోని పత్తి, మిర్చి డస్ట్, వరంగల్ క్రాస్‌రోడ్డు, టీఎన్‌జీవోస్ కాలనీ, గాంధీ చౌక్, దానవాయిగూడెం డంపింగ్ యార్డు ప్రాంతంలో కాలుష్యం ఎక్కువగా ఉంటోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం ప్రధానంగా 5వ ఇంక్లైన్ ఆనందగని, పాల్వంచ రోడ్డులో నవభారత్, కేటీపీఎస్ శాస్త్రీరోడ్, అల్లూరి సీతారామరాజు కూడలి, కొత్తగూడెం ఇంక్లైన్స్ ఏరియాలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటోంది. గరిమెలపాడు డంపింగ్ యార్డు సమీపాన 2ఇంక్లైన్ ఏరియాలో ఎక్కువ వాయు కాలుష్యం ఉంటుంది. చెత్తా చెదారం వ్యర్థ్యాలను కాలుస్తుండటం వల్ల కాలుష్యం ఏర్పడి దుర్వాసన వస్తోందని ఇటీవల 2వ ఇంక్లైన్, సర్దార్‌పటేల్‌బస్తీ వాసులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. బూర్గంపాడు వద్ద సారపాక పారిశ్రామిక ప్రాంతంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆన్‌లైన్ మానిటర్ ద్వారా కాలుష్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని కాలుష్య స్థాయిని నియంత్రించుకుంటుంటారు. పాల్వంచలోని బొల్లోరిగూడెం, సీతారామపట్నం, తరకగూడెం, ప్రశాంత్‌నగర్‌కాలనీ, వెంగళరావుకాలనీ, మార్కెట్‌ప్రాంతం, గణపతినగర్, శేఖరం బంజర ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉంటుంటుంది. వైరాలో పాతబస్టాండ్ సెంటర్, బస్టాండ్ సెంటర్, జలాశయం వీధిలో ఎక్కువగా కాలుష్యం నెలకొంటోంది. మధిరలోని వైరా నది ఒడ్డున పట్టణంలో నగర పంచాయతీ ద్వారా సేకరించిన చెత్తనంతా పడేస్తుంటారు. ఈ చెత్తను తరచూ నిప్పుపెట్టి కాలుస్తుండటం వల్ల మధిర-నందిగామ ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ముక్కులు మూసుకుని భరించలేని వాతావరణంతో ప్రయాణించాల్సి వస్తోంది. ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం వైపు ఉన్న బైపాస్ రోడ్డులోనూ, బస్టాండ్ రోడ్డులో రైల్వే ట్రాక్ ప్రక్కన సైతం చెత్తను తగలబెడుతుండటంతో వాయు కాలుష్యం తీవ్రంగా ఉంది. ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలోని గ్రానైట్ క్రషర్ మిల్లుల నుంచి ఎక్కువగా వాయు కాలుష్యం జరుగుతుంది. మిరప పరిశ్రమ వద్ద మిరప నుంచి ఆయిల్ తీసే క్రమంలో తీవ్రమైన ఘూటుతో వాయు కాలుష్యం నెలకొంది. ప్రధాన పట్టణాలు, నగరాలతో పాటు పల్లెల్లోనూ ఎక్కువ మంది ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను వీధుల వెంట తగలబెట్టడం వల్ల తీవ్రమైన వాయు కాలుష్యం వెలువడుతోంది.


చెత్తను ఇలా కాల్చేస్తుండటంతో తీవ్ర వాయు కాలుష్యం

### వ్యాధులకు ప్రధాన కారకాలు దుమ్ము ధూళి
**డా.బాలాజీ నాయక్, ప్రభుత్వ వైద్యాధికారి**



ప్రస్తుత సమాజంలో వాయు కాలుష్యం భయంకరంగా మారింది. శ్వాస సంబంధిత, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల కాన్సర్, న్యూమోనియా, లుకేమియా వంటి వాటితో పాటు హృదయ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఎక్కువ సమయం కాలుష్యంలో ఉండటం వల్ల పుట్టబోయే పిల్లలు రుగ్మతల బారిన పడతారు. కార్బన్ మోనాక్సైడ్, డయాక్సైడ్, సల్ఫేట్ వంటివి వాహనాల ద్వారా, పారిశ్రామిక వాడల్లో ఇంధనాలు మండించడం వల్ల ఎక్కువ మొత్తంలో విడుదలవుతాయి. ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యం వల్ల 7 మిలియన్ల మంది చనిపోతున్నారు. కాలుష్య నియంత్రణపై ప్రభుత్వాలు, ప్రజలు ఎక్కువ దృష్టి సారిస్తేనే భవిష్యత్ ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

# హాయ్! బుజ్జీ!!

## నేర్చుకుందాం!


ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

honest - ఆనెస్ట్
honor - ఆనర్



కొన్ని రకాల చెట్లున్నాయి... ఒకటినొకటి అస్సలు ముట్టుకోవు... ఎందుకో ఏమిటో? వెంటనే తెలుసుకోవాలనుందా? ఆలస్యం దేనికి చదివేయండి మరి!

# ఈ చెట్లకు సిగ్గెక్కువ!



నేలపై నెర్రలు ఏర్పడటం చూశాం కానీ ఇదేంటీ చెట్ల మధ్య పగుళ్లు కనిపిస్తున్నాయి' అనుకుంటారు ఈ ఫొటోల్ని చూసినవారెవరైనా. దీనికి కారణం చెట్లకున్న ఓ గమ్మత్తయిన తీరు. దీన్ని 'క్రౌన్ షైనెస్' అని పిలుస్తారు.

✦ ఈ స్వభావం వల్లే చెట్లు ఒకదాన్నొకటి 'అంటను ముట్టను' అన్నట్లు భలేగా పెరుగుతాయి. గుబుర్లు గుబుర్లుగా, చెట్ల కొమ్మలన్నీ దట్టమైన ఆకులతో ఉన్నా పక్క చెట్టుకు తగలకుండా ఉంటాయి. అందుకే ఈ వృక్షాల పందిర్లపైన చివర్లో సన్నని కాలువల్లా ఖాళీ స్థలం కనిపించేస్తుంది. చూడ్డానికి ఎవరో గీసిన చిత్రలేఖనంలా గమ్మత్తుగా అనిపిస్తుంది. అందుకే ఫొటోగ్రాఫర్లు కూడా కింది నుంచి వీటి అందాల్ని కెమెరాల్లో బంధించడానికి ఆసక్తి చూపిస్తుంటారు.

✦ ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాల్లోని అడవుల్లో డ్రయోబలనొప్స్, యూకలిప్టస్ వంటి కొన్ని రకాల జాతి చెట్లలో చూడొచ్చు ఈ తీరు.

✦ మొదటిసారిగా 1920లో చెట్లలోని ఈ క్రౌన్ షైనెస్ గురించి ప్రపంచానికి తెలిసింది.

✦ టచ్ మి నాట్ అన్నట్టు చెట్లలో ఈ వింతేంటో అన్న దానిపై భిన్నమైన కారణాలున్నాయి అంటూ చెబుతున్నారు పరిశోధకులు. ఒకటేమో... ఆకులు తినే ఓ రకమైన పురుగులు ఒక చెట్టు నుంచి మరో చెట్టుపైకి చేరకుండా ఉండటానికే ఈ చెట్లు ఇలా ఖాళీ స్థలాల్ని వదులుతూ పెరుగుతాయని. రెండోదేమో ఒక చెట్టు ఆకులు మరో చెట్టుకు తగలకుండా, చెట్ల కిరణజన్యసంయోగ క్రియకు అడ్డు రాకుండా ఉండటానికేనని.

✦ కారణం కచ్చితంగా తెలియకపోయినా ఈ స్వభావంతో అందర్నీ ఆకట్టుకుంటున్నాయీ చెట్లు.


జవాబులు: స్కూల్ సవాల్:
1. ఎంఎస్ స్వామినాథన్
2. స్వామి దయానంద సరస్వతి
3. ఆర్యభట్ట
సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్: టాస్మేనియా

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
email: hb.eenadu@gmail.com

## ఆణిముత్యం

మన సుగుణం మనల్ని రాజును చేస్తే, మన మూర్ఖత్వం మనల్ని బానిసల్ని చేస్తుంది
– ఆస్కార్ వైల్డ్

## బింబూ & బబ్లూ – అండమాన్‌లో సాహసాలు 2




## సబ్జెక్ట్ ల్యాబ్ – సోషల్

### కనుక్కోండి!


ఒకే దేశం ఉన్న ఏకైక ఖండం ఆస్ట్రేలియా మాత్రమే అని మనకు తెలుసు. ఇక్కడున్న మ్యాప్‌ను సరిగ్గా చూడండి. మన దేశం కింద శ్రీలంక ఎలా ఉంటుందో, సరిగ్గా ఆస్ట్రేలియా కింద కూడా ఓ భూభాగం ఉంది. అయితే ఇది ప్రత్యేక దేశం కాదు. ఆస్ట్రేలియాలోని ఓ రాష్ట్రం. అయితే దాని పేరేంటో చెప్పుకోండి?



## పూర్తి చేస్తారా?



గడుల సాయంతో మిగతా బొమ్మని పూర్తి చేసి రంగులేయండి



## మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?

### స్కూల్ సవాల్

1. హరిత విప్లవ పితామహుడెవరు?
2. ఆర్య సమాజాన్ని స్థాపించిందెవరు?
3. మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?



- ఆకల శ్రీధాత్రి, తొమ్మిదో తరగతి



- ఎఎస్‌విఐఆర్ ఉత్తేజ్, ఏడో తరగతి, కె.వి.ఎస్, విజయనగరం

## అవునా!



● హిప్పోలు మనిషికంటే వేగంగా పరిగెడతాయి.



● కప్పలు నీరు తాగవు. వాటి చర్మం నుంచే దాన్ని లోపలికి గ్రహిస్తాయి.



● అంత శరీర ఆకారంతో ఉండే ఏనుగులకు చిన్న తేనెటీగల్ని చూస్తే చెప్పలేనంత భయమట.

● కొన్ని ఉడుతలు పిల్లల్ని వదిలి పెట్టేస్తుంటాయి. అలాంటప్పుడు వేరే ఉడుత వాటి బాధ్యత తల్లి తీసుకుంటుంది.





● సాలీళ్లు ఎగరలేవు, దూకుతాయంతే.

# శిక్షణ చేపట్టి సౌకర్యాలు పెంచాలి

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బల్ పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం వచ్చిన వారంతా సీనియర్ క్రీడాకారులు. వారిలో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారున్నారు. మరికొందరు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారున్నారు. అందరిలో ఒకే ఆందోళన.. మేము ఎదివచ్చిన నాటి పరిస్థితులు, సదుపాయాలు, శిక్షణలు నేటి యువతరానికి అందుబాటులో లేవని వారు కలత చెందారు. రాష్ట్రంలో కొనసాగిన పరిస్థితులు మిగిలిన క్రీడలపై ఎలా ఉన్నా బాస్కెట్‌బాల్‌పై తీవ్ర ప్రభావం చూపాయనే భావన వ్యక్తమయ్యింది. క్రీడాకారుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి తరుణంలో శిక్షకుల నియామకం జరగాలి, అకాడమీలు ఏర్పాటు కావాలి. ఇండోర్ ఉడెన్ కోర్టులు జిల్లాకు ఒకటైనా అందుబాటులోకి రావాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు. ఈ అంశంపై రాష్ట్ర బాస్కెట్‌బాల్ రంగం ఉద్దండ క్రీడాకారులుగా ఎదిగి ఉద్యోగాలు పొందిన కొందరు క్రీడాకారులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

## కరీంనగర్ జట్టును గమనించండి చాలు

**–వినయ్ యాదవ్, సెంట్రల్ ఎక్సైజ్ జట్టు కెప్టెన్**



క్రమబద్ధంగా సాగే శిక్షణలు ఎప్పుడు ఫలితాలనిస్తాయి. మైదానానికి వచ్చి ఆడుకోమంటే ఇష్టం ఉన్న రోజు వెళ్తారు. లేకుంటే అంతే. క్రీడా పాఠశాలలు, అకాడమీల్లో మినహాయింపులు, వెసులుబాటులు ఉండవు. దీంతో శిక్షణ ఒక క్రమపద్ధతిలో ఉంటాయి. అందుకే అక్కడ ఫలితాలు వస్తాయి. గతంలో మన రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ క్రీడా వసతి గృహాల్లోంచే మేము ఎదిగి వచ్చాము. ఇక్కడ జరుగుతున్న పోటీల్లో కరీంనగర్ జట్టు ఆట ఎంతో బాగుంది. ఎందుకంటే వారంతా కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన క్రీడాకారులు. జాతీయ స్థాయిలో చూసిన ప్రతిభను వారు ఇక్కడ ప్రదర్శించారు. క్రీడా పాఠశాలలు, క్రీడా వసతి గృహాలు ఉన్నంత కాలం ప్రతిభ వెలుగు చూసింది. అలాంటి రోజులు రావాలి. రాష్ట్రంలో శిక్షకుల సంఖ్య పెరగాలి.

## గతంతో పోలిస్తే ప్రోత్సాహం తగ్గింది

**–వెంకటేశ్వరావు, టీఎస్ ఆర్‌టీసీ శిక్షకుడు**



బాస్కెట్‌బాల్లో నిరంతర శ్రమ ఉంటేనే రాణించగలుగుతారు. సరదాగా తీసుకుంటే ఆట కూడా అంత వరకే ఉంటుంది. ఫలితాలు, పతకాలు తగ్గాయి. క్రీడాకారులకు ప్రోత్సాహకంగా ఉద్యోగాలిచ్చిన సంస్థలు కూడా కొన్ని వెనక్కితగ్గాయి. బ్యాంకులు, ఇతర సంస్థలు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీ చేపట్టడంలేదు. ఆ ప్రభావం ఇప్పుడా జట్లపై ఉంది. అంతకుతగ్గట్టుగానే ఫలితాలు ఉంటున్నాయి. రోడ్డు రవాణా సంస్థలో కూడా స్పోర్ట్స్ కోటా నియామకాలు జరపాలని కోరాము. 2002 నుంచి కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు క్రీడాకారులను తీసుకునే క్రమంలో దూరంగానే ఉంటున్నాయి.

## ఒలింపిక్ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**–పి.బి.శ్రీనాథ్, ఎస్‌బీఐ జట్టు కెప్టెన్**



ఒలింపిక్ విభాగంలో ఉన్న క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కొందరు చేస్తున్న పనులు ప్రభుత్వానికి తెలియడంలేదు. గుర్తింపులేని క్రీడాలను తెరపై పెద్దగా చూపించి ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను అయోమయంలో పడేస్తున్నారు. హైదరాబాదులో ఒక చోట ఇండోర్ బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేశాక ఒక అధికారి అదే స్థలాన్ని మరో సరదా క్రీడకు కేటాయించారు. క్రీడారంగంపై అవగాహన లేని వారు అధికారులుగా వస్తున్న సందర్భంలో అనేక నష్టాలు జరుగుతున్నాయి. ఇలాంటి విషయాలు ప్రభుత్వానికి చేరడంలేదు. క్రీడా వసతి గృహాల ఆవశ్యకత ముఖ్యంగా బాస్కెట్‌బాల్ రంగంలో పెరిగింది.

## ఉడెన్‌కోర్టులో రాణించలేరనేది అపోహ మాత్రమే

**–గాయత్రి, రైల్వే క్రీడాకారిణి**



సిమెంట్, మట్టి కోర్టుల్లో ఆడేవారు ఉడెన్‌కోర్టులో ఆడలేరనేది అపోహ మాత్రమే. మనదేశంలో ఉడెన్ కోర్టులు చాలా తక్కువ. ఇలాంటివి పాఠశాలలు ఏర్పాటు చేసుకోవచ్చు. కొన్ని పాఠశాలల్లో ఇలాంటి సదుపాయాలు ఉన్నా అక్కడి ఫీజులు మధ్యతరగతి వారు అటు చూసే పరిస్థితి లేదు. క్రీడాకారులంతా మధ్యతరగతి నుంచే వస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచే ఉంటారు. ఇలాంటి వారు ఎక్కడ సాధన చేస్తున్నామనే విషయం వదిలిపెట్టి తనపై తాను నమ్మకం పెంచుకోవాలి. పట్టుదలగా రాణించాలి. జట్టులో పొట్టి, పొడుగు అందరూ కావాలి.

## రెండు రాష్ట్రాల్లో కొరవడుతున్న ఫలితాలు

**–దివ్య, రైల్వే క్రీడాకారిణి**



నేను తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చాను. తమిళనాడులో క్రీడా వసతి గృహాలు ఉన్నాయి. అక్కడ నిరంతర శిక్షణ ఉంటుంది. మెరుగైన ఫలితాల కోసం కృషి జరుగుతోంది. 2015లో మాజట్టు జాతీయ స్థాయిలో పతకం సాధించిన ఫలితంగా మాకు భారతీయ రైల్వే ఉద్యోగాలిచ్చింది. ఇలా జాతీయ స్థాయి పతకాలు ఉంటేనే ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ పతకాలులేక తెలుగు రాష్ట్రాల్లోని క్రీడాకారులు ఉద్యోగాలకు దూరమవుతున్నారని తెలుస్తోంది. రైల్వే సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించి, అండగా నిలిచే అతిపెద్ద సంస్థ. ప్రతిభ ఉంటే ఇక్కడ ఉద్యోగం సాధించవచ్చు.

## మంచి ఆటండి: –చంద్రశేఖర్, టీఎస్ ఆర్‌టీసీ క్రీడాకారుడు



బాస్కెట్‌బాల్ మంచి ఆట. శారీరకంగా పొడవున్నవారు బాస్కెట్‌బాల్‌ను ఎంచుకుంటే త్వరగా మంచి ఫలితాలు వస్తాయి. మన రాష్ట్ర జట్టులో ఆరడగులు ఉన్న వారిని సునాయసంగా జట్టులోకి తీసుకుంటాము. ఇతర రాష్ట్ర జట్లలో ఈ ఎత్తున్న క్రీడాకారులను రిజర్వ్‌లో ఉంచి వారికన్నా ఎత్తున్న వారిని బరిలోకి దింపుతున్నారు. ఎత్తు బాస్కెట్‌బాల్‌లో ప్రధాన భూమిక వహిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోకి వస్తున్న పొడగరులను తట్టుకునేందుకు ఎంత ఎక్కువ ఎత్తుంటే అంతమేలనే దశలో పొడగరులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రజట్టు ప్రమాణాలు ఇంకా పెరగాలి.



రిమోట్ కంట్రోల్‌తో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ

# నేర రహిత సమాజం కోసం కృషి: సీపీ

❖ ఖమ్మం గ్రామీణ ఠాణాలో 32 సీసీ కెమెరాలు

❖ కంట్రోల్ రూంను ప్రారంభించిన సీపీ

**ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే:** నేర రహిత సమాజం కోసం తెలంగాణ పోలీసు కృషి చేస్తుందని నేరాలను నిరోధించడతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం కలిగిన ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. ఖమ్మం గ్రామీణ ఠాణాలో 32 సీసీ కెమెరాల అనుసంధానంతో కంట్రోల్‌రూంను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల శాంతియుత సమాజ నిర్మాణం కోసం స్థానిక దాతలు ముందకు వచ్చి ఆధునిక సాంకేతికత గల సీసీ కెమెరాలను అందజేసినందుకు వారిని అభినందించారు. హైదరాబాద్ తరహా ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ఖమ్మం పోలీసు కమిషనరేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రానున్న రోజుల్లో ఖమ్మంలో నేరాలు చేయాలంటే నేరస్థుల్లో భయం కలిగే విధంగా పోలీసు వ్యవస్థను సాంకేతికంగా ఆధునికీకరిస్తామన్నారు. ఇప్పటికే సీపీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా అనేక నేరాలను ఛేదించామని గుర్తుచేశారు. సీసీ కెమెరాల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అడిషనల్ డీసీపీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసు కానిస్టేబుళ్లతో సమానమన్నారు. రోజుకు 24గంటలపాటు రక్షణ ఇచ్చే సీసీ కెమెరాలను అన్ని గేటెడ్ కమ్యూనిటీ నివాస సముదాయాల్లో, దుకాణాల ముందు, అపార్టుమెంట్‌లలో, విద్యాసంస్థలు, సినిమా హల్స్ ముందు, ప్రయివేటు ఆసుప్రతులు, వ్యాపార వాణిజ్య కేంద్రాల వారు, ఆర్థిక లావాదేవీలు నిర్వహించే వారు సీసీ కెమోరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రానైట్ అసోసియేషన్ వారు ముందుకు వచ్చినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఖమ్మం గ్రామీణ ఏసీపీ నరేశ్ రెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి, ఎంపీపీ మేళ్లచెర్వు లలిత, జడ్పీటీసీ సభ్యురాలు ధరావత్ భారతి, ఎస్సైలు చిరంజీవి, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

**పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. గురువారం పాల్వంచలోని ఆ సంఘ కార్యాలయంలో ములకలపల్లి, పాల్వంచ మండల నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, పింఛనర్ల వేతన సవరణ ముగిసిన నేపథ్యంలో తక్షణమే నూతన వేతన సవరణ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ కమిటీలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేవిధంగా కొత్త పీఆర్సీ ఉండాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో నష్టదాయకమైన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను న్యాయపరమైన ఆటకాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాయకులు రాజు, రాంబాబు, నగేశ్, అశోక్, కిషోర్, జాదవ్, రాము, జానకీరాములు, వెంకట్, సుధాకర్, శ్రీనివాస్, యాకూబ్ పాషా, గోవిందరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

# పెరిగిన విద్యుత్తు వినియోగం

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా పథకాన్ని నూతన సంవత్సరం సందర్భంగా పారంభించింది. దానికి అనుగుణంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. జనవరి 1వ తేదీన ప్రారంభమైన ఈ పథకంతో ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో ఒక్కసారిగా 60 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ పెరిగిందని అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాధారణంగా నిత్యం 300 మెగావాట్ల విద్యుత్తు అవసరం. పథకం ప్రారంభించిన తొలి రెండు రోజులు అదనంగా 80 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ పెరిగింది. తదుపరి రెండు రోజులలో ఇది 60 మెగావాట్లకు చేరింది.

❖ సాధారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ సమయంలో 6.27-6.3మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తుంటారు. పథకం ప్రారంభించిన తొలి రెండు రోజులలో ఇది 2 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం పెరిగింది. అంటే 8.2 మిలియన్ యూనిట్ల వాడకం నమోదు అయ్యింది. తదుపరి రెండు రోజులు 1.5మిలియన్ యూనిట్లకు వాడకం తగ్గి ప్రస్తుతం 7.7మిలియన్ యూనిట్లకు చేరింది. రైతన్నలు పంటల సాగుకు భారీగా వినియోగిస్తుండటమే దీనికి కారణమని తెలుస్తోంది. మరో నాలుగు రోజులు గడిస్తే రైతుల విద్యుత్తు వినియోగం మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్తు వినియోగం భారీగా పెరిగిన ఎక్కడా సరఫరాకు అంతరాయం కలగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంవంటి ప్రభావాలు కనిపించలేదని అధికారులు వివరించారు.

**ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపుకు అవగాహన:** ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదని రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 24 గంటల సరఫరా అందిస్తుండటంతో తక్షణమే వీటిని తొలగించాలంటూ రైతులకు విద్యుత్తు శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తొలగించకుంటే జరిగే నష్టాలను వారికి వివరిస్తున్నారు. దీంతో కొందరు స్వచ్ఛందంగా వీటిని తొలగించేందుకు ముందుకు వస్తున్నారు.

# ఖరీఫ్‌లో 67,168 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ తరపున ఈ ఖరీఫ్‌లో పీఏసీఎస్, గిరిజన సహకార సంస్థల ద్వారా 101 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 67,168 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అమృతరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6412 మంది రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటా రూ.1590, సాధారణ రకానికి క్వింటా రూ.1550 చొప్పున కొనుగోలు చేసి వారికి మొత్తం రూ.73కోట్లు చెల్లించినట్లు ఆయన వివరించారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



జ్ఞాపికలను అందజేస్తున్న సీజీఎం రమణమూర్తి, సీఐ శ్రీనివాస్

**కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్ జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టును గురువారం ఎంపిక చేశారు. కొత్తగూడెం రుద్రంపూర్‌లోని ఆచార్య జయశంకర్ మైదానంలో నిర్వహించిన ఎంపికల్లో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పాల్గొన్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా సీజీఎం రమణమూర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జయశంకర్ మైదానాన్ని కోల్‌ఇండియా స్థాయి పోటీలను నిర్వహించడానికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ యువత క్రీడల్లో రాణించడంతో సాయుధ బలగాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండే ప్రాధాన్యం వివరించారు. ఎంపికయిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి కె.మహీధర్, ఎస్వోటూ జీఎం షాలెంరాజు, డీవైజీఎం(పర్సనల్) సాల్మన్‌రాజు, డీవైజీఎం(సివిల్) సూర్యనారాయణ, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, రుద్రంపూర్ సర్పంచ్ లక్ష్మి, తెరాస నాయకులు పాల్గొన్నారు.

## ఎంపికైన బాలబాలికల జట్లు

**బాలికల జట్టు:** ఎం.మేఘన (పాల్వంచ), ఎం.శివాని (పాల్వంచ), నవ్య (ములకలపల్లి), బి.హారిక (భద్రాచలం), ఎ.వందన (కొత్తగూడెం), కె.దీక్షితసాయి (మణుగూరు), దీపిక (మణుగూరు), ప్రణీత (అశ్వాపురం), అమృతవర్షిణి (పాల్వంచ), లిఖితాజ్వాల (ఇల్లెందు), ఎం.సింధు (కొత్తగూడెం)

**బాలుర జట్టు:** పి.లిఖిత్ (భద్రాచలం), సురేశ్ (అన్నపురెడ్డిపల్లి), ఎస్‌కె.షాహిల్ (కొత్తగూడెం), రాజారత్నం (కొత్తగూడెం), చత్రపతినాథ్ (కొత్తగూడెం), ఆర్.ప్రణయ్ నాయక్ (పాల్వంచ), జి.రవి (అన్నపురెడ్డిపల్లి), కె.రాజేశ్, సాయి, ఎస్‌కె సమీర్ అహ్మద్ (కొత్తగూడెం), ఎండీ.పరహా (కొత్తగూడెం).

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: పనుల్లో ఆటంకాల నివారణకు గణపతిని ఎలా పూజించాలి? రైతులకు లాభాన్నిచ్చే వ్యవసాయ వాస్తు నియమాలు.. 8-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: లాహిరి లాహిరి లాహిరిలో.. (హరికృష్ణ, భానుప్రియ).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'రాజ్‌మా ఆనపకాయకుర్మా', మీ చేతి వంట 'సోయాకాజూకర్రీ', 'వెజ్ కోకోనట్ పలావు', జస్ట్ ఎ మినిట్ 'చిక్కుడు గింజల ఛాట్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: సైసై సయ్యారే (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్)

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్: 100% కామెడీ షో, 10-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం...

## ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 నేను..తను రిపీట్
01:15 ప్రేమిస్తే చుక్కలు చూపిస్తా రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామా
03:30 పటాస్ పంచెస్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామా
08:00 క్రాక్ కిడ్స్
09:00 పటాస్
09:30 డీజే
09:45 స్టే..పూలిష్
10:00 ఈ-జంక్షన్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

★ మానస – (ఉ.6:00, రా. 11:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా. 10:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
★ అమృతం: తృణ ధాన్యాలు (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.01:00, రా.8:30)
★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
★ జీవనరేఖ చైల్డ్ కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా ? (ఉ.9:30)
★ హోమియో – మోనోపాజ్ కంటే ముందు నొప్పులు (మ.2:00, రా.7:00)
★ సుఖజీవనం (ఉ.10:00)
★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (మ.2:30, రా.9:30)
★ ఆరోగ్యమస్తు – 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (ఉ.10:30)
★ ఆరోగ్యమస్తు – 1. పొడిబారిన కళ్ళు - తీసుకోవలసిన జాగ్రత్తలు, 2. మన శరీరం మీద మద్యం ప్రభావం, 3. అల్లం తీసుకోవడం ఎప్పుడు మంచిది కాదు (మ.3:00, రా.9:00)
★ డా. ఈటీవి – అజీర్తి సమస్యలు (ఉ.11:00)
★ డా. ఈటీవి – జనరల్ హెల్త్ (ఉ.11:15)
★ డా. ఈటీవి – శ్వాసకోశ సమస్యలు (మ.3:30, రా. 7:30)
★ డా. ఈటీవి – ఎముక ఆరోగ్యం - కీళ్లవాతం (మ. 3:45, రా. 7:45).

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ , 7-00: సన్‌రైజ్ సినిమా: మోసగాడు, (శోభన్‌బాబు, శ్రీదేవి) 10-00: మార్నింగ్ షో: భలే అబ్బాయిలు (కృష్ణ, కె.ఆర్.విజయ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ధర్మక్షేత్రం (బాలకృష్ణ, దివ్యభారతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ముసుగుదొంగ, (సుమన్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పెద్దకొడుకు (శోభన్‌బాబు, కాంచన), 10-00: సెకండ్ షో: 47 రోజులు (చిరంజీవి, జయప్రద).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలి శెనగల పుదీనా బ్రౌన్ రైస్ & క్యారెట్ కీన్వా మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - మిక్స్డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - మిక్స్డ్ గ్రీన్ ఓట్స్ కబాబ్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - పంచ్ ఖద్యా, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చిల్లీ ఛీజ్ ఫ్రైస్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - రైస్ సేమ్యా చికెన్ బిర్యాని, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - స్వీట్ కార్న్ బంగాళదుంప బేల్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఎండురొయ్యల పొట్టు కూర, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - తలకాయ కూర & షికమ్ పూరీ కబాబ్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - కోకోనట్ ఫింగర్స్, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - వెల్లుల్లి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: మా ఊరి రుచులు - గ్రీన్ చిల్లీ చికెన్ & బ్రెడ్ గులాబ్ జామున్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ మహాలక్ష్మి ఆలయం, చిట్టినగర్, విజయవాడ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సంతోషిమాతా ఆలయం, సూర్యాపేట, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఏ ఛానల్లో ఏముంది.. 05-01-2018

**SVBC** — **ఉదయం:** 05-30 తిరుప్పావై + గోదాస్తుతి, 06-30 తిరుప్పావై + గోదాస్తుతి + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు - (అభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 లైవ్ డయల్ యువర్ ఈ.ఓ., 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కళ్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జితబ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 లైవ్ శ్రీ పద్మావతి అమ్మవారి అభిషేకం, **సాయంత్రం:** 04-00 శ్రీ లలితా సహస్రనామస్తోత్ర పారాయణం, 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + లైవ్ ఎస్.డి. సేవ తిరుచానూరు, - తిరుచానూరు, 06-00 ఎస్.డి. సేవ - తిరుచానూరు, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం +శ్రీనివాస గద్యం + అలివేలుమంగ నామావళి 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు, భక్తుల అనుభవాలు, 08-30 మల్లిఖార్జున సుప్రభాతం - శ్రీ చాగంటి, 09-00 ఆలయదర్శనం, 09-30 శివమహాపురాణం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు.

**భక్తి TV** — **ఉదయం:** 06-00 శ్రీలక్ష్మీ సహస్రం 6-30 శ్రీకనకధారస్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రీలలితా సహస్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 జ్యోతిస్వరూపా అయ్యప్ప 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీకనకధార స్తోత్రం, 05-30 శ్రీలలితాసహస్రం, 6-00 శ్రీ లక్ష్మీసహస్రం, **రాత్రి:** 7-00 భక్తి విశేషాలు 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగద్గీత 9-00 త్యాగయ్య (డాక్యుమెంటరీ), 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11.00 గోదామృతం.

**ZEE తెలుగు** — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్ 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: కొత్తబంగారులోకం, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం, 03-30 కల్యాణ వైభోగం, **సాయంత్రం:** 04-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా , 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా (రిపీట్).

**maa** — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం (రిపీట్), 02-30 సినిమా: మల్లన్న, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 సినిమా: సింహా.

**GEMINI** — **ఉదయం:** 06-30 శ్రీ కరుణామయి దేవీ వైభవం, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 సినిమా: పెళ్లైన కొత్తలో, 11-30 నాగిని, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ 12-30 చక్రవాకం, 01-00 నందిని, 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: శంఖం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: పెళ్లైన కొత్తలో...

**HBO** — **ఉదయం:** 06-00 ది నేక్డ్ గన్ : ఫ్రం ద ఫైల్స్ ఆఫ్ పోలీస్ స్క్వాడ్, 07-01 ఇన్‌సెప్షన్, 09-42 జాక్ ద జయంట్ స్లేయర్, 11-46 మడగాస్కర్, **మధ్యాహ్నం:** 01-14 బ్యాట్‌మేన్ × సూపర్‌మేన్ : డాన్ ఆఫ్ జస్టిస్, 03-58 ది అకౌంటెంట్, **సాయంత్రం:** 06-11 ట్రాన్స్‌ఫార్మర్స్ : డార్క్ ఆఫ్ ది మూన్, **రాత్రి:** 09-00 స్నాక్స్: ది గ్రేటర్ గుడ్.



# ఆధార్ ఉంటేనే ఎరువులు!


ఈపోస్ యంత్రంతో ఎరువులు కొనుగోలు చేస్తున్న యువరైతు

ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఇకనుండి ఆధార్ తప్పనిసరి. ఈపోస్ యంత్రంతోనే ఎరువులను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 2018 నుండి ఇది అమలులోకి వచ్చింది. అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెదక్ జిల్లా నర్సాపూర్ ఏడీఏ సురేఖ, మండల వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. ఇందు కోసం సహకార సంఘాలు, ప్రవేటు దుకాణాల యజమానులకు ఈపోస్ యంత్రంపై శిక్షణ ఇచ్చి వాటిని ఎలా వాడాలో తెలిపారు. దీంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వారు తెలిపారు.

అధిక ధరలను నియంత్రించవచ్చు. రైతులకు ఇచ్చే రాయితీ విత్తనాలు ఎరువులు పక్కదారి పట్టకుండా కేవలం అర్హులకు మాత్రమే చేరుతాయి. రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, చెరకు, వేరుశనగ, శనగ, పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తారు. కాని ఎరువుల కోసం దుకాణాల వద్దకు వెళితే కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి రైతులను అనేక ఇబ్బందులు కలుగజేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రాయితీ పక్కదారి పడుతోందని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆధార్‌కార్డు చూపించి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు రైతు పేరు ఈపోస్ యంత్రంలో నమోదు చేయాలి. అక్కడ రైతు వేలిముద్ర తప్పక వేయాల్సి ఉంటుంది. దీంతో చాలావరకు అవినీతిని నియంత్రించవచ్చు. ఎరువులకు ఆధార్‌కార్డు అనుసంధానం తప్పని అయ్యింది. సహకార సంఘాలు, ప్రవేటు ఎరువుల దుకాణాలకు ఈపోస్ యంత్రాలు తప్పనిసరిగా ఉండాలి. రైతు ఎంత కొనుగోలు చేశారు. వాటిధరలు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అధిక ధరలకు విక్రయించే ఎరువుల దుకాణదారుల ఆటలు సాగవు. రైతులకు సరఫరా చేసే డీఏపి, యూరియా రాయితీలు పక్కదారి పట్టవు. ఇప్పటికే ఎరువులు విక్రయించే దుకాణాలలో ఈపోస్ యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్ (మెదక్ జిల్లా)

# నువ్వు సాగులో జాగ్రత్తలు

వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటి తడులతో సాగుచేసే పంటలలో నువ్వు పంట ప్రధానమైనది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నువ్వులను విత్తుకుని తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అధిక రాబడి పొందేందుకు ఈ పంట ఉపకరిస్తుంది. కాగా నువ్వులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను వ్యవసాయ అధికారులు వివరించారు.

## ఆకుమచ్చ తెగులు

గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఆల్టర్నేరియా అనే శిలీంధ్రం వల్ల ఆకులు, కాండం, కాయల మీద గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయి. ముదురు గోధుమరంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనాలకు 2 గ్రా. కార్బండిజంతో విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. పంట దశలో ఈ తెగులు కనిపిస్తే 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.

## బూడిద తెగులు

ఈ తెగులు ఎరిసెఫె అనే శిలీంధ్రం వల్ల సోకుతుంది. లేత ఆకులపై తెల్లటి బూడిదతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఆశించిన ఆకులు పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి కలిపి ఆకులు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

**వెర్రి తెగులు:** ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. ఇది సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవిగా మారి పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా రాలిపోయి కాయలు ఏర్పడవు. దీపపు పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నివారణకు తెగులును తట్టుకునే చందన, హిమ రకాలను ఎంపిక చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. దీపపు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

## వేరు, కాండంకుళ్లు తెగులు

ఇది సోకిన మొక్కలు పసుపు వర్ణంలోకి మారి కాండం మీద నల్లని చారలు కనిపిస్తాయి. వేర్లు కూడా కుళ్లిపోతాయి. ఈ తెగులును కలుగచేసే శిలీంధ్రం భూమిలో, విత్తనాలు, పంట అవశేషాలపై జీవిస్తుంది. నివారణకు పంటమార్పిడి పద్ధతి పాటించాలి. పంట అవశేషాలను కాల్చివేయాలి. కిలో విత్తనాలకు 3 గ్రా. కాప్టాన్, 3 గ్రా. మాంకోజెబ్ కలిపి శుద్ధిచేసి విత్తుకోవాలి. లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లు తడపాలి.




## కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఇఫ్టూ

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** ఏరియాలోని జేకే-5 ఉపరితల గని నుంచి సీఎస్పీకి బొగ్గు రవాణా చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు డి.ప్రసాద్, జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలనీ, లేని పక్షంలో దశల వారీ ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో కె.సారంగపాణి, పాయం వెంకన్న, యాకూబ్, విజయానందం, శ్రీను, మురళి, సదానందం, సారయ్య, శంకర్, బాలాజీ, తారాచంద్, శ్రీనివాస్‌పాసి పాల్గొన్నారు.

## అధికారుల అండతోనే క్రమం తప్పుతున్నారు

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** కేవోసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్లు అధికారుల అండతోనే క్రమం తప్పుతున్నారని కేవోసీ టిప్పర్ యజమానుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సురేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టేకులపల్లి కేవోసీలో తనిఖీ కేంద్రం వద్ద టిప్పర్లు క్రమపద్ధతి లేకుండా నేరుగా ఎల్ఎంలను నమోదు చేసుకుంటున్నారనీ, దీంతో ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. అధికారులు స్పందించి టిప్పర్లు క్రమపద్ధతిలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కరాటేలో సింగరేణి విద్యార్థుల ప్రతిభ

**కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే:** గత నెల చివరి వారంలో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పలువురు బహుమతులను గెలుచుకోగా వారిని జనరల్ మేనేజర్(ఎడ్యుకేషన్) బి.రాంనారాయణ, ప్రిన్సిపల్ శైలజార్ఘూన్సీ, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ కె.సావిత్రి అభినందించారు. గురువారం కళాశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో విద్యార్థులనభినందించారు. ఈ పోటీల్లో కటా విభాగంలో జాహ్నవి ప్రథమ స్థానాన్ని గెలుచుకోగా మౌనిక, అశ్విని ద్వితీయ స్థానంలో నిలిచారు. కుమితే విభాగంలో నిఖిత ద్వితీయ స్థానంలో, బషీదా, అశ్విని, మౌనిక తృతీయ స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎం.లత కరాటే కోచ్‌గా వ్యవహరించారు. బహుమతులను పొందిన విద్యార్థులను కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరాటే రామస్వామి అభినందించారు.



విజేతలైన విద్యార్థులతో యాజమాన్యం

# పరిహారమివ్వకుండా పనులేమిటి?

## ఓసీ లారీలను అడ్డుకన్న అన్నారం నిర్వాసితులు

**పీవీకాలనీ (మణుగూరు), న్యూస్‌టుడే:** మణుగూరు ఉపరితల గని పనులను గురువారం పలువురు నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. మణుగూరు పురపాలకం పరిధిలోని అన్నారం గ్రామం వద్ద 383, 376, 502 సర్వే నెంబర్లలోని 24 ఎకరాల అసైన్డ్ భూమికి నష్టపరిహారం చెల్లించలేదు. తమకు పరిహారం అందకుండానే పనులు ఎలా చేపడతారని బాధిత రైతులు మట్టి తోలకాలను చేపడుతున్న లారీలను అడ్డుకున్నారు. నష్ట పరిహారం విషయం కోర్టులో ఉన్నందున ఎలాంటి ఆదేశాలు రాకుండా తమ భూముల్లో సింగరేణి సంస్థ దౌర్జన్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఓసీ ప్రాజెక్టు అధికారి లలిత్‌కుమార్, సింగరేణి ఎస్టేట్ అధికారిణి ఉషశ్రీ సంఘటనా స్థలానికి వచ్చి బాధిత రైతులతో మాట్లాడారు. ఓసీ ఏర్పాటుకు రైతులు ఎంతగానో సహకరించారని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. శుక్రవారం రెవెన్యూ, సింగరేణి ఉన్నత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు దొడ్డపనేని నర్సింహారావు, ఈరెళ్లి కోటయ్య, వెంకటప్పయ్య, కొప్పుల వాసు తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి లలిత్ కుమార్

## ఐటీఐ ఎలక్ట్రీషియన్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**ఇల్లెందు గ్రామీణం(సింగరేణి), న్యూస్‌టుడే:** ఇటీవల సింగరేణి సంస్థలో ఐటీఐ ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణను ఈ నెల 10నుంచి ఇవ్వనున్నట్లు ఏరియా జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ పేర్లను గనుల వృత్తి శిక్షణ కేంద్రం(ఎంవీటీసీ) కార్యాలయంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అనుభవం, నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని సంస్థ నిర్వహించే పోటీ పరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు.

## బదిలీ ఇన్‌ఛార్జి జీఎం, ఓర్‌మెన్ల నిర్లక్ష్యం

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** కేవోసీ బదిలీ ఇన్‌ఛార్జి జీఎం, ఓర్‌మెన్లు తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కేవోసీ బొగ్గు రవాణా గుమాస్తాలు ఆవేదన వ్యక్తం చేశారు. కేవోసీలో గురువారం పీవో వేణుగోపాల్‌కు బొగ్గు రవాణా గుమాస్తాల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జి-17, జి-13 నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని అడిగినందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలిపారు. బొగ్గు రవాణా చేస్తున్న లారీ, టిప్పర్‌లకు కిరాయిలు తగ్గించి మరీ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నాణ్యమైన బొగ్గును సరఫరా చూపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సత్తాచాటిన భద్రాద్రి, ఖమ్మం జిల్లా జట్లు

**కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా క్రికెట్ జట్లు తమ సత్తాను చాటడంతో రెండో రోజు మ్యాచ్‌లు ఏకపక్షంగా ముగిశాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తెలంగాణ అంతట క్రికెట్'లో భాగంగా తలపెట్టిన జి.వెంకటస్వామి మెమోరియల్ టీ20 క్రికెట్ లీగ్ నాలుగు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు గురువారం పోటీలు రెట్టించిన ఉత్సాహంతో జరిగాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చేకూరి వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీకె. మనోహర్ రెండోరోజు పోటీలను ప్రారంభించారు.



బ్యాటింగ్ చేస్తున్న భద్రాద్రి జట్టు క్రీడాకారుడు

### పది వికెట్ల తేడాతో విజయం

ఉదయం టాస్‌గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన మహబూబాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 19.5 ఓవర్లలో పదివికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులో జి.హరీష్ 34 బంతుల్లో 42 పరుగులతో టాప్‌స్కోర్‌ను సాధించగా, బి.కుమార్ 11 పరుగులతో సహకారం అందించాడు. ఇతర బ్యాట్‌మెన్‌లు కనీసం రెండంకెల స్కోర్‌ను సాధించకపోవడం గమనార్హం. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన భద్రాద్రి జట్టు బౌలర్లలో సుదీర్‌కుమార్ 3, రాజ్‌కుమార్, అజయ్‌యాదవ్ రెండేసి వికెట్లు తీయగా, సాయి వంశి, నందురెడ్డి చెరో వికెట్‌ను తీసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంబించిన భద్రాద్రి జట్టు ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 6 ఓవర్లలో 80పరుగులు సాధించి పదివికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టుపై విజయాన్ని సాధించింది. జట్టులో ఓపెనర్లు సాయికుమార్ 19 బంతుల్లో సిక్సర్, తొమ్మిది ఫోర్లతో 44 పరుగులు నమోదు చేయగా, డేవిడ్ రిచర్డ్స్ 17బంతుల్లో రెండు సిక్సర్లు 5 ఫోర్లతో 34 పరుగులు సాధించారు.

### ఎనిమిది వికెట్ల తేడాతో ఖమ్మం జట్టు విజయం

మధ్యాహ్నం ఖమ్మం, సూర్యాపేట జిల్లా జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో టాస్‌గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన సూర్యాపేట జట్టు నిర్ణీత 20 ఓవర్లలో పదివికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. జట్టులో సత్యప్రణవ్ 42 బంతుల్లో 31 పరుగులు చేయగా, అనీల్ 23, నిహాంత్‌రెడ్డి 11, అనుదీప్ 10 పరుగులు సాధించారు. ఖమ్మంజట్టులో రాజశేఖర్ 3, అభిలాష్, హరీష్ రెండేసి వికెట్లు తీయగా, సతీష్, అఖిల్ చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఖమ్మంజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 17.2 ఓవర్లలోనే రెండు వికెట్లను కోల్పోయి 123 పరుగులు చేసింది. జట్టులో టీవీఎస్.నారాయణతేజ 52 బంతుల్లో మూడు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లతో 74 పరుగుల టాప్‌స్కోర్ చేసి నాటౌట్‌గా నిలువగా, శ్రీనివాసరావు 30, ఎండీఆసిఫ్ 8, సతీష్ 5పరుగులతో సహకరించారు. ప్రత్యర్థి జట్టులో నిహాంత్‌రెడ్డి, శివుడు చెరో వికెట్‌ను తీశారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్

## మైనారిటీలను మోసగిస్తున్న కేసీఆర్

**ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే:** ముస్లిం మైనారిటీలను ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలతో మోసగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మైనారిటీ విభాగం ఛైర్మన్ ఫక్రుద్దీన్ విమర్శించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా మైనారిటీ విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బ్యాంకు కాన్సెంట్ లెటర్లతో నిమిత్తం లేకుండా రుణాలు ఇస్తామని చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. అంకెల గారడీతో కాలం గడుపుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందన్నారు. ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కోరారు. జిల్లా మైనారిటీ విభాగం పనితీరును ఆయన ప్రశంసించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అయితం సత్యం మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేశాయని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్త 2019 ఎన్నికలలో పార్టీ విజయం కోసం పనిచేయాలని సత్యం పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా మైనారిటీ ఛైర్మన్ తాజుద్దీన్, రాష్ట్ర కన్వీనర్ ఫజల్, నగర ఛైర్మన్ ఇసాక్, నాయకులు చోటేబాబా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ ఛైర్మన్ ఫక్రుద్దీన్

## తెదేపా శిక్షణ తరగతులకు హాజరైన ఉమ్మడి జిల్లా నాయకులు

**ఖానాపురం హవేలి, కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఈనెల 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ తరగతులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 14మంది నాయకులు హాజరయ్యారు. పినపాక నియోజకవర్గం నుంచి తాళ్లూరి జగదీశ్వరరావు, దుర్గాల వెంకటేశ్వర్లు, ఇల్లెందు నియోజకవర్గం నుంచి పుచ్చకాయల సత్యనారాయణ, పిడమర్తి రమేష్, పులిచింతల వీరారెడ్డి, గంగుల సత్యనారాయణ, బాణోత్ రాజేష్, ముద్రగడ వంశీ, మధిర నియోజకవర్గం నుంచి వీరమాచినేని శ్రీనివాసరావు, సత్తు వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గం నుంచి యల్లంకి కృష్ణయ్య, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి రావి రాంబాబు, గుగులోత్ కృష్ణ, దారా కరుణాకర్‌లు పాల్గొన్నారు.

## రామాలయంలో అధ్యయనోత్సవాలు

**పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** పాల్వంచ పట్టణ పరిధిలోని రామాలయ భజన మందిరంలో అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఆలయ అర్చకుడు ఆనంద్‌కుమార్‌చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొళక్కం, దివ్యప్రబంధ పారాయణం, సేవాకాలమ్, అనంతరం నమ్మాళ్వార్ పూజ కార్యక్రమాలు జరిపారు.

## 'పాసీలను ఎస్సీలుగా గుర్తించాలి'

**కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** పాసీ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని గురువారం 'ఆల్ ఇండియా పాసీ సమాజ్' రాష్ట్ర కార్యదర్శి బాలాప్రసాద్ పాసీ, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ పాసీ, ఉపాధ్యక్షుడు హీరాలాల్ కలెక్టర్ రాజీవ్‌గాంధీని కలసి వినతిపత్రం అందించారు. 120 ఏళ్ల క్రితం ఉత్తర భారతదేశం నుంచి పాసీ కులస్థులను సింగరేణి సంస్థకి చెందిన బొగ్గు గనుల్లో పనిచేసేందుకు తీసుకొచ్చారని తెలిపారు. శతాబ్దంపాటు సింగరేణి సంస్థకు సేవలు అందించి, ఈ ప్రాంతం ప్రజలతో మమేకమై ఉంటూ ఇక్కడి అభివృద్ధికి కృషి చేస్తున్న నేటికీ సరైన గుర్తింపు లేదన్నారు. ప్రభుత్వం ఎస్సీలుగా గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో పాసీ సంంఘం నాయకులు విజయ్‌కుమార్ పాసీ, పప్పు, శుక్లాల్ తదితరులున్నారు.

# BANK EXAMS
## REASONING

After the introduction of prelims and mains, the regular models in the above said scoring topics were shifted to prelims. Very few questions, that too new and different questions from these topics were given in the mains. Thus making it very difficult for the students to score in this reasoning section. Today, let us discuss about the latest changes in the reasoning section.

*In the last few years reasoning section has seen major changes. The difficulty level in reasoning section has tremendously increased, and it has been increasing year on year by introducing new models. Earlier this section used to be considered as the scoring area where in students could easily score around 20 questions from these topics which were regular feature in the paper. (Coded inequalities (5), Coding decoding (5), Input and output (5), Syllogisms (5)).*

ప్రతిభ

# 'yap lap map' would mean...?

### CODED INEQUALITIES

**(Old Pattern):**

**Model-I:**

Some statements given followed by two or three conclusions. For example:

**1.** Statement: E > A = B ≥ C ≤ H > N

**Conclusions:** I. E > N  II. C < E

**Solution:**

As two opposite symbols are there between E and N, no relation can be established between E and N. So, I does not follow. From the statements as E > C is true, obviously C < E also follows. So, only conclusion II follows.

**Model-II:**

In this model, the meanings for the symbols will be given. First we should convert the symbols according to their meanings and then start solving the questions.

**For example:**

A@B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A # B means 'A is neither greater nor smaller than B'

A $ B means 'A is not smaller than B'

A © B means 'A is neither smaller nor equal to B'

**1. Statements:** E$V, K#V, K©P, W@P, W#X

**Conclusions:** (i) X ★ V  (ii) W # K

**Solution:**

Here @ stands for ≤, ★ stands for <, # stands for =, $ stands for ≥, © stands for >.

**Statements:** E ≥ V, K = V, K > P, W ≤ P, W = X.

**Conclusions:** (i) X < V  (ii) W = K

By combining the above statements, we get

E ≥ V = K > P ≥ W = X

From this as V > X follows ⇒ X < V also follows

As K > W follows W = K does not follow.

### New Pattern

Now let us discuss in detail about the new patterns in this topic. The major differences between the old pattern and new pattern is that in the old pattern we used to have a set of 5 questions but where as in the new pattern each question is of a different type and that to at the most only 2 or 3 questions used to be given.

**For example:**

**1.** Which of the following elements replace the question marks in that order in the given expressions to make the expressions A ≤ B and B > C definitely true?

? ≤ ? = ? < ? ≥ ? ≥ ?

1) D, A, C, E, B, F  2) F, B, E, C, A, D

3) C, D, E, B, F, A  4) D, C, B, E, A, F

5) D, C, E, F, B, A

**Solution:**

For these type of questions students should always go through each choice, making it time consuming.





Writer:
G.Shashi Kumar
Subject Expert

From Choice (1) A ≤ B is false as there are two opposite symbols between A and B it cannot be the answer.

Choice (2) if false, as two opposite symbols are there, no relation can be established.

Choice (3), C ≤ D = E < B ≥ F ≥ A, from this A ≤ B as well as B > C both follow.

*Ans: Choice (3)*

**2.** Which of the following symbols replace the question marks in that order in the given expressions to make expressions K < V and Z ≥ S definitely true?

U ? W ? S ? K ? Z ? V

1) >, ≥, =, <, ≤  2) ≤, <, =, ≥, <

3) ≥, >, =, ≤, <  4) <, ≤, =, ≥, <

5) =, ≤, <, ≥, >

**Solution:**

From Choice (1), K < V is true but Z ≥ S is false.

From Choice (2) no relation can be established between K and V

From Choice (3), both the conclusions K < V and Z ≥ S are true.

*Ans: Choice (3)*

**3.** Which of the following set of symbols should replace the question marks in that order in the given expression in order to make the expressions X > S and A ≤ X are definitely false?

"T ≥ S ? V ≥ X; S = L ≤ D ? A"

1) >, =  2) ≥, >  3) <, ≥

4) ≥, =  5) None

**Solution:**

From Choice (1), we have

T ≥ S > V ≥ X, S = L ≤ D = A

Combining the two statements

X ≤ V < S = L ≤ D = A

From this both the conclusions X > S and A ≤ X are definitely false.

*Ans: Choice (1)*

### Set - 1

This model is a combination of model-II of the old pattern and model-I of new pattern.

**For example:**

A @ B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A $ B means 'A is neither smaller than nor equal to B'

A % B means 'A is not smaller than B'

A # B means 'A is neither greater than nor smaller than B'

**1.** Which symbol should come in place of question mark (?) in the given expression so as to make the conclusion D ★ O definitely true?

N $ O % M ? P % D ★ Q

1) #  2) %  3) $  4) ★  5) @

**Solution:**

In this @ means ≤, ★ means <, $ means >, % means ≥ and # means =



First one should convert the statements according to the information given,

N ≥ O ≥ M ? P ≥ D < Q

D ★ O means D < O, in order to make D < O true the symbol that has to be replaced is $.

*Ans: Choice (3)*

**2.** In which of the following statements both the conclusions A $ D and F @ B definitely false?

1) B % M # F ⋆ A $ Q # D

2) D $ F # A $ L # K % B

3) M $ F @ D @ B # K ⋆ A

4) D % Q $ F # A @ B @ T

5) None of these

**Solution:**

The conclusions A > D and F ≤ B should be definitely false.

From (1), we have A > D is true. So (1) cannot be the answer.

From (2), we have A < D and F > B, hence the conclusions A > D and F ≤ B definitely false.

*Ans: Choice (2)*

### CODING & DECODING

**(Old Pattern):**

In this topic one can witness huge variation from one exam to the next examination. Some surprise element is being introduced every time, let us have a glance through these changes.

Earlier this model used to be a regular feature in the bank exams where the students can rely upon this model for five marks.

**For example:**

According to a certain code,

| | Sentences | Codes |
|---|---|---|
| 1 | focus on your goal | lap tap cap gap |
| 2 | successful people have goal | sap pap lap zap |
| 3 | people depends on happiness | gap sap yap map |
| 4 | your happiness have memories | pap nap tap yap |

**1.** 'Focus have memories' would be written as

1) sap pap tap  2) cap lap yap

3) pap map cap  4) map zap nap

5) pap nap cap

**Solution:**

Comparing (1) & (2), the code for 'goal' is 'lap'. From (1) & (3), the code for 'on' is 'gap'. From (1) & (4) the code for 'your' is 'tap'. From (1) the code for 'focus' is 'cap'.

Similarly, we can find the codes for the other words. The codes for the remaining words is as follows: people-sap, have-pap, successful-zap, happiness-yap, depends-map, memories-nap.

The code for 'Focus have memories' is 'cap pap nap'.

*Ans: Choice (5)*

**2.** 'yap lap map' would mean

1) happiness on goal

2) people goal happiness

3) successful depends focus

4) goal depends happiness

5) None of these

**Solution:**

'yap lap map' is the code for 'happiness goal depends'.

*Ans: Choice (4)*

**Condition based:**

This model is frequently given in clerical examinations.

In this some elements will be given in row-I, and their corresponding codes in row-II.

Below this table some conditions will be given followed by questions.

Study the following information carefully and answer the questions given below it.

Digits in the numbers are to be coded as follows:

| Digit | 4 | 7 | 1 | 8 | 2 | 6 | 0 | 9 | 3 | 5 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Code | W | R | Q | M | D | U | K | E | Z | I |

Following conditions are to be observed:

(i) If the first digit is even and the last digit is odd-prime, they are to be coded as # and © respectively.

(ii) If the first digit is odd and the last digit is zero, then they are coded as & and @.

(iii) If '0' is preceeded by even and followed by prime then '0' is coded as ★ and the codes of first and last digits in the number will interchange.

(iv) If '0' is preceeded by odd (non-prime) and followed by even (non-prime) then '0' is coded as '$' and the codes of first and last digits in the number will interchange.

**Note:**

★ 0 (Zero) is not considered as either even or odd.

★ If no condition is being followed then the codes for the digits are according to the given table.

**1.** 20375826

1) #KZRIMD©  2) U★ZRIMDD

3) UKZRIMDD  4) D★ZRIMDU  5) None

**Solution:**

This satisfies condition (iii), hence the code for 20375826 is U★ZRIMDD.

*Ans: Choice (2)*

**2.** 35724910

1) ZIRDWEQ&  2) @IRDWEQ&

3) &IRDWEQ@  4) &IRDWEQK  5) None

**Solution:**

This satisfies condition (ii), hence the code for 35724910 is &IRDWEQ@.

*Ans: Choice (3)*

*(To be continued...)*

# టీఆర్‌టీ-2017

## సోషల్ (చరిత్ర)

# ప్రతిభ

★ సిక్కు జాతి రాజ్య స్థాపకుడు?
1) రంజిత్ సింగ్ 2) అర్జున్ సింగ్
3) గోవింద్ సింగ్ 4) గురునానక్ **జవాబు: 4**

★ జహంగీర్ చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న సిక్కు మత గురువు?
1) తేజ్‌బహదూర్ 2) అర్జున్‌సింగ్
3) గోవిందసింగ్ 4) గురు అంగద్ **జవాబు: 2**

# అక్బర్ రూపొందించిన సైనిక విధానం ఏది..?



రచయిత
**అమరనేని కృష్ణ**
**విషయ నిపుణులు**

### మొగలుల సామ్రాజ్యం

**1.** బాబర్‌కి, రాణా సంగ్రామ్‌సింగ్‌కి మధ్య జరిగిన యుద్ధం ఏది?
1) చందేరి యుద్ధం 2) మొదటి పానిపట్టు యుద్ధం
3) గోగ్రా యుద్ధం 4) కాణ్వా యుద్ధం

**2.** భారతదేశంలో మొగలుల పరిపాలనా కాలాన్ని గుర్తించండి.
1) క్రీ.శ. 1526-1857 2) క్రీ.శ. 1206-1526
3) క్రీ.శ. 1605- 1857 4) క్రీ.శ. 1556-1707

**3.** బాబర్‌ను భారతదేశంపై దండయాత్రకు ఆహ్వానించిన పంజాబ్ గవర్నర్ ఎవరు?
1) ఇబ్రహీం లోడి 2) మహ్మద్ లోడి
3) నస్రత్ షా 4) దౌలత్‌ఖాన్ లోడి

**4.** బాబరునామా గ్రంథ రచయిత?
1) అబ్దుల్ హమీద్ లహరీ 2) గుల్‌బదన్ బేగం
3) అబుల్ ఫజల్ 4) బాబర్

**5.** బాబర్ భారతదేశంపైకి దండెత్తేనాటికి దక్షిణ భారతదేశంలో ఉన్న గొప్ప హిందూ రాజ్యం ఏది?
1) విజయనగరం 2) యాదవ
3) రెడ్డి రాజులు 4) కాకతీయులు

**6.** హుమయూన్ జీవిత చరిత్ర 'హుమయూన్ నామా' గ్రంథ రచయిత?
1) అబ్దుల్ హమీద్ లహరీ 2) హుమయూన్
3) అబుల్ ఫజల్ 4) గుల్‌బదన్ బేగం

**7.** క్రీ.శ. 1526 లో బాబర్ భారతదేశంపై దండెత్తేనాటికి ఢిల్లీని పరిపాలిస్తున్న సుల్తాన్?
1) ఇబ్రహీంలోడి 2) మహ్మద్ లోడి
3) సికిందర్ లోడి 4) దౌలత్‌ఖాన్ లోడి

**8.** బాబర్ ఏ యుద్ధాన్ని జీహద్‌గా ప్రకటించాడు?
1) కాణ్వా యుద్ధం 2) మొదటి పానిపట్టు యుద్ధం
3) గోగ్రా యుద్ధం 4) చందేరి యుద్ధం

**9.** షేర్షా అసలు పేరు?
1) ఫరీద్ 2) జహీరుద్దీన్
3) ఘాజీమాలిక్ 4) జునాఖాన్

**10.** హుమాయూన్ అంటే..?
1) అదృష్టవంతుడు 2) పండితుడు
3) తెలివైనవాడు 4) గొప్పవీరుడు

**11.** క్రీ.శ. 1564 లో అక్బర్‌తో వీరోచితంగా పోరాటంచేసి మరణించిన గోండ్వానా పాలకురాలు?
1) రాణి దుర్గావతి 2) రాణి పద్మిని
3) రాణి భాయి 4) చాంద్‌బీబీ

**12.** షేర్షా క్రీ.శ 1545 లో ఏ దుర్గాన్ని ముట్టడించే యత్నంలో మరణించాడు?
1) కలింజర్ 2) గ్వాలియర్ 3) చౌసా 4) కనౌజ్

**13.** షేర్షా తన రాజ్యాన్ని ఏ విధంగా విభజించాడు?
1) సర్కార్ 2) ఇక్తా 3) మిజిలీ 4) సుభా

**14.** రైతులకు పట్టాలిచ్చి, రైతుల నుంచి కబూలియత్‌లను స్వీకరించిన ముస్లిం పాలకుడు?
1) హుమయూన్ 2) బాబర్
3) అక్బర్ 4) షేర్షా

**15.** పరిపాలనలో అక్బర్‌కి మార్గదర్శకుడు?
1) షేర్షా 2) బాబర్
3) రాజా బీర్బల్ 4) సముద్రగుప్తుడు

**16.** ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేసే ఆచారాన్ని ప్రవేశపెట్టింది?
1) షేర్షా 2) అల్లావుద్దీన్ ఖిల్జీ
3) మహ్మద్ బీన్ తుగ్లక్ 4) అక్బర్

**17.** భారతదేశంలో పౌర పరిపాలన విధానానికి రూపకల్పన చేసిన తొలి భారతీయ ముస్లిం చక్రవర్తి?
1) అక్బర్ 2) బాబర్
3) షేర్షా 4) షాజహాన్

**18.** అక్బర్ తన తండ్రి హుమయూన్ మరణించే నాటికి ఏ ప్రాంతానికి గవర్నర్‌గా ఉన్నాడు?
1) పంజాబ్ 2) సింధు 3) దక్కన్ 4) బెంగాల్

**19.** అక్బర్ ఎవరిని 'ఖాన్ బాబా' అని ప్రేమగా పిలిచేవాడు?
1) షేర్ సలీం చిస్థి 2) సలీం
3) రాజా బీర్బల్ 4) భైరాంఖాన్

**20.** షేర్షా ప్రవేశపెట్టిన భూమిశిస్తు విధానం ఏది?
1) రైత్వారీ విధానం 2) జబ్తి పద్ధతి
3) మహల్వారీ విధానం 4) జమీందారీ విధానం

**21.** అక్బర్ కాలం నాటి సంగీత విద్వాంసుల్లో "మేఘ్ మల్హార్"లో గానం చేసి వర్షాలు కురిపించగల వ్యక్తి?
1) తాన్‌సేన్ 2) బాజ్ బహదూర్
3) అబ్దుల్ హమీద్ లహరీ 4) అమీర్ ఖుస్రూ

**22.** అక్బర్ రూపొందించిన సైనిక విధానం?
1) మున్సబ్‌దారీ 2) సుబేదారీ
3) జబ్తి పద్ధతి 4) బందోబస్తు విధానం

**23.** హిందువులపై జిజియా పన్నును అక్బర్ తొలగించిన సంవత్సరం?
1) 1563 2) 1562 3) 1564 4) 1565

**24.** అక్బర్ క్రీ.శ. 1582 లో దీన్ - ఇ - ఇలాహి అనే మతాన్ని స్థాపించి, దానికి ప్రధానాచార్యుడిగా ఎవరిని నియమించాడు?
1) అబుల్ ఫజల్ 2) అబ్దుల్ లతీఫ్
3) షేక్ ముబారక్ 4) అబుల్ ఫైజీ

**25.** రసగంగాధరం అనే అలంకార శాస్త్రాన్ని, గంగానదిని స్తుతిస్తూ గంగాలహరి అనే మహాకావ్యాన్ని రచించింది ఎవరు?
1) కవి ఆచార్య సరస్వతి 2) దారాషుకోవ్
3) సుందర దాస్ 4) జగన్నాథ పండితుడు

**26.** క్రీ.శ. 1611 లో మెహరున్నీసాను వివాహమాడిన జహంగీర్ ఆమెకు ఏమని పేరు పెట్టాడు?
1) నూర్జహాన్ 2) జోదాభాయ్
3) మన్‌బాయి 4) ముంతాజ్ బేగం

**27.** షాజహాన్ పరిపాలన కాలాన్ని స్వర్ణయుగంగా వర్ణించిన చరిత్రకారులు?
1) ఎలిఫెన్‌స్టన్ 2) హంటర్
3) 1, 2 4) వి.ఎ.స్మిత్

**28.** సింహాసనం అధిష్టించిన వెంటనే ప్రజలకు ఉపయోగపడే 12 రాజాజ్ఞలు జారీచేసి, ఆగ్రాలో న్యాయగంటను ఏర్పాటు చేసింది?
1) అక్బర్ 2) హుమయూన్
3) జహంగీర్ 4) షాజహాన్

**29.** షాజహాన్ కుమారుల్లో పారశీక, సంస్కృత భాషల్లో గొప్ప పాండిత్యం ఉన్న వ్యక్తి?
1) మురాద్ 2) దారాషుకోవ్
3) ఔరంగజేబ్ 4) షుజా

**30.** పరిశుద్ధ శాసనాలు జారీచేసిన నాణేలపై ఖలీమా ముద్రించి, జరోకా దర్శనాలను రద్దు చేసిన మొగల్ చక్రవర్తి?
1) బాబర్ 2) అక్బర్
3) ఔరంగజేబ్ 4) హుమయూన్

**31.** ప్రస్తుతం పాత ఢిల్లీగా పేర్కొంటున్న నగరాన్ని నిర్మించింది?
1) అక్బర్ 2) బాబర్
3) ఔరంగజేబ్ 4) షాజహాన్

**32.** విగ్రహారాధనకు ఆలవాలమైన భారతదేశాన్ని ముస్లిం రాజ్యంగా మార్చడమే తన విధానమని ప్రకటించిన మొగల్ చక్రవర్తి?
1) జహంగీర్ 2) బాబర్
3) హుమయూన్ 4) ఔరంగజేబ్

**33.** షాజహాన్ ఆస్థాన చరిత్రకారుడు?
1) ఇనాయత్ ఖాన్ 2) అబ్దుల్ హమీద్ లహరీ
3) 1, 2 4) అబుల్ హసన్



**34.** షాజహాన్ 22 సంవత్సరాలు శ్రమించి తాజ్‌మహల్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు. దీని ప్రధాన శిల్పి?
1) ఉస్తాద్ అహ్మద్
2) ఉస్తాద్ ఉమర్
3) ఉస్తాద్ రహమాన్ 4) ఉస్తాద్ షఫీ

**35.** ఔరంగజేబ్ సమాధి ఎక్కడ ఉంది?
1) ఔరంగాబాద్ 2) దౌలతాబాద్
3) కల్యాణి 4) బీజాపూర్

**36.** అక్బర్ సంరక్షకుడు ఎవరు?
1) దాదాజీ కొండదేవ్ 2) మాలిక్ కాఫర్
3) భైరాంఖాన్ 4) అబుల్ ఫజల్

**37.** ఔరంగజేబ్ మత విధానానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రాజపుత్ర నాయకుడు?
1) దుర్గాదాసు 2) రాణా ప్రతాప్
3) రాజా జైసింగ్ 4) రాణా అమర్ సింగ్

**38.** శివాజీతో ఔరంగజేబ్ సేనాని రాజా జైసింగ్ చేసుకున్న ఒప్పందం?
1) పూనా ఒప్పందం 2) ఆగ్రా ఒప్పందం
3) సూరత్ సంధి 4) పురంధర్ సంధి

**39.** ఔరంగజేబ్ ఏ సిక్కు మత గురువును చంపించాడు?
1) గురుతేజ్ బహదూర్ 2) గురు అర్జున్‌సింగ్
3) గురునానక్ 4) గురుగోవింద్ సింగ్

**40.** షాజహాన్ అసలు పేరు?
1) ఖుర్రం 2) సలీం 3) ఫరీద్ 4) అలంగీర్

**41.** ఔరంగజేబ్‌కి వ్యతిరేకంగా పోరాడిన మహారాష్ట్రులకు నాయకత్వం వహించింది?
1) దుర్గాదాసు 2) శివాజీ
3) గీతాదాసు 4) రామదాసు

**42.** మొగలుల చరిత్రలో ఎవరి పాలనా కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు?
1) అక్బర్ కాలం 2) షాజహాన్ కాలం
3) హుమయూన్ కాలం 4) ఔరంగజేబ్ కాలం

**43.** మొగల్ చక్రవర్తుల వరుసక్రమం?
1) బాబర్, హుమయూన్, అక్బర్, జహంగీర్
2) బాబర్, అక్బర్, హుమయూన్, జహంగీర్,
3) బాబర్, హుమయూన్, జహంగీర్, అక్బర్
4) అక్బర్, బాబర్, హుమయూన్, జహంగీర్

**44.** ప్రజల నైతిక జీవనాన్ని గమనించడానికి 'ముతావాసిబ్' అనే అధికారులను నియమించింది ఎవరు?
1) షాజహాన్ 2) అక్బర్
3) ఔరంగజేబ్ 4) షేర్షా

**45.** భూమి శిస్తు విధాన రూపకల్పనలో అక్బర్‌కు సహాయపడింది?
1) రాజా మాన్‌సింగ్ 2) రాజా జైసింగ్
3) రాజా అమర్‌సింగ్ 4) రాజా తోడర్‌మల్

**46.** ఫతేపూర్ సిక్రీలో సర్వమతాల వారి కోసం నిర్మించిన ప్రార్థనా మందిరం ఏది?
1) పంచమహల్ 2) జోద్‌భాయ్ భవనం
3) బులంద్ దర్వాజా 4) ఇబాదత్ ఖానా

**47.** ఢిల్లీలో పురానా ఖిల్లా నిర్మాత?
1) హుమయూన్ 2) షేర్షా
3) ఔరంగజేబ్ 4) షాజహాన్

**48.** గ్రాండ్ ట్రంక్ రోడ్లను నిర్మించింది?
1) అక్బర్ 2) షేర్షా 3) ఔరంగజేబ్ 4) బాబర్

**49.** షేర్షా సమాధి ఎక్కడ ఉంది?
1) ఢిల్లీ 2) ఫతేపూర్ సిక్రీ
3) లాహోర్ 4) సస్రాం

**50.** షాజహాన్ ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థం నిర్మించిన తాజ్‌మహల్ ఏ నది ఒడ్డున ఉంది?
1) యుమునా 2) గంగా 3) సోన్ 4) సరస్వతి

**51.** మొగలుల కాలం నాటి పరిశ్రమ కేంద్రాల్లో సరైనవి గుర్తించండి.
1) రాగి పరిశ్రమ - ఢిల్లీ
2) ఇత్తడి పరిశ్రమ - బెనారస్
3) వస్త్ర పరిశ్రమ - ఢాకా, అహ్మదాబాద్
4) పైవన్నీ

**52.** మొగల్ కట్టడాల లక్షణాలు?
1) గుండ్రటి డోమ్‌లు, స్తంభాలు
2) ఇస్లాం మతస్థుల వాస్తు - హిందువుల శిల్పకళ
3) కట్టడం ముందు ఖాళీ స్థలాలు 4) పైవన్నీ

**53.** అక్బర్ హాల్దీఘాట్ యుద్ధంలో ఎవరిని ఓడించాడు?
1) రాణా సంగ్రామసింగ్ 2) రాణా ప్రతాప్‌సింగ్
3) రాణా అమర్‌సింగ్ 4) రాణా ఉదయ్‌సింగ్

**54.** నిరక్షరాస్యుడైన మొగల్ చక్రవర్తి?
1) అక్బర్ 2) బాబర్
3) ఔరంగజేబ్ 4) జహంగీర్

**55.** బాబర్‌కు సమకాలీనుడైన విజయనగర రాజు?
1) రెండో దేవరాయలు 2) మొదటి దేవరాయలు
3) అళియ రామరాయలు 4) శ్రీకృష్ణ దేవరాయలు

**56.** శివాజీ రాజ్యానికి ఏమని పేరు?
1) స్వరాజ్యం 2) మహారాష్ట్ర
3) మైదానం 4) మహారాజ్యం

**57.** జహంగీర్ అసలు పేరు?
1) ఫరీద్ 2) ఖుర్రం 3) ఖుస్రూ 4) సలీం

**58.** ఆగ్రా కోటలో ధర్మగంటను ఏర్పాటు చేసిన మొగల్ రాజు?
1) జహంగీర్ 2) షాజహాన్ 3) అక్బర్ 4) బాబర్

**59.** శివాజీ సమకాలీకుడైన మొగల్ చక్రవర్తి ఎవరు?
1) షాజహాన్ 2) అక్బర్
3) జహంగీర్ 4) ఔరంగజేబ్

**60.** శివాజీ ఏ దుర్గంపై తొలి దండయాత్ర చేశాడు?
1) తోరూ 2) పురంధర్ 3) కొంకణ 4) చకన్

**61.** శివాజీ మంత్రి మండలి పేరు?
1) అష్ట ప్రధానులు 2) అష్ట దిగ్గజాలు
3) అష్ట నాయకులు 4) అష్ట దివానులు

**62.** శివాజీ క్రీ.శ. 1674 లో ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకున్న ప్రదేశం?
1) రాయగఢ్ 2) పురంధర్
3) సింహగఢ్ 4) ప్రతాప్‌గఢ్

**63.** మరాఠీ భాష ద్వారా మహారాష్ట్రులను ఏకం చేసిన వారు?
1) తుకారాం, వామన్ పండిట్ 2) ఏక్‌నాథ్
3) నామదేవ్, సమర్థ రామదాసు 4) పై వారందరూ

### జవాబులు

| | | | | |
|---|---|---|---|---|
| 1-4 | 14-4 | 27-3 | 40-1 | 53-2 |
| 2-1 | 15-1 | 28-3 | 41-2 | 54-1 |
| 3-4 | 16-1 | 29-2 | 42-2 | 55-4 |
| 4-4 | 17-3 | 30-3 | 43-1 | 56-1 |
| 5-1 | 18-1 | 31-4 | 44-3 | 57-4 |
| 6-4 | 19-4 | 32-4 | 45-4 | 58-1 |
| 7-1 | 20-1 | 33-3 | 46-4 | 59-4 |
| 8-1 | 21-1 | 34-1 | 47-2 | 60-1 |
| 9-1 | 22-1 | 35-2 | 48-2 | 61-1 |
| 10-1 | 23-3 | 36-3 | 49-4 | 62-1 |
| 11-1 | 24-1 | 37-1 | 50-1 | 63-4 |
| 12-1 | 25-4 | 38-4 | 51-4 | |
| 13-1 | 26-1 | 39-1 | 52-4 | |

# ఆర్టీసీలో 'మేడారం' సన్నాహాలు

**❖ నేడు రీజియన్‌లో.. రేపు వరంగల్‌లో ఈడీ అధికారుల సమీక్ష**

**కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** వన దేవతల మహోత్సవం రాకతో ఆర్టీసీలో హడావిడి పెరిగిపోతోంది. ఈ నెలాఖరున ఆరంభమయ్యే సమ్మక్క-సారలమ్మల జాతర ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే సంస్కృతి ప్రపంచమంతా తెలిసిందే. ఇందులో తమ వంతు భాగస్వామ్యాన్ని అందించే క్రమంలో ఆర్టీసీ అధికారులు తలమునకలవుతున్నారు. రోజులు సమీపిస్తుండటంతో ముందస్తుగానే ఆర్టీసీ బస్సుల కేటాయింపులు, అందుకు సంబంధించిన రూట్‌లు, జాతర వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లకు సంబంధించి పక్కా ప్రణాళికలు రచించేందుకు సమాయత్తమవుతున్నారు. పూర్వ ఖమ్మం జిల్లా భాగస్వామ్యం ఎలా ఉండాలనే అంశాలపై నేడు(శుక్రవారం) ఖమ్మం రీజియన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, మధిర, సత్తుపల్లి, ఖమ్మం డిపోల అధికారులు, రెండు డివిజనల్ మేనేజర్లతో మేడారం జాతర సందర్భంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను చర్చించనున్నారు. గత జాతర సందర్భంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అప్పుడు చోటుచేసుకున్న లోపాలు, వాటిని సరిదిద్దుకుని ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశాలను ప్రస్తావించడమే కాకుండా ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశాలను, అందుకు తగినట్లుగా ఆర్టీసీ తరఫున తీసుకు రావాల్సిన మార్పులపై సుదీర్ఘంగా చర్చ జరిగే అవకాశాలున్నాయి.

**రేపు వరంగల్‌లో..:** మేడారం జాతర సందర్భంగా ప్రణాళికలు రచించేందుకు కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్ అర్బన్, రూరల్ రీజియన్ అధికారులతో శనివారం వరంగల్‌లో సమీక్షా సమావేశం ఏర్పాటు కానుంది. అన్ని రీజియన్‌ల నుంచి రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు ఈ సమావేశంలో హాజరు కాబోతున్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజనీరింగ్) ఎం.రవీందర్‌లు అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. కేవలం 27 రోజులు మాత్రమే సమయం ఉన్న క్రమంలో ప్రయాణికులకు సేవ చేసే నేపథ్యంలో ఆర్టీసీ తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలతోపాటు ఆపరేటింగ్ విధానాలపై సమగ్రంగా చర్చించనున్నారు. ప్రధానంగా జాతర ప్రాంగణ సమీపంలో ఏ జిల్లాకు సంబంధించి ఎన్ని బస్సులు చేరుకుంటాయి, వాటిని ఎక్కడెక్కడ పార్కింగ్ చేయాల్సి ఉంటుంది, విధులకు హాజరయ్యే డ్రైవర్ల సంక్షేమానికి చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్మికులకు విశ్రాంతి బసకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, బస్సులను ఎలా ఆపరేట్ చేయాలనే ప్రధాన అంశాలపై ఆర్టీసీ జోన్ అధికారులు సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సమీక్షల అనంతరం మేడారం జాతరకు సంబంధించి ఒక ముఖచిత్రాన్ని ఆర్టీసీ అధికారులు నిర్ణయించనున్నారు. అనంతరం జిల్లాల వారీగా డిపోలలో సంస్థ పరంగా చేపట్టాల్సిన అంశాలను అమలు చేయనున్నారు.

# గిరిజనుల జోలికి వస్తే సహించం: తమ్మినేని



సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

**భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే:** జిల్లాలో గిరిజనుల జోలికి వస్తే సంహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. సీపీఎం జిల్లా ప్రథమ మహాసభల్లో భాగంగా గురువారం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమయిందని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్ని వ్యర్థమేనని అన్నారు. గిరిజనుల హక్కులను కాలరాసి వారిని అడవి నుంచి తరిమివేసే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. అటవీశాఖ అధికారులు గిరిజన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి, చిత్ర హంసలకు గురి చేస్తున్నారని వాటిని విరమించుకోవాలని అన్నారు. లేని పక్షంలో గిరిజనులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తారని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఎన్నో ఆశలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి లేకపోగా ప్రభుత్వం చేస్తున్న చేష్టలతో నిరాశ మిగిలిందన్నారు. రైతులను సాయం అందక ఆత్మహత్యల పాల్పడటం తీవ్రమయిందని ఆరోపించారు. జనవరి 25న ప్రజా సంఘాలతో బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్ ఫ్రంట్ రాజకీయ పార్టీ రాష్ట్రంలో అవతరించబోతున్నట్టు వారు ప్రకటించారు. బి.వెంకట్, రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, ఎం.సాయిబాబా, బండారు రవికుమార్, హైమావతి, జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, అధ్యక్ష వర్గంగా సున్నం రాజయ్య, మర్లపాటి రేణుక, కొక్కెరపాటి పుల్లయ్య, ఎస్‌ఏ నబీ వ్యవహరించారు.

# రాష్ట్ర నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తోందా?

**● పార్లమెంటులో ఎంపీ శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం బుర్హాన్‌పురం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం నిధుల విషయంలో ఎటువంటి సాయం చేస్తోందని ఖమ్మం పార్లమెంటుసభ్యుడు పొంగులేటి శ్రీనివాసరరెడ్డి గురువారం పార్లమెంటులో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. దీనికి సంబంధిత శాఖామంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ సమాధానమిస్తూ 2016-18 ఆర్థిక సంవత్సరాల్లో తెలంగాణలో 11ప్రాజెక్టులు ప్రతిపాదించగా, ఆరు ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి క్రిషిసంచయ్ యోజన పథకం కింద 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆరు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 547.625కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు 20178-18 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, శ్రీరామ్‌సాగర్ రెండోదశకోసం ప్రతిపాదనలు సమర్పించిందన్నారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.13.24కోట్లు విడుదలచేసినట్టు తెలిపారు.

# కన్నవారిపై తనయుని వేధింపులు

**పాల్వంచ, న్యూస్‌టుడే:** కనిపెంచి, ఆస్తులు సమకూర్చి పెట్టిన తల్లిదండ్రులపైనే ఓ తనయుడు వేధింపులకు పాల్పడుతున్న ఉదంతమిది. బాధితులు సుదర్శనాచారి, స్వరాజ్యలక్ష్మిల కథనం ప్రకారం.. సుదర్శనాచారి కేటీపీఎస్‌లో పనిచేసి 2009లో ఉద్యోగ విరమణ పొందారు. గట్టాయిగూడెంలోని ఆదర్శనగర్‌లో సొంత ఇల్లు నిర్మించుకోవడంతో పాటు, తన కొడుకుకు బంగారు నగల దుకాణం పెట్టించారు. అయినా తన కొడుకు, కోడలు వారిని చూసుకోకపోవడంతోపాటు వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో గత రెండేళ్లుగా ఆ వృద్ధ దంపతులు బంధువుల ఇళ్లలోనే గడిపారు. గురువారం వారు గట్టాయిగూడెంలోని వారి సొంత ఇంటికి రాగా కొడుకు వారిని ఇంట్లోకి రానీయకుండా ఇంటికి తాళం వేసుకొని బయటకు వెళ్లిపోయాడు. దీంతో వారు సాయంత్రం వరకూ ఆ ఇంటిముందే బైఠాయించారు. సాయంత్రానికి వారి బంధువులు రంగప్రవేశం చేసి సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు.


ఇంటి ఎదుట బైఠాయించిన వృద్ధ దంపతులు

# కొత్తగూడెం ఆబ్కారీ సిబ్బందికి పురస్కారం

**కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గుడుంబా రహిత కార్యక్రమంలో చురుగ్గా పనిచేసి ఉత్తమ సేవలందించిన వారిని రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని ఆ శాఖ గుర్తించింది. వారికి ఉత్తమ జ్ఞాపికలను గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. అధికారులు ఎంపిక చేసిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇద్దరు సిబ్బంది అర్హత సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై షేక్ ముబషీర్ అహ్మద్, డీటీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సుమంత్‌ఖన్నాలు రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ (హైదరాబాద్) చేతుల మీదుగా అందుకున్నారు. వారు చేసిన కృషిని గుర్తించి ఉత్తమ ఎంపికల జాబితాలో వారిద్దరి పేర్లను నమోదు చేసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, సీఐ నాగేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



# 'సీతారామ' ముంపు ప్రాంతాలను పరిశీలించిన కేంద్ర బృందం


పోకలగూడెం బీట్‌లో అటవీ భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

**చంద్రుగొండ, ఖమ్మం నగరం, న్యూస్‌టుడే:** సీతారామా ప్రాజెక్టు కాల్వల తవ్వకానికి రాష్ట్ర ప్రభుత్వం కోరిన రిజర్వ్ ఫారెస్ట్ భూములను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అధికారులు గురువారం రెండో రోజు జిల్లాలో పరిశీలించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల్లోని అటవీ భూములను అధికారుల బృందం పరిశీలించింది. చెన్నైలోని ప్రాంతీయ కార్యాలయం వచ్చిన ఐఎఫ్ఎస్ అధికారులు డాక్టర్ ఎం.రాంగోపాల్‌రెడ్డి, డి.సత్యన్, ఆర్ శోభ (తెలంగాణ) అధికారుల బృందం సీతారామా ప్రాజెక్టుకు కావాల్సిన అటవీ భూములు, అందుకు ప్రతిగా రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖకు అప్పగించనున్న భూములను పరిశీలించారు. సీతారామా ప్రాజెక్టు కాలువల తవ్వకానికి రెండు జిల్లాల్లో 3800 ఎకరాల అటవీ భూములు కావాల్సి ఉందని నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఈమేరకు అటవీ భూములను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన చెన్నైలోని ప్రాంతీయ కార్యాలయం అధికారులు రెండు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం మూడో రోజు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ బృందం తమ నివేదికను త్వరలో కేంద్రంలోని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు అందించనుంది. ఆ నివేదిక ఆధారంగానే అనుమతులు జారీ అవుతాయి. చెన్నై అధికారుల బృందం వెంట సీతారామా ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.



# 'సీతారామ' పరిహారం కోసం కలెక్టర్‌కు వినతి

**కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల పరిధిలో సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం అందించాలని గురువారం సీపీఐ నేతల బృందం బాధితులతో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీని కలిసి వినతి పత్రం అందించారు. ఈ రెండు మండలాల్లో తొట్టిగుంపు, బెండాలపాడు గ్రామాలకు చెందిన సుమారు 80మంది ఆదివాసీ కుటుంబాలు రెండున్నర దశాబ్దాల నుంచి పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 2005 చట్టం ప్రకారం గిరిజనులకు హక్కు పత్రాలందజేయాలని కోరుతూ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు పట్టించుకోలేదని ఆరోపించారు. పట్టాలు లేని కారణంగా వీరి భూములను స్వాధీనం చేసుకొని కాల్వలు తవ్వేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న వీరి సాగు భూమి లేక, పరిహారం రాక ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున వీరి సమస్యపై దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ని కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, జిల్లా నాయకులు గార్లపాటి రామనాథం, ఊకే నారాయణ, జడ శ్రీను, సున్నం సూరిబాబు, పాటి రామారావు, కురసం రాములు, గురం సందీప్, కారం చిట్టిబాబు, అనంతరాములు, వెంకటేశ్, పెద్ద భద్రయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


భూ నిర్వాసితులకు పరిహారం అందించాలని కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ బృందం

ఇల్లెందు

## మిరపతోటను సందర్శించిన ఉద్యానశాఖాధికారి

**సీతంపేట(గార్ల), న్యూస్‌టుడే:** సీతంపేట బడితండాలో రైతులు వీర్యా, బద్యాకు చెందిన మిరుపపంటకు వచ్చిన తెగుళ్లను ఉద్యానశాఖాధికారి అనితాశ్రీ పరిశీలించారు. వీరిద్దరికి చెందిన ఎకరం 30కుంటల మిరుపపంటకు ఎండు తెగుళ్లు వచ్చినట్లు ఉద్యానశాఖాధికారి నిర్ధారించారు. ప్రారంభదశలో గుర్తించినట్లయితే తెగుళ్లను ప్రాథమిక స్థాయిలోనే నివారించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు నుంచి కొనుగోలు చేసిన విత్తనాలవల్ల కాదని హెచ్‌వో స్పష్టం చేశారు.

## నూతన కమిటీ ఎన్నిక

**బయ్యారం, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షునిగా దేవదాసు, ఉపాధ్యక్షులు దేవరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి సత్యం, కోశాధికారి యేసు రత్నం, కార్యవర్గసభ్యులుగా మోషే, పాండు, రవిబాబు, సురేశ్ సలహాదారులుగా దానియేలు, గౌరవ అధ్యక్షులుగా సుధాకర్ ఎన్నికయ్యారని తెలిపారు.

# 20 ఏళ్లుగా... 'సరస్వతి' సేవ

★ అవార్డులు, మన్ననలు సొంతం ★ అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి కృషి

**20ఏళ్లుగా అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిగా విధులను నిర్వహిస్తూ చిన్నపిల్లల ఆలనాపాలనా చూస్తూ ఆటపాటలతో విద్యాబుద్ధులను నేర్పిస్తూ పిల్లల తల్లిదండ్రుల మన్ననలను పొందుతున్నారు గార్ల పుట్టకోటబజారులోని అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు కటుకూరి సరస్వతి. అంతేకాదు... పిల్లల నుంచి గర్భిణులు, బాలింతల దాకా ప్రభుత్వపరంగా పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని వారికి అందిస్తున్నారు. అవసరమైన మేర వైద్యం విషయంలో సలహాలు, సూచనలను ఇస్తున్నారు. ఆయా లేనప్పుడు చిన్నారుల సేవల్లో నిమగ్నమవుతుంటారు. – గార్ల, న్యూస్‌టుడే**



పొందిన అవార్డులు, ప్రశంసాపత్రాలతో ...



దిల్లీలో రేణుకాచౌదరి చేతులమీదుగా...



చిన్నపిల్లలకు విద్యనేర్పుతూ..

### అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిగా..

ఆదర్శం

ఈమె ఆటపాటలతో చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందిస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు 11, బాలింతలు 10, పిల్లలు 17మంది ఉన్నారు. ఏఎన్ఎం సహకారంతో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్యసలహాలు, సూచనలను ఇప్పిస్తున్నారు. బేటీ బచావో... బేటీ పడావో భాగంగా సుకన్య సమృద్ధియోజన పథకంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు. చిన్నపిల్లల నుంచి గర్భిణులు, బాలింతలకు సేవ చేస్తుండటం తనకు మహద్భాగ్యంగా ఉందని ఆమె అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం మంజూరు చేయాలని కోరారు.

### పొందిన ప్రశంసలు, అవార్డులు

☛ 2004-05లో రాష్ట్రస్థాయి ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని ఖమ్మంలో ఆర్ జేడీ మీనాక్షి చేతులమీదుగా పొందారు.

☛ 28.02.2009న దిల్లీలోని విజ్ఞానభవన్‌లో అప్పటి కేంద్ర మంత్రి రేణుకాచౌదరి చేతుల మీదుగా జాతీయ స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డు, ప్రశంసాపత్రాన్ని తీసుకున్నారు. రూ.25వేలు నగదు పారితోషికాన్ని అందుకున్నారు.

## నాలుగో దశ 'మిషన్'కు సమాయత్తం

**ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే:** చెరువులకు, కుంటలకు జలకళతో పూర్వవైభవం తీసుకొచ్చే సంకల్పంతో ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి సంవత్సరం శతశాతం నియోజవర్గంలోని చెరువులు, కుంటలను ఎంపిక చేసి రూ.కోట్లతో పనులు చేపడుతోంది. ఇప్పటి వరకు మిషన్ కాకతీయ మొదటి విడత నుంచి మూడోదశ వరకు పనులు పూర్తికాగా, నాలుగో విడత పనులు ప్రారంభించేందుకు ఆయా మండలాల్లో నీటిపారుదల అధికారులు ప్రభుత్వానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపారు. అందులో కొన్నింటికి అనుమతులు రావడంతోపాటు నిధులు కూడా మంజూరయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇల్లెందు మండలంలో మిషన్-4లో భాగంగా మొత్తం 15చెరువులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. త్వరలో మిషన్-4 పనులను ప్రారంభించేందుకు నీటిపారుదల అధికారులు సమయాత్తం అవుతున్నారు.

## తిరుపతిరావు కమిటీని రద్దు చేయాలి

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** ప్రయివేటు విద్యాసంస్థల సర్వేకు నియమించిన తిరుపతిరావు కమిటీని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నటరాజ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తిరుపతిరావు కమిటీ పేర ప్రయివేటు విద్యాసంస్థను సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కమిటీ తూతూ మంత్రంగా ప్రయివేటు విద్యాసంస్థలపై సర్వే నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు సంవత్సరానికి 10శాతం ఫీజులు పెంచుకోవచ్చని తిరుపతిరావు కమిటీ ఆదేశాలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. తిరుపతిరావు కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు నరేందర్‌జైన్ సూచించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 29 నుంచి జనవరి 13 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తారన్నారు. గేదెలు, ఆవులకు తప్పనిసరిగా రైతులు ఈ టీకాలు వేయించాలని కోరారు. ఆర్నెల్లకోసారి ఈ టీకాలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నారని వివరించారు. ఈ టీకాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వైకల్యం శరీరానికే మేధాశక్తికి కాదు

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** వైకల్యం శరీరానికే మేధాశక్తికి కాదని టేకులపల్లి మండల అభివృద్ధి అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. టేకులపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అంధుల లిపి కర్త లూయీ బ్రెయిలీ జయంతిని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం(టీవీపీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బెయిలీ చిత్రపటానికి ఎంపీడీవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సతీశ్ మాట్లాడుతూ లూయీ జన్మదినం సందర్భంగా 100దివ్యాంగులు టీవీపీఎస్ సభ్యత్వ నమోదు చేసి గుర్తింపుకార్డులు అందించినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మేడి ప్రవీణ్‌కుమార్, సంఘం సభ్యులు బి.బాబూరావు, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.



సభ్యత్వకార్డును అందిస్తున్న ఎంపీడీవో వరప్రసాద్

## ఎరువుల కొనుగోళ్లకు 'ఆధార్' తప్పనిసరి

**గార్ల, న్యూస్‌టుడే:** వ్యవసాయదారులు ఎరువుల కొనుగోళ్లకు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సిందిగా వ్యవసాయాధికారి పి.నాగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2018 నుంచి ప్రభుత్వం తరఫున రైతులకు ప్రత్యక్షంగా ఇచ్చే రాయితీని ఈ-పాస్ యంత్రాల ద్వారా ఆధార్‌కార్డు సంఖ్యకు అనుసంధానం చేస్తున్నట్లు తద్వారా ఎరువుల విక్రయాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ద్వారా 24గంటలపాటు విద్యుత్తు సరఫరాను అందజేస్తున్న శుభతరుణంలో రైతులు ఆటో స్టార్టర్లను తొలగించి, విద్యుత్తుమోటారు వినియోగానికి అవసరమయ్యే రీతిన నిలుపుదల, అవసరానికి తగిన స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో 50 శాతం రాయితీపై ముడిజింకు సల్ఫేట్ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. 10 కిలోల సంచుల రూపంలో రాయితీ పోనూ రైతులు రూ.410 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## డ్రైవర్‌పై దాడి చేసిన యజమానిపై చర్య తీసుకోవాలి

**బయ్యారం, న్యూస్‌టుడే:** ట్రాక్టర్ డ్రైవర్ ముస్తాఫాపై దాడి చేసిన యజమాని వి.సురేశ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తపేటలో ఇఫ్టూ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యూనియన్ నాయకులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బి.సూర్యం మాట్లాడుతూ డ్రైవర్ ముస్తాఫాపై దాడి చేసి గాయపరిచిన ట్రాక్టర్ యజమాని సురేశ్ అధికార పార్టీ బలంతో డ్రైవర్ పైనే కేసు పెట్టారని ఆరోపించారు. డ్రైవర్‌పై దాడికి పాల్పడిన సురేశ్, అతని కుమారుడిపై కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, సత్యం, వెంకటనర్సు, శ్రీను, ఆంజనేయులు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

## భగత్‌సింగ్ విగ్రహం తొలగింపుపై సీపీఐ నిరసన

### ఎమ్మెల్యేతో నాయకుల వాగ్వాదం

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** మండలంలోని సుభాష్ నగర్ కూడలిలో ఉన్న భగత్‌సింగ్ తొలగించడంపై సీపీఐ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఆ కూడలిలోని భగత్‌సింగ్ విగ్రహాన్ని ర.భ శాఖాధికారులు తొలగించారని తెలుసుకొని పార్టీ ముఖ్య నాయకులు అక్కడకు చేరుకున్నారు. జాతీయ నేత, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ విగ్రహం తొలగింపుపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ క్రమంలో నాయకులకు, ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా జాతీయ నేత విగ్రహం తొలగిస్తారా అంటూ వాగ్వాదానికి దిగారు. నాయకులను ఎమ్మెల్యే సముదాయించారు. కూడలిలో ఫౌంటేన్ ఏర్పాటు కోసం విగ్రహం తొలగించారనీ, సుభాష్ నగర్‌లోని భగత్‌సింగ్, రాజీవ్‌గాంధీ విగ్రహాలను తొలగిస్తామనీ, ముందస్తుగా నాయకులకు సమాచారం అందించామని తెలిపారు. వారు స్పందించలేదని పేర్కొన్నారు. తొలగించిన భగత్‌సింగ్, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ప్రధాన రహదారి డివైడర్‌పై ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. భగత్‌సింగ్ విగ్రహం తొలగించిన చోట మరో విగ్రహం ఏర్పాటు చేస్తే సహించేది లేదని నాయకులు పేర్కొన్నారు. డివైడర్‌పై ఏర్పాటు చేయాలని సూచించారు. భగత్‌సింగ్ విగ్రహం తొలగింపు విచారకరమని నాయకులు కె.సారయ్య, బ్రహ్మం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గరుండి తెరాస ఫ్లెక్సీలు, మరో శిలాఫలకం దిమ్మెను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో రఘుపతి, సూర్యం, నాగయ్య, శంకర్, హరీశ్, సాయి పాల్గొన్నారు..

### విద్యార్థి యువజన సంఘాల ఆగ్రహం

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** ఫౌంటేన్ కోసం మండలంలోని సుభాష్‌నగర్ కూడలిలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహం తొలగించడం దారుణమని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హరీశ్, కాంపాటి పృథ్వీ, సాంబ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటైన వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం నిండు ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సహకారంతో అధికారులు తొలగించడం దుర్మార్గమన్నారు. భగత్‌సింగ్ విగ్రహాన్ని తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి... తొలగించిన చోటే భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీతారామరాజు, సాయి, శశాంక్, గుమ్మడి సందీప్ పాల్గొన్నారు.

## క్రమబద్ధీకరించాలని ఐటీడీఏ ఏపీఎంకు వినతి

**ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎస్ఎంహెచ్ వసతి గృహాల్లో వంటలు చేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని కోరుతూ గురువారం కొత్తగూడెంలో ఐటీడీఏ ఏపీఎంకు ఇల్లెందు వసతిగృహాల్లో పని చేస్తున్న కార్మికులు వినతిపత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. 17 సంవత్సరాలు చాలీ చాలనీ వేతనాలతో విద్యార్థులకు వంటలు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నామని అధికారుల వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారిని కలిసిన వారిలో కార్మికులు పద్మ, శైలజ, అంజమ్మ, విజయ, స్వరూప సుధ, దీప, వెంకటమ్మ, రమణమ్మ, సరోజిని ఉన్నారు.

## పెరిగిన కూలీరేట్లు

**గార్ల:** సీఐటీయూ అనుబంధ సంఘం భవన నిర్మాణరంగ కార్మికులు గత నాలుగు రోజులుగా కూలీరేట్ల పెంపుదల కోసం నిర్వహిస్తున్న సమ్మె గురువారంతో ముగిసింది. స్థానిక వర్తక సంఘం భవనంలో మేస్త్రీలు, సుతారీలు, కూలీలతో సంఘం నాయకులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.గిరిప్రసాద్ సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌కె రజాలి, జడ శ్రీను, ఏసు, ఎల్లయ్య, ఉపేందర్, కత్తి యాదగిరి, నాగరాజు, నగేశ్ పాల్గొన్నారు.

ఇల్లెందు

## నేటి నుంచి అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం

**గార్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీదాక అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞాన్ని అఖిల విశ్వగాయత్రి పరివార్, శాంతి కుంజ్, హరిద్వార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గాయత్రి పరివార్ మండల సభ్యురాలు బేతి సువర్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 501 కుండీల యజ్ఞం, సంస్కారాలు, ప్రవచనాలు, దీపయజ్ఞం చేస్తారని వెల్లడించారు. ప్రజలను ఆధ్యాత్మికంగా జాగృత పరచటం, శాంతి సౌఖ్యాలను పెంపొందించే రీతిలో చేపట్టిన కార్యక్రమమే అశమేధ గాయత్రి మహాయజ్ఞమని పేర్కొన్నారు.

**సినిమాలు**
లలిత్‌కళామందిర్: 2కంట్రీస్
సీతారామ: హలో
కళాంజలి : ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి




# లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



గార్ల: తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు



ఇల్లెందు గ్రామీణం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ నాయకులు

**ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే:** లంబాడాలకు మన్యం ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. మండలంలోని జెండాల వాగు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. ఆదివాసీ శ్రేణులను, నాయకులను పోలీసులు అనుమతి లేదంటూ అక్కడే అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కార్యక్రమాన్నిద్దేశించి సంఘం రాష్ట్ర నాయకులు ముక్తిరాజు, ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వసంతరావు మాట్లాడారు. ఆదివాసీ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం 144సెక్షన్‌ను అమలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎఫ్ నాయకులు కుర్సం అంజయ్య, కుంజ కృష్ణ, రమేశ్‌బాబు, సురేశ్, రామూర్తి, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, కృష్ణార్జునరావు, రవి కుమార్ పాల్గొన్నారు. ఎస్ఐ కొమురెల్లి అక్కడికి చేరుకొని 144సెక్షన్ అమలులో ఉన్నందున ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించకూడదని సూచించారు.

**బయ్యారం, న్యూస్‌టుడే:** లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. గాంధీసెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగించి అక్కడ గంటపాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు కబ్బాకుల రవి, గొగ్గల కోటయ్య, తాటి జనార్దన్ మాట్లాడారు. లంబాడీలకు కుల, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. గిరిజనేతరులపై లంబాడీలు పెట్టిన అట్రాసిటీ కేసులు చెల్లవన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కృష్ణ, రామకృష్ణ, సీతారాములు, స్వామి, నర్సయ్య, భాస్కర్, రవి, నర్సింహారావు, బాబు, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

**ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆదివాసీలు మనుగడ, సంక్షేమం, హక్కుల కోసం జాతి పోరాటాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగా భావించి 144 సెక్షన్ అమలు చేస్తోందని ఏఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసాల సురేశ్ ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటైన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారాలు ఎస్టీలుగా రాజ్యాంగంలో ఎక్కడ గుర్తించలేదన్నారు. దశబ్దాలుగా ఎస్టీ రిజర్వేషన్‌ను అన్ని రంగాల్లో ఆదివాసీ తెగలకు దక్కకుండా లంబాడీలే దొడ్డిదారిని పొందుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నర్సింహారావు, నాగరాజు, చింత ఉపేందర్, గోవర్ధన్, చైతన్యం, సాంబశివరావు, మల్లేశ్, వీరభద్రం పాల్గొన్నారు.

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** లంబాడీలకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు నిలుపుదల చేయాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(ఏటీఎఫ్) రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తుడుందెబ్బ, ఏటీఎఫ్, ఏఎస్‌యూ, ఏఎమ్ఎస్, నిరుద్యోగుల ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో లంబాడాలు సామాజిక వర్గకులానికి చట్టబద్ధత లేని ఎస్టీ గుర్తింపు హోదాను రద్దు చేయాలని కోరారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కల్తి సత్యనారాయణ, ఏటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాయం ఆనందరావు, ఎం.బుచ్చయ్య, ఎం.సూరయ్య పాల్గొన్నారు.

**గార్ల, న్యూస్‌టుడే:** లంబాడీలకు ఎస్టీ కుల, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకూడదనీ, వారికి ఇచ్చిన ఉద్యోగాలను రద్దు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం, ఆదివాసి మహిళా సంఘం, తుడుందెబ్బ నాయకులు డిమాండు చేశారు. వారికి ఎస్టీ హోదాను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి-తుడుందెబ్బ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ప్రదర్శనగా భారీగా తరలివచ్చారు. మండలంలోని ఆదివాసీ విద్యార్థి సంఘం, మహిళా సంఘం, తుడుందెబ్బ నాయకులు ఎన్.నర్సింహారావు, ఈ.కోటేశ్వరరావు, సిద్ధబోయిన నాగరత్నం, గుమ్మడి కుమారి, తాటి సమ్మయ్య, కబ్బాకుల భద్రయ్య, బుచ్చి రాములు, గొగ్గెల వీరస్వామి, సిద్ధబోయిన ఎర్రయ్య తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. సంబంధిత వినతిపత్రాన్ని జిల్లా కలెక్టరుకు సమర్పించనున్నట్లు తహసీల్దార్ ఆదివాసీ హక్కుల పోరాట సమితి- తుడుందెబ్బ నాయకులకు తెలిపారు.

## నిరుద్యోగ పాదయాత్రను విజయవంతం చేయాలి

**ఇల్లెందు, న్యూస్‌టుడే:** జిల్లాలోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 8న భద్రాచలం నుంచి నిరుద్యోగ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెఐకాస నాయకులు తెలిపారు. ఈ పాదయాత్రను నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలో గురువారం నాయకులు నిరుద్యోగ పాదయాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు. భద్రాచలం నుంచి ప్రారంభమై ఈ పాదయాత్ర కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 9న ముగుస్తుందనీ, అమరవీరుల స్థూపం వద్ద సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒప్పంద, పొరుగు సేవల వ్యవస్థలను రద్దు చేయాలని కోరారు. నిరుద్యోగులకు రూ.5వేల భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి: తెఐకాస

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని తెఐకాస మండల అధ్యక్షుడు తేజావత్ మాన్‌సింగ్ డిమాండ్ చేశారు. టేకులపల్లిలో గురువారం తెఐకాస ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పిలుపు మేరకు నిరుద్యోగ పాదయాత్రను జయప్రదం చేయాలని గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ పాదయాత్ర ఈ నెల 8న ఉదయం 10గంటలకు భద్రాచలం అంబేడ్కర్ కేంద్రం నుంచి ప్రారంభమై ఈ నెల 9న కొత్తగూడెం అమరవీరుల స్థూపం వరకు వచ్చి ముగుస్తుందన్నారు. అదే రోజు సాయంత్రం 4గంటలకు జిల్లా కేంద్రం ధర్నాచౌక్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గ ఛైర్మన్, సమన్వయకర్తలు భూక్యా రవి, ఎస్కే గౌస్, రాంబాబు పాల్గొన్నారు.

## మంద కృష్ణమాదిగను విడుదల చేయాలి

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నల్లకట్ల వెంకన్న డిమాండ్ చేశారు. టేకులపల్లి మండలం శంభునిగూడెంలో గురువారం జరిగిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణమాదిగపై అక్రమంగా కేసులు పెట్టడం ముఖ్యమంత్రి దొర అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలనీ, అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లే విషయంలో తప్పించుకుంటున్నారన్నారు. మంద కృష్ణమాదిగపై పెట్టిన కేసులు ఉపసంహరించుకొని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేశ్, వి.సతీశ్, సుధాకర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి మూడు జిల్లాల స్థాయి షటిల్ పోటీలు

**గార్ల, న్యూస్‌టుడే:** గార్లలో శుక్రవారం సాయంత్రం నుంచి మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ కప్ నిర్వాహకులు విశాల్‌కుమార్‌జైన్, జిలానీ, ప్రశాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ దాకా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## ఇల్లెందు ఎంపీడీవోగా మహ్మద్ జాఫర్‌ఖాన్

**ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇల్లెందు ఎంపీడీవోగా మహ్మద్ జాఫర్‌ఖాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి నుంచి ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడి వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఉన్న కనకదుర్గ తిరిగి ఆమె తన సొంత పోస్టు ఈవోపీఆర్డీగా కొనసాగనున్నారు. సంవత్సర కాలంగా ఇన్‌ఛార్జీ ఎంపీడీవో పాలనతో సతమతమవుతున్న మండలానికి ఎట్టకేలకు మోక్షం లభించినట్లయింది. ఈ సందర్భంగా జాఫర్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల, అధికారుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. గతంలో ఇల్లెందు, గుండాలలో మండల పరిషత్‌లో పని చేసిన అనుభవంతోపాటు తన సొంత ఊరు ఇల్లెందు అని వివరించారు.

## గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**గార్ల, న్యూస్‌టుడే:** మండల గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీని గార్లలో గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షుడుగా మేళ్లచెర్వు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పగడాల రామారావు, సహాయ కార్యదర్శిగా కాముని శ్రీనివాస్(రెడ్డి), కోశాధికారిగా అమరాజు ఉపేందర్, జిల్లా కమిటీ సభ్యులుగా రేళ్ల అనిల్‌కుమార్, బొడ్డుపల్లి వెంకన్నతోపాటు కమిటీ సభ్యులుగా పంతంగి సంపత్‌కుమార్, ముఖేశ్, గురుపాదం, ఎం.ఉపేందర్, శంకర్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

# సర్వసభ్య సమావేశం మమ

**శాఖల సమీక్ష పూర్తికాకుండానే ముగింపు**

**బయ్యారం, న్యూస్‌టుడే:** బయ్యారం మండల సర్వసభ్యసమావేశం గురువారం సాదాసీదాగా కొనసాగింది. కొన్ని శాఖలపై సమీక్ష లేకుండానే సమావేశం ముగించేశారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం మొక్కుబడిగా కొనసాగినట్లైంది. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన గురువారం ఏర్పాటైంది. సమావేశం ప్రారంభంలో అటవీశాఖపై సమీక్ష సందర్భంగా నామాలపాడుకు తాగునీటికి బోరువేయడానికి అనుమతి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని ఎఫ్ఆర్వో ప్రసాద్‌ను సర్పంచి శ్రీనివాసరావు ప్రశ్నించారు. రైతులు విద్యుత్తు మోటార్లకు కరెంట్ లైన్ కూడా వేయనీయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారనీ, దశాబ్దాల కాలంగా గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న రెవెన్యూ భూములు అటవీ భూములని పేర్కొంటూ ఆందోళనకు గురి చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యులు గౌని ఐలయ్య, వైస్ఎంపీపీ మధుకర్‌రెడ్డి ఎఫ్ఆర్వోను నిలదీశారు. ఈ నేపథ్యంలో పోడుభూముల విషయంలో తాము చేసిందేమిలేదని గూగుల్‌మ్యాపు ప్రకారమే గుర్తిస్తున్నామని ఎఫ్ఆర్వో సమాధానమిచ్చారు. మిషన్ భగీరథ పథకంలో నిర్మించాల్సిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను త్వరితగతిన పూర్తిచేయాలని ఏఈని కోరారు. పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ సమయంలో వేలిముద్రలు పడని వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని సంబంధిత అధికారులను కోరారు. రహదారులకు అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించాలనీ, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చాలని విద్యుత్తు ఏఈకి సూచించారు. ఇదిలా ఉండగా పశువైద్యాధికారులు, ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖ, ఉద్యానవనశాఖ, కస్తూర్బా పాఠశాల, అబ్కారీశాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరుకాలేదు. అంతేగాక హాజరైన శాఖలపై సమీక్ష పూర్తికాకుండానే అధికారులు, ప్రజాప్రతినిదులు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. జడ్పీటీసీ సభ్యులు గౌని ఐలయ్య, తహసీల్దార్ రాధాకృష్ణప్రసాద్, ఎమ్పీడీవో చంద్రశేఖర్, ఎమ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి



కాలమానిని ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

# ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలి

**బయ్యారం, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను ప్రభుత్వం వెంటనే రూపొందించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగానాయక్, మండల అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం రూపొందించిన క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సునిత, కోటేశ్వర్‌రావు, కిషన్‌నాయక్, ఉప్పలయ్య, రామ్‌నాయక్, సరోజిని, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు లక్కినేని సురేందర్ పేర్కొన్నారు. టేకులపల్లి కస్తూరిబా విద్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ కాలమానినీలను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెరాస ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించుటకు తగు చర్యలు తీసుకుంటున్నదని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేలా అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు వాసం వరలక్ష్మి, కార్యదర్శి కిశోర్‌సింగ్, బి.రవికుమార్, ఆర్.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



కాలమానినిలతో జడ్పీటీసీ లక్కినేని, ఉపాధ్యాయులు

# కొత్తగూడెం

## బాధిత కుటుంబాలకు పరిహారం

**కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే:** పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉండి పంట రుణాలు తీసుకొని చనిపోయిన రైతు కుటుంబాలకు బీమా పరిహారాన్ని అందజేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, ముగ్గురు రైతు కుటుంబ సభ్యులకు రూ.1.5 లక్షలు పరిహారాన్ని అందజేశారు. సీఈవో రాంబాబు, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

## నర్సింహసాగర్ స్లాబ్ కల్వర్టుకు రూ.25 లక్షలు

**సుజాతనగర్(కొత్తగూడెం గ్రామీణం), న్యూస్‌టుడే:** సుజాతనగర్ మండలంలోని నర్సింహసాగర్-కొత్త అంజనాపురం రహదారిపైన స్లాబ్ కల్వర్టుకు రూ.25 లక్షల నిధులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జలగం వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాఫిక్ ప్రక్షాళనకు సమగ్ర చర్యలు

- శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులపై చర్యలు
- 'న్యూస్‌టుడే'తో డీఎస్పీ ఎస్‌ఎం.అలీ

ముఖాముఖి

**జిల్లా కేంద్రంగా మారిన కొత్తగూడెంలో ట్రాఫిక్ సమస్య ప్రధాన ఇబ్బందిగా మారుతోంది. ట్రాఫిక్ సిబ్బంది కొరత వెంటాడుతున్న క్రమం, కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాహనదారులు సైతం గమ్యం చేరాలనే ఆతృతతో ప్రమాదాలకు చేరువవుతున్నారు. భారీ వాహనాల ప్రవేశం పట్టణంలో అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. సమయానుసారంగా ఎంజీ రోడ్‌లోకి ప్రవేశించాల్సిన భారీ వాహనాలు జన రద్దీ సమయంలోనే రాకపోకలు సాగించడం, పెద్దబజార్, చిన్నబజార్ లాంటి మార్కెటింగ్ ప్రాంతాల్లో దిగుమతులు, ఎగుమతులు తలనొప్పిగా మారుతున్నాయి. ప్రజల్లో సైతం కొంత చైతన్యం లేమి స్వయంకృతాపరాధాలకు దారితీస్తోంది. మొత్తానికి కొత్తగూడెంలో మాత్రం ట్రాఫిక్ సమస్య గుదిబండలా మారుతోంది. ఈ సమస్య పరిష్కారానికి పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన నేపథ్యంలో గురువారం కొత్తగూడెం సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎస్‌ఎం.అలీతో 'న్యూస్‌టుడే' ముఖాముఖీ నిర్వహించింది. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.** – కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే



➡ **న్యూస్‌టుడే:** కొత్తగూడెంలో ట్రాఫిక్ సమస్య ప్రజానీకాన్ని, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.?

**డీఎస్పీ:** జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను ప్రక్షాళన చేసే దిశగా చర్యలు చేబట్టబోతున్నాం. పక్కా ప్రణాళిక ప్రకారం సమస్య పరిష్కారానికి సిబ్బందికి తగిన సూచనలు చేస్తున్నాం. స్వయంగా తిరిగి ట్రాఫిక్ సమస్యను పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలపై అన్వేషణ కొనసాగిస్తున్నాం.

➡ **న్యూస్‌టుడే:** ప్రమాదరహితంగా ఎలాంటి ప్రణాళికలు చేపట్టబోతున్నారు?

**డీఎస్పీ:** ముందుగా వాహనదారుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. కచ్చితంగా శిరస్త్రాణం ధరించాలని సూచనలు చేస్తున్నాం. మనతో ప్రారంభం కావాలనే ఉద్దేశంతోనే సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేశాను. హెల్మెట్ లేకుండా కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎవరూ వాహనం నడపకూడదని. మేము పాటిస్తూ ఇతరులతో పాటించేలా చేయడంతో ఆరంభిస్తాం.

➡ **న్యూస్‌టుడే:** పట్టణంలోని లేపాక్షి రోడ్ కూడలిలో ఖాళీగా వదిలేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులు సైతం నాలుగు కూడళ్లలో వాహనాలు గుమికూడటం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారు.

**డీఎస్పీ:** ఆ కూడలిలో బారికేడ్లను ఏర్పాటు చేయడానికి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. పాత ఎస్‌బీహెచ్ బ్రాంచి ఎదురుగా బారికేడ్లను తొలగించడం వల్ల అక్కడేమైనా ప్రమాదాలు జరుగుతాయా? అని సందేహిస్తున్నాం. వాహనదారుల రక్షణ నిమిత్తం అవసరమైతే ఆ రెండు చోట్ల సైతం బారికేడ్లను ఏర్పాటుచేసి వాహనదారులు సవ్యంగా వెళ్లేందుకు చర్యలు సత్వరంగానే చేపడతాం.

➡ **న్యూ.టు:** మూడో పట్టణ కూడలిలో బారికేడ్ల ఏర్పాటుతో రైల్వే స్టేషన్‌కి వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ తొలగించాలని చాలామంది కోరుతున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదు?

**డీఎస్పీ:** ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల కొంత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది సంఖ్య సైతం తక్కువగా ఉండటం వల్ల పూర్తి స్థాయిలో శ్రామికశక్తిని వినియోగించుకునే పరిస్థితి లేదు. అంతే కాకుండా అక్కడ ప్రమాదాలు సంభవించే విధంగా మూలమలుపు ఉండటం వల్ల ఆలోచిస్తున్నాం. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికుల వరకు ప్రత్యామ్నాయ చర్యలు ఆలోచించి ఆచరణలోకి తీసుకొస్తాం.

➡ **న్యూ.టు:** గణేశ్‌బస్తీ, రైతుబజార్ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. అక్కడ ట్రాఫిక్ నియంత్రణ కొరవడుతుంది. ఈ సమస్య పరిష్కారానానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

**డీఎస్పీ:** ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించి సమస్యను పరిష్కరిస్తాం. ఎక్కువ శాతం రహదారులపై కార్లు, ఇతర వాహనాలు ఆపడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటిని నివారించేందుకు రోడ్లపై నిలిపిన కార్లు కదలకుండా లాకులను వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నాం. సదరు వాహనదారుడు పోలీసులను ఆశ్రయించిన అనంతరమే వాహనం రిలీజ్ చేయడం జరుగుతుంది.

➡ **న్యూ.టు.:** కార్లు రోడ్లపై నిలపకూడదంటే వారికి ప్రత్యామ్నాయంగా రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుచేసుకునే అవకాశం ఉండట్లేదనే వాదనలున్నాయి. అక్కడ ధరలు ధికంగా ఉండటం వల్ల వాహనదారులు సుముఖత చూపడం లేదు.

**డీఎస్పీ:** రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చేసుకునేందుకు గుత్తేదారులో చర్చలు నిర్వహిస్తాం. ధరల విషయంలో వెసులుబాటు కల్పించే చర్యలు తీసుకుంటాం. షాపింగ్ కోసం వచ్చిన వ్యక్తులు కాసేపటి వరకు మాత్రమే పార్కింగ్ చేస్తారు కాబట్టి ఆ మేరకు మాత్రమే పార్కింగ్ ధరలు వసూలు చేసేలా చొరవ చూపిస్తాం.

➡ **న్యూ.టు.:** ప్రధాన జంక్షన్లలో(నాలుగు రహదారుల వద్ద) ఆటోలు విపరీతంగా నిలుపుతున్నారు. ఇతర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

**డీఎస్పీ:** ఇప్పటికే ఆటో కార్మిక సంఘాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్నేహపూర్వకంగా వారికి సూచనలు చేశాం. పోలీసుల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటాం. కూడళ్లలో ఆటోలు నిలుపకుండా పకడ్బందీ చర్యలు చేపడతాం.

➡ **న్యూ.టు.:** పట్టణంలో ఉదయం తొమ్మిది గంటల తరువాత, రాత్రి తొమ్మిది గంటల లోపు భారీ వాహనాలకు అనుమతి లేదనే హెచ్చరికలున్నాయి. అయినా కొన్ని ప్రవేశించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి కదా.! వాటిపై ఎలా స్పందిస్తారు?

**డీఎస్పీ:** భారీ వాహనాలు గతంలో ఉన్న నిబంధనల ప్రకారం కొనసాగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. సిబ్బందికి సైతం హెచ్చరికలు చేపట్టాం. భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా లోపలికి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవు.



కొత్తగూడెంలో ట్రాఫిక్ రద్దీ ఇలా..

## రేపు కొత్తగూడెంలో సంగీత విభావరి

**కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఎ.ఆర్.రెహమాన్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 6వ తేదీన 'అమృత వర్షిణి ఈవెంట్స్ అండ్ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్' ఆధ్వర్యంలో ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చిన పాటలతో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, గాయకులు అలిపిరెడ్డి ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'అలై పొంగే సంగీతం' పేరుతో కొత్తగూడెంలోని పోస్టాఫీసు సెంటర్‌లో ఉన్న సింగరేణి గర్ల్స్ హైస్కూల్‌లో శనివారం సాయంత్రం 7 గంటల నుంచి సంగీత విభావరి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సినీ ఆర్కెస్ట్రా సంగీత సారథ్యంలో వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా ఉచితంగా నిర్వహిస్తున్న సంగీత విభావరిని జయప్రదం చేయాలన్నారు.

## కలెక్టర్‌కు క్రీడా సంఘాల శుభాకాంక్షలు

**కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీని కలిసి నూతన సంవత్సర శుభాకాక్షంలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచి రాణిస్తున్న క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్, జిల్లా త్వైకాండో అసోసియేషన్, జిల్లా ఇండియన్ స్టైల్ అసోసియేషన్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులున్నారు.

## అవసరమైతే ఆస్తుల జప్తు: కమిషనర్

**పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే:** పాల్వంచ పురపాలక పరిధిలో ఆస్తిపన్నులు వసూలు కార్యక్రమం మందకొడిగా సాగుతుందని, అధికారులు బిల్ కలెక్టర్లు వసూళ్లను వేగవంతం చేయాలని పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ షఫీఉల్లా అన్నారు. గురువారం సాయంత్రం పురపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరో రెండున్నర నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా ఇంకా 28శాతం పన్నులు వసూలుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్ కలెక్టర్ల వారీగా రోజుకు రూ.25వేల వరకు వసూలు చేయాలని నిర్దేశించారు. వీటితో పాటు నీటిపన్ను, ట్రేడ్ లైసెన్సుల రెన్యూవల్స్‌పై దృష్టి సారించాలన్నారు. మొండి బకాయిదారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని, స్పందించని పక్షంలో ఆస్తులను సైతం జప్తు చేయాలని అధికారులనాదేశించారు. పన్ను వసూలుకు ఐకేపీ సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రణాళికాధికారి వి.ఎస్.వరప్రసాద్, పురపాలక ఆర్వో ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముర్తుజా, బిల్ కలెక్టర్లు రాములు, సారయ్య, నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రహదారి నిర్మాణం

**పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే:** పాల్వంచ పురపాలక పరిధిలోని ఇందిరానగర్ కాలనీ నుంచి శివనగర్ వరకు రెండు నెలల క్రితం మిషన్ భగీరథ తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ తవ్వకాల్లో రోడ్లతో పాటు కాల్వలు సైతం పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. కాల్వలకు మరమ్మతులు చేపట్టపోయిన కాల్వల్లో మట్టిని మాత్రం అక్కడక్కడ సదరు గుత్తేదారు తొలగించారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, వనమా కాలనీ, జయమ్మ కాలనీ తండా, హమాలీ కాలనీ వాసులు నానా అవస్థలు పడ్డారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సు వచ్చే మార్గం లేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో రహదారి పనులు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. గురువారం జయమ్మకాలనీలో మెటల్ రోడ్డుకు సంబంధించిన కంకరను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మెటల్ రోడ్డుపైనే పురపాలక అధికారులు సీసీ రహదారిని నిర్మించనున్నారు.



మెటల్ రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

## పనులు సగం.. సగం!

### ముగిసిన టెండర్ల ప్రక్రియ

**పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే:** పాల్వంచ పురపాలక పరిధిలోని ప్రాంతాలలో ఆయా గ్రాంట్‌లకు సంబంధించిన రూ.22 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందు ఆన్‌లైన్ ద్వారా అధికారులు టెండర్లను ఆహ్వానించారు. గతేడాది డిసెంబరు 19న టెండర్లను తెరచినట్లు అధికారులు చెబుతున్నారు. వాటిలో మూడు పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియ ఈ నెల 2వ తేదీతో గడువు ముగిసింది. మిగిలిన పనులకు సంబంధించిన టెండరు గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో పురపాలక కార్యాలయ పరిసరాలు అధికార పార్టీ చోటా నాయకులతో కళకళలాడింది. ఉదయం నుంచే పురపాలక, అధికార పార్టీకి చెందిన గుత్తేదారులు తమ సహాయకులతో కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు గుత్తేదారు ఎవరైనా ఆన్‌లైన్‌లో టెండరు వేస్తే దానికి సంబంధించిన హార్డ్‌కాపీని కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. దీంతోపాటు కొంత మొత్తంలో నగదును ప్రాసెసింగ్ ఫీజు రూపంలో చెల్లించాలి. వాస్తవంగా ఆన్‌లైన్ టెండర్లలో హార్డ్‌కాపీ సమర్పణ, ప్రాసెసింగ్ ఫీజులాంటివి ఏవీ ఉండవన్నట్టు తెలుస్తుంది. బయట గుత్తేదారులు టెండర్లలో పాల్గొనకుండానే ఉండాలనే కొత్తగా ఈ నిబంధనలను ఏర్పాటు చేశారని కొంత మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయ పరిసరాల్లోని చెట్లకింద తచ్చాడుతూ గుత్తేదారులు కనిపించారు. ఇప్పటికే అధికార, పురపాలక గుత్తేదారులు ఏకతాటిపైకి వచ్చి పనులను సగంసగం పంచుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

# కొత్తగూడెం

## విద్యార్థులకు అల్పాహారం అందజేత

**కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే:** విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపులో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని పాతకొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు అదనపు తరగతులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు.



## కొత్తగూడెంలో పోలీసు తనిఖీలు



పోస్టాఫీస్ కూడలిలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ కె.కుమారస్వామి

**కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే:** కొత్తగూడెం పట్టణ, మండల పరిధిలో గురువారం సాయంత్రం ట్రిపుల్ రైడ్ తనిఖీలను పోలీసులు విస్తృతంగా చేపట్టారు. సాయంత్రం ఐదు గంటల నుంచి అన్ని రాజాల పరిధిలో ప్రత్యేకంగా ఒకే వాహనంపై ముగ్గురు వెళ్లేవారిని మాత్రమే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని డీఎస్పీ ఎస్ఎం.అలీ పోలీసు అధికారులకు ఆదేశించారు. దాంతో అన్ని రాజాల పరిధిలో సీఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ పోలీసులు ట్రిపుల్ రైడ్ తనిఖీలు కొనసాగించారు. నిబంధనల ప్రకారం ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించడం నేరమని వారికి కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానాలు విధించారు. కొత్తగూడెంలో డీఎస్పీ ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో తనిఖీలు కొనసాగించారు.

### సీతంపేట పంచాయతీలో తనిఖీలు

**సుజాతనగర్(కొత్తగూడెం గ్రామీణం), న్యూస్‌టుడే:** సుజాతనగర్ ఎస్సై రతీష్ గురువారం సీతంపేట పంచాయతీలో తనిఖీలు చేపట్టారు. సీతంపేట, సీతంపేట బంజర గ్రామాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గతంలో నేరచరిత్ర ఉన్న వారిని పిలిపించి వారితో మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేలా స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత సహకరించాలన్నారు.

### ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలి

**కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలని ఒకటో పట్టణ సీఐ కె.కుమారస్వామి సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లుగా అనుమానిస్తున్న వారికి, ఆటో డ్రైవర్లకు గురువారం సాయంత్రం రాణాలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించే విధంగా ముఠాలను కొనసాగించినా చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదగా ఉండాలన్నారు.

## 'సమస్యలను పరిష్కరిస్తాం'

**పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే:** నూతన జిల్లాల ఆవిర్భావం తరువాత 108 సిబ్బందికి సంబంధించిన సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని 108 జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా.దయానందస్వామిని కోరారు. గురువారం పాల్వంచ సీహెచ్‌సీ కేంద్రంలో ఆయనను కలిశారు. నూతన జిల్లాల ఆవిర్భావం తరువాత సిబ్బందికి వేతనాలు అందుతున్న ఈఎస్ఐ, భవిష్య నిధి(పీఎఫ్) వంటివి చెల్లించడం లేదని తెలిపారు. దీంతో స్పందించిన ఆయన సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. 108 జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సెక్రటరీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'నిరసన దీక్షలను జయప్రదం చేయాలి'

**పాల్వంచ(గ్రామీణం), న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అఖిల పక్షం కమిటీని కేంద్రం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6, 7, 8న జరిగే నిరసన దీక్షల్లో పాల్గొని జయప్రదం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ మోదుగు జోగారావు కోరారు. గురువారం తెలంగాణ మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి నేతృత్వంలో ఉద్యమం చేయడం జరుగుతుందన్నారు. రెండుసార్లు అఖిల పక్షం అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. సంపత్‌కుమార్, సమ్మయ్య, నాగేంద్ర, కృష్ణ, వినోద్, కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిలీ జయంతి వేడుకలు

**కొత్తగూడెం గణేశ్‌టెంపుల్, న్యూస్‌టుడే:** అంధకారంలో మగ్గుతున్న చూపులేని వారి జీవితాల్లో లూయీ బ్రెయిలీ వెలుగులు నింపి వారిపాలిట అక్షర ప్రదాతగా నిలిచారని టీవీపీఎస్ అధ్యక్షుడు సతీష్ పేర్కొన్నారు. బ్రెయిలీ 209వ జయంతి వేడుకలను గురువారం బస్టాండ్ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. శ్రీను, నాగేశ్వరరావు, బిల్లా బాబూరావు, శైలజ, చాంద్‌పాషా, దుర్గాపవన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి త్రైక్వాండో పోటీల్లో ప్రతిభ

**లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే:** జాతీయస్థాయి త్రైక్వాండో పోటీల్లో లక్ష్మీదేవిపల్లి పంచాయతీ అశోక్‌నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు ప్రతిభ ప్రదర్శించి బహుమతులు సాధించారు. ఈ నెల 2న ఒంగోలులో జరిగిన జాతీయ స్థాయి త్రైక్వాండో పోటీల్లో బరిగెల కృష్ణ రజతం, దత్తు జగదీష్ కాంస్య పతకాలను సాధించారు. ఉత్తమ ప్రతిభ సాధించిన వారిని కోచ్ ఎం.డి.మగ్బుల్ హుస్సేన్ అభినందించారు.

## 'మంద కృష్ణ అరెస్టు అన్యాయం'

**కొత్తగూడెం గణేశ్‌టెంపుల్, న్యూస్‌టుడే:** మంద కృష్ణ మాదిగను అక్రమంగా అరెస్ట్ చేశారని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్లూరు కుమార్ అన్నారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనిగాల మొగిలి, దాసరి శ్రీనివాస్, డి.సోమయ్య, రమేష్, కె.కృష్ణ, దాసరి సారధి తదితరులు పాల్గొన్నారు.

## 'వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు'

**కొత్తగూడెం గణేశ్‌టెంపుల్, న్యూస్‌టుడే:** వర్గీకరణ పేరుతో ప్రభుత్వాలు దళితుల మధ్య చిచ్చు పెడుతున్నాయని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ పేర్కొన్నారు. గురువారం హనుమాన్‌బస్తీలో సంఘ సమావేశం నిర్వహించారు. కేసీఆర్ కేవలం ఓటు బ్యాంక్ కోసం ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. దళితులందరూ కలిసికట్టుగా ఉండి అంబేడ్కర్ ఆశయ సాధనతో ముందుకు సాగాలని కోరారు. సంతోష్‌కుమార్, సాయి, కిరణ్, శ్రీను, రాము, కుమార్, రాంబాబు, గణేష్, శ్రీకాంత్, భాగ్య, ఉష పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ దైనందిని ఆవిష్కరణ

**కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను నమోదు చేసేలా ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ అన్నారు. గురువారం పీఆర్‌టీయూ దైనందిని, జీవోల పుస్తకాన్ని సంయుక్త కలెక్టర్ రాంకిషన్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి విద్యతోనే ఉత్తమ భవిష్యత్తును అందించగలమని, నూతన సంవత్సరంలో సరికొత్త ఉత్సాహంతో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసేలా కృషి చేయాలని సూచించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిసింగ్, మోహన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శులు రత్న, చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గం రవిందర్, కళావతి, హీరాలాల్, ప్రసాద్, అప్పల్ల నిర్మల, శారద పాల్గొన్నారు.

## యూసీఎఫ్ నూతన కమిటీ

**పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే:** మండల యూసీఎఫ్(యూనివర్సల్ చర్చ్ ఫెలోషిప్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లోని మెర్సీ సువార్త ప్రార్థన మందిరంలో మండల పాస్టర్ల సమక్షంలో 2018-19 నూతన కమిటీని ఎన్నుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా పాస్టర్.ఎం.జాన్ విల్సన్, సెక్రటరీగా పాస్టర్ జి.సామ్యూల్ దయానిధి, కోశాధికారులుగా పాస్టర్లు జి.శ్రీను, ప్రేమ్‌కుమార్, ట్రైబస్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ 2020వరకు కొనసాగుతుందని గౌరవ అధ్యక్షుడు పాస్టర్ జి.దేవదాస్ తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు పి.ఏసోషు, యేసురత్నం, దన్‌రాజ్, భాస్కర్ రావు, యోబు, జాన్‌బాబు, రవి పాల్గొన్నారు.

## సర్పంచిపై గ్రామస్థుల ఆగ్రహం

**పాల్వంచ(గ్రామీణం), న్యూస్‌టుడే:** పాండురంగాపురంలో 1, 2, 3 వార్డులకు నీటి సరఫరా చేయడంలో సర్పంచులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 15 మందిదాకా గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఆ సమయంలోనే సర్పంచి బిచ్చా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి బిల్లులు కట్టకుంటే ఎలా నీటి సరఫరా చేస్తామని అనడంతో ఎన్ని నెలలు నుంచి పైపులైన్ వేయకుండా ఉంచారని నిలదీశారు. రూ.10 వేలతో అయ్యే పని 10 నెలలు నుంచి రేపు, మాపని తాత్సారం చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కొన్ని వీధులకు నీరు ఎక్కువై కాల్వల్లో పొంగిపోతున్నాయని మాజీ మా దుస్తులు శుభ్రం చేసుకున్న నీటిని కల్లాపి చల్లుకోవాల్సిన దుస్థితికి తీసుకొచ్చారని ఆగ్రహంతో ఊగిపోయారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కలగజేసుకొని రెండు రోజుల్లో పైపు లైన్లు వేస్తామని ఇంటిబిల్లులు నీరొచ్చిన అనంతరం కట్టాలని అనడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఆందోళనలో గ్రామస్థులు లక్ష్మి, చంద్రకళ, పద్మ, సైదమ్మ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచితో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

## పెద్దమ్మ తల్లికి సువర్ణ పుష్పార్చన

**పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** జగన్నాధపురం-కేశవాపురం గ్రామాల నడుమ కొలువై ఉన్న పెద్దమ్మ తల్లికి సువర్ణ పుష్పార్చన పూజ నిర్వహించారు. గురువారం కావడంతో అమ్మవారికి ఆలయ అర్చకుడు పురాణం పురుషోత్తమశాస్త్రి ఆధ్వర్యంలో 108 పుష్పాలతో సువర్ణ పుష్పార్చన పూజ జరిపారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాత సేవ, హారతి, మంత్ర పుష్పార్చన, నివేదన తదితర పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, అధ్యక్షులు సంకటాల శ్రీనివాస్, కోడి బాలశౌరి, ధర్మకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 8న భక్తులు హుండీలో సమర్పించిన కానుకను లెక్కిస్తున్నట్లు తెలిపారు.

## 'ఉపాధికి భరోసాను కల్పించాలి'

**కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** అక్షయపాత్ర ఏర్పాటుతో పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధిని కోల్పోకుండా చూడాలని భాజపా పట్టణాధ్యక్షుడు కామేశ్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని పాఠశాలలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందిపడుతూ పాఠశాల మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం భరోసాను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. భాజపా నాయకులు మల్లేశ్, రాములు, రమేశ్, విష్ణువర్ధన్, రవికుమార్, పాషా పాల్గొన్నారు.

## అర్హులందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

**లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే:** అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా ప్రకటించేందుకు సహకరించాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం కారుకొండ, చాతకొండ పంచాయతీలో ఏర్పాటుచేసిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు కోరుకుంటే మరుగుదొడ్డి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని రూ.6500 సరఫరా చేయిస్తామన్నారు. ఈవోఆర్డీ రమేశ్, ఏపీవో రఘుపతి, చాతకొండ, కారుకొండ సర్పంచులు వెంకటేశ్వర్లు, భారతి, ఎంపీటీసీలు నళినీకుమారి, రమేశ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యలో మార్పుతోనే బలోపేతం

**పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యలో మార్పుతోనే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్తయ్య అన్నారు. గురువారం పాతపాల్వంచ ఎంఈవో కార్యాలయం ఎదుట ఆ సంఘం దైనందిని, కాలమానిని ఆవిష్కరణ చేశారు. ఎంఈవో సరస్వతి తొలి దైనందిని, కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ అమల్లో జాప్యం, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వీరన్న, బుచ్చి రాములు, హార్‌సింగ్, సుధాకర్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



దైనందిని, కాలమానిని ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

## దుకాణ సముదాయాల టెండర్లకు దరఖాస్తులు



కార్యదర్శి గోపాల్, ఛైర్మన్ హరిలాల్ నుంచి దరఖాస్తు పత్రాలను అందుకుంటున్న లక్ష్మీదేవిపల్లి ఎంపీటీసీ శ్రీను

**లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే:** లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు పరిధిలోని 42 దుకాణ సముదాయాలకు టెండర్ల ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించారు. పీసా చట్టం ప్రకారం దుకాణాలను ఎస్టీలకే కేటాయించారు. దరఖాస్తుదారుడు రూ.1000 నగదు చెల్లించి దరఖాస్తులు పొందాలని అధికారులు సూచించారు. ఈ నెల 20 వరకు దరఖాస్తులు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి గోపాల్ తెలిపారు. ఒక వ్యక్తికి రెండు దుకాణాలు మాత్రమే కేటాయిస్తారన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి ఎంపీటీసీ సభ్యులు పూనెం శ్రీను దరఖాస్తును పొంది కార్యదర్శి గోపాల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరిలాల్ సమక్షంలో అందజేశారు. మొదటి రోజు కావడంతో దరఖాస్తుల విక్రయాలు పెద్దగా జరగలేదు. ఇందులో ఎస్టీలతో టెండర్లు వేయించి దుకాణాలను దక్కించుకునేందుకు పలువురు గిరిజనేతరులు ప్రయత్నాలు చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.